

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత
వెలుగు
05.01.2019
www.v6velugu.com
శనివారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 320 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



జనరల్
సీఎం సొంతూర్లో పంచాయతీ వేడి
సిద్దిపేట జిల్లా చింతమడక సర్పంచ్ పదవికి ఈసారి పెద్ద సంఖ్యలో రెడీ అవుతున్న ఆశావహులు. 04



దేశం - విదేశం
అయోధ్య కేసు విచారణ 10కి వాయిదా
పిటిషన్‌పై విచారణ ప్రారంభమైన వెంటనే వాయిదా వేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం 05



ప్లే
గుప్పిట్లోనే సిడ్నీ టెస్ట్
నాలుగో టెస్టు రెండో రోజు 622 పరుగుల భారీ స్కోరుతో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన టీమిండియా. 11



బిజినెస్
అనిల్ అంబానీని అరెస్టు చేయండి
ఆర్ కామ్ బకాయిల విషయంగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిన స్వీడన్ కంపెనీ ఎరిక్సన్. 10

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ కస్తూర్బా పాఠశాలలో కిటికీల రెక్కలు పోయి చలిలో నేల మీదే నిద్ర





కరీంనగర్ బీసీ వెల్ఫేర్ హాస్టల్లో విరిగిపోయిన కిటికీలకు పరదాలు అడ్డం కట్టుకున్న స్టూడెంట్లు

సార్లూ.. సలివెడ్తాంది

హాస్టళ్లలో గజగజ వణుకుతున్న స్టూడెంట్స్

డోర్లు లేని రూములు.. రెక్కల్లేని కిటికీలతో అవస్థలు
దుప్పట్లు, పేపర్లు, అట్టలు అడ్డుగా పెట్టుకుంటున్న పిల్లలు
బెడ్లు లేకపోవడంతో చలిలో నేలపైనే నిద్ర.. అందని దుప్పట్లు
డోర్లు సరిగా లేక దోమల బాధ.. జ్వరాల బారిన విద్యార్థులు

ప్రభుత్వ హాస్టళ్లు వణికిపోతున్నయి. పిల్లలంతా చలికి గజగజమంటున్నరు. కొన్నిచోట్ల దుప్పట్లే అందలేదు. అందిన చోటా పల్చగా ఉండడంతో చలి ఆగక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో పరిస్థితిని 'వెలుగు' పరిశీలించింది. కొన్నిచోట్ల వసతులు బాగానే ఉన్నా 'చలి'తో పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్టు తేలింది.

"
మాకు పోయిన ఏడాది ఇచ్చిన రగ్గులే. ఈసారి ఇంకా ఇయ్యలే. దీంతోటి ఇంటి నుంచే తెచ్చుకుంటున్నం. అయినా చలి ఆగుత లేదు. బెడ్లు కూడ లేక కిందనే పంటున్నం. ఎస్సీ హాస్టల్లో మాత్రం కొందరికి దుప్పట్లు వచ్చినయి. కొత్తగ వచ్చినోళ్లకయితే అస్సలు ఇయ్యలేదు.

- బెల్లంపల్లి బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ రెసిడెన్షియల్ హాస్టల్ స్టూడెంట్ల ఆవేదన

02

లోక్‌సభలో 'రాఫెల్' ఫైర్

డీల్‌పై రాహుల్ ప్రశ్నాస్త్రాలు
ప్రధాని దొంగ, నేను అబద్ధాలకోరా?
కాంగ్రెస్ చీఫ్‌పై నిర్మల మండిపాటు
మీలా 'ఖాన్‌దాన్' నుంచి రాలేదు
కష్టాలు తెలిసిన కుటుంబాలు మావి
అందుకే కౌగిలింతలు, కన్నుగొట్టడాలా అంటూ ధ్వజం
ఒక్కో రాఫెల్ ఫైటర్ బేసిక్ ధర రూ. 670 కోట్లని వెల్లడి
కాంగ్రెస్‌ను బోఫోర్స్ ముంచితే.. రాఫెలే మోడీని గెలిపిస్తదని జోస్యం
మరోసారి సభలో కన్నుగీటిన రాహుల్

05

రాఫెల్ డీల్‌పై శుక్రవారం లోక్‌సభలో మాటల యుద్ధం నడిచింది. ఈ డీల్ పెద్ద స్కాం అని, దీని వెనక ప్రధాని మోడీ ఉన్నారని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ ఆరోపణలు గుప్పించారు. దీనికి రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా బదులిచ్చారు. 'సభా మర్యాదలు కూడా తెలియని మీరా మాట్లాడేది! మొన్నా మధ్య సభలో ప్రధానిని కౌగిలించుకోవడం, సభ్యులను చూస్తూ కన్నుగొట్టడం దేనికి సంకేతం? మీలా మేం 'ఖాన్‌దాన్' నుంచి రాలేదు. మీలాంటి వెకిలిచేష్టలు మాకు రావు. మాతోపాటు ప్రధాని కూడా కష్టాలు తెలిసిన కుటుంబాల నుంచే వచ్చారు. అందుకేనా మీకు చులకన? ప్రధానిని దొంగ అంటారా? నన్ను అబద్ధాలకోరు అంటారా? ఇష్టానికి మాట్లాడతారా? సభలో మీ ప్రవర్తనపై ఎప్పుడైనా కనీసం విచారమైనా వెలిబుచ్చారా?' అంటూ ఫైర్ అయ్యారు. 'రాఫెల్ వెనుక ఏఏ (అనిల్ అంబానీ) ఉన్నారని ఆరోపిస్తున్న మీరు ఒక్కసారి మీ చరిత్ర చూసుకోండి. మీ వెనుక ఒక క్యూ (ఖత్రోచీ), ఒక ఆర్‌వీ (రాబర్ట్ వాద్రా) ఉన్నారని మరిచిపోకండి. బోఫోర్స్ మిమ్మల్ని ముంచితే.. రాఫెల్ మోడీని మరోసారి అధికారంలోకి తెస్తుంది' అని అన్నారు. ఒక్కో రాఫెల్ యుద్ధవిమానం బేసిక్ ధర రూ. 670కోట్లు అని మొదటిసారి





రక్షణ మంత్రి సభలో వెల్లడించారు. యూపీఏ ఒప్పందం ప్రకారమైతే రూ. 737కోట్లు అయ్యేదన్నారు. తర్వాత కొద్దిసేపటికే రాహుల్ సభలో మరోసారి కన్నుకొట్టి కెమెరాకు చిక్కారు. అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై మాట్లాడుతుండగా రాహుల్ తన వెనక ఉన్న నేతతో ఏదో అంటూ కన్ను కొట్టారు.

నడుస్తున్నవేవీ ఆగవు.. కొత్తవి చేయొద్దు

ప్రభుత్వ కార్యక్రమాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి
రన్నింగ్‌లో ఉన్న పథకాలు కొనసాగుతాయి
గ్రామీణ ప్రాంతాలకే కోడ్.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తించదు
బలవంతపు ఏకగ్రీవాలపై చర్యలు చేపడతామని హెచ్చరిక
రైతుబంధు, బతుకమ్మ చీరల పంపిణీ యథాతథం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు, బతుకమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రభుత్వ స్కీములకు పంచాయతీ ఎన్నికల కోడ్ వర్తించదని, కొత్తగా పథకాలేవీ ప్రకటించవద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి శుక్రవారం వెల్లడించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కోడ్ వర్తిస్తుందని, పట్టణాల అంశాలకు అవసరం లేదని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు స్పెషల్ ఫోర్స్‌తో భారీ స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, భద్రతా ఏర్పాట్ల కోసమే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వేలంపాటలు, బలవంతపు ఏకగ్రీవాలు చేసినట్టు తేలితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

03



రేపు దుబాయ్‌కి సీఎం కేసీఆర్

రాష్ట్రానికి పెట్టుబడుల కోసం 13వ తేదీ వరకు పర్యటన

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దుబాయ్ పర్యటనకు వెళుతున్నారు. దుబాయ్‌లో స్థిరపడిన ఎన్నారైలు, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయన వెంట ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు, సీఎస్ రాజీవ్‌శర్మ, పలువురు ఉన్నతాధికారులు కూడా వెళుతున్నారు. పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ అబుదాబి కూడా సందర్శించి, అక్కడి ఇండస్ట్రియలిస్టులతో భేటీ అవుతారని సమాచారం.

02

గాంధీభవన్‌లో సందడి

25 రోజుల తర్వాత నేతలు, కార్యకర్తల హడావుడి
మూడు రోజులు భేటీలు.. అసెంబ్లీ ఓటమిపై సమీక్షలు
పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలపై చర్చలు
ఈ నెల 14 లోపు సంస్థాగత పదవులు భర్తీ చేస్తామన్న ఉత్తమ్



03

'ఆలిండియా' రేడియోకు అల్విదా

జాతీయ చానల్‌ను మూసివేస్తున్నాం: ప్రసారభారతి
మరో ఐదు ప్రాంతీయ శిక్షణా కేంద్రాలు కూడా..

'దిస్ ఈజ్ ఆలిండియా రేడియో'.. దశాబ్దాల తరబడి అలరించిన ఈ మాట ఇక ముందు వినిపించదు. మన చిన్నప్పటి జ్ఞాపకాల్లో ఒకటైన ఆలిండియా రేడియో ప్రసారాలు త్వరలో మూగబోనున్నాయి. ఖర్చు తగ్గించుకునే చర్యల్లో భాగంగా ఆలిండియా రేడియో నేషనల్ చానల్‌ను మూసివేస్తున్నట్టు ప్రసార భారతి ప్రకటించింది. దీంతో పాటు హైదరాబాద్, తిరువనంతపురం, అహ్మదాబాద్, లక్నో, షిల్లాంగ్‌లలో ఉన్న రీజనల్ ట్రైనింగ్ సెంటర్లనూ మూసివేయాలని నిర్ణయించింది. 1987లో ప్రారంభమైన ఆలిండియా రేడియో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం ఆరుగంటల వరకు దేశవ్యాప్త అంశాలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రసారం చేసేది. మరోవైపు ఈ మూసివేత నిర్ణయంపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



05

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
85.00	85.00	85.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
85.00	85.00	86.00

పెట్టుబడుల కోసం..

సీఎం కేసీఆర్ దుబాయ్ టూర్ ■ రేపటి నుంచి 13 వరకు పర్యటన



- ఎన్ఆర్ఐలు, కార్పొరేట్ సంస్థలతో భేటీ
- అబుదాబిలోనూ పర్యటించనున్న కేసీఆర్

హైదరాబాద్, వెలుగు: పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ దుబాయ్ టూర్ వెళ్తున్నారు. వారం రోజులపాటు అక్కడ పర్యటించనున్నారు. ఆదివారం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో సీఎం దుబాయ్‌కి బయల్దేరుతారు. ఆయనతోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. నర్సింగ్‌రావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అర్వింద్‌కుమార్, జయేశ్ రంజన్ వెళ్తున్నారు. కుటుంబ సభ్యులు, ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు కూడా వెళ్లనున్నారు. అక్కడ జరిగే ఇన్వెస్టర్స్ మీట్‌లో సీఎం పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. దుబాయ్‌లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో మూడు రోజులపాటు కేసీఆర్ భేటీ అవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానిస్తారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అనువైన రాష్ట్రమని, అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమల్లో ఉందని వివరించనున్నారు. సీఎం హోదాలో కేసీఆర్ తొలిసారిగా దుబాయ్ టూర్ వెళ్తున్నారు. రెండోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేసీఆర్ తొలి విదేశీ పర్యటన కూడా ఇదే.

వివిధ ప్రాంతాల సందర్శన

పర్యటనలో భాగంగా అబుదాబిని కూడా సీఎం సందర్శిస్తారని తెలిసింది. అక్కడి ఎన్ఆర్ఐలతో భేటీ అవుతారని సమాచారం. కుటుంబ సభ్యులతో కలిసి వివిధ ప్రాంతాలను సందర్శిస్తారని తెలిసింది. ఈనెల 13న ఆయన హైదరాబాద్ తిరిగి వస్తారు.



'ఐరిస్' విధానాన్ని చెక్ చేస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

'ఐరిస్'తో రేషన్ షురూ

- 16 జిల్లాల్లోని 5,186 షాపుల్లో ప్రారంభం
- సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో పరిశీలించిన కమిషనర్ అకున్ సబర్వాల్
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

హైదరాబాద్, వెలుగు: రేషన్ పంపిణీలో ఇబ్బందులు, అక్రమాలను అరికట్టడం కోసం ప్రభుత్వం 'ఐరిస్' విధానాన్ని తీసుకొచ్చింది. తొలి విడతలో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 16 జిల్లాల్లోని 5,186 షాపుల్లో ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఏడాది నుంచి పౌరసరఫరాల శాఖ ఈపాస్ (బయోమెట్రిక్) ద్వారా సరుకులు పంపిణీ చేస్తోంది. అయితే వృద్ధులు, మహిళల వేలి ముద్రలు అరిగిపోవడం వల్ల ఈపాస్ మెషిన్ గుర్తించడం లేదు. ఇటువంటి వారి విషయంలో వీఆర్ఓ, వీఏఓ, పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్లు ధ్రువీకరణతో సరుకులు ఇస్తున్నారు. అయితే ఈ విధానం కొన్నిచోట్ల దుర్వినియోగమవుతున్న విషయం అధికారుల పరిశీలనలో వెల్లడైంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం 'ఐరిస్' విధానాన్ని తెరపైకి తెచ్చింది. రాష్ట్రంలోని 17,200 రేషన్ షాపుల్లో దశలవారీగా 'ఐరిస్' అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. మొదటి విడతలో ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, కొత్తగూడెం, గద్వాల, నిర్మల్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని 5,186 షాపుల్లో ఐరిస్ విధానాన్ని ప్రారంభించారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఐరిస్ అమలు తీరును పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో అన్ని షాపుల్లో ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. గత నాలుగు రోజుల్లో 15 లక్షల 20 వేల మంది ఐరిస్ విధానంలో రేషన్ తీసుకున్నారని తెలిపారు.

రోజుకు 2 లక్షల టన్నులు

బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశం



హైదరాబాద్, వెలుగు: 2018-19లో మిగిలిన మూడు నెలల్లో ఉత్పత్తి లక్ష్యాలను మించి ముందుకుసాగాలని, రోజుకు 2 లక్షల 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో ఏరియాల జనరల్ మేనేజర్లతో ఆయన సమీక్షించారు. 2019-20లో అన్ని గనులకు కొత్త యంత్రాలు, స్పేర్లు, వనరులు, కాంట్రాక్టుల పనులను ఇప్పుడే పూర్తి చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలంలో ఉత్పత్తి, రవాణా మందగించకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. కొత్త ఓపెన్‌కాస్ట్ గనులను ప్రారంభించేందుకు పనులు పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి కిష్టారం ఓసీ, ఇల్లందు కోయగూడెం ఓసీ3 గని, భూపాలపల్లి కేటీకే ఓసీ3, రామగుండం రీజియన్‌లో ఇందారం ఓసీ, జీడీకే 5 ఇంక్లైన్ ఓసీ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి జేవీఆర్, కేకే, శ్రీరాంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి కావాలని స్పష్టం చేశారు. కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వే లైను నిర్మాణం త్వరలోనే చేపట్టనున్నారని, ఇందుకు కంపెనీ తరఫున పూర్తి సహకారం అందించాలని సూచించారు.

అప్లికేషన్ పెట్టుకున్నా అటెంప్ట్ చేసినట్టే

- సివిల్స్ పరీక్షపై కేంద్రానికి యూపీఎస్సీ ప్రతిపాదన
- వ్యయ భారం, శ్రమ తగ్గించుకునేందుకే

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు అప్లయ్ చేసి పరీక్ష రాయడంలేదా? అలాగైతే మీరొక అటెంప్ట్‌ను కోల్పోవాల్సి రావొచ్చు. అప్లికేషన్ పెట్టుకోడాన్ని కూడా పరీక్ష రాసినట్టుగానే (అటెంప్ట్) పరిగణలోకి తీసుకోవాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కేంద్రానికి ప్రతిపాదన పంపింది. దీన్నిగనక కేంద్రం ఆమోదిస్తే ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. పరీక్షల నిర్వహణ, శ్రమను తగ్గించుకోడానికే ఈ ప్రపోజల్ చేసినట్టు యూపీఎస్సీ అధికారి ఒకరు చెప్పారు. నోటిఫికేషన్ వచ్చినప్పుడు లక్షలాది మంది అప్లై చేసుకుంటున్నారని, వారిలో సగం మంది కూడా పరీక్ష రాయడం లేదు. అప్లై చేసుకున్న ప్రతి ఒకరి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అనవసరంగా ఖర్చు, శ్రమ పెరిగిపోతోంది. 'ఒక వేళ తొమ్మిది లక్షల అప్లికేషన్లు వస్తే అంత మందికీ ఏర్పాట్లు చేస్తున్నారు. వారిలో సగం మంది కూడా పరీక్షకు రావట్లేదు. మేం చేసిన ఈ ప్రతిపాదనకు ఒప్పుకుంటే డబ్బు, సమయం, శ్రమ అన్ని ఆదా అవుతాయి' అని ఆ అధికారి చెప్పారు. 2017లో దాదాపు తొమ్మిది లక్షల యాభై వేల మంది సివిల్స్ పరీక్షకు అప్లై చేసుకున్నారు. వారిలో నాలుగు లక్షల యాభై ఆరు వేల మంది మాత్రమే పరీక్ష రాశారని ఆ అధికారి వివరించారు. యూపీఎస్సీ నిబంధనల ప్రకారం ఒక్కో అభ్యర్థి ఆరు సార్లే సివిల్స్ రాయొచ్చు. రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

అమిత్‌షా ఇంటిముందు సివిల్స్ అభ్యర్థుల నిరసన

సివిల్ సర్వీస్ పరీక్షకు మరో అవకాశం కల్పించాలంటూ బీజేపీ చీఫ్ అమిత్‌షా ఇంటిముందు సివిల్స్ అభ్యర్థులు శుక్రవారం నిరసనకు దిగారు. 2011 నుంచి 2015 మధ్య నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష పేపర్‌లో మార్పులు చేశారని, దీంతో హిందీ మీడియం, హ్యూమానిటీస్ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగిందని, కాబట్టి పరీక్ష రాసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఇది భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం గంపోనిగూడెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ. ఐదో క్లాస్ నుంచి ఇంటర్ దాకా ఉంది. మొత్తం 360 మంది స్టూడెంట్స్ ఉన్నా సరిపోను గదుల్లేవు. ఉన్నవాటికి తలుపుల్లేవు. దీంతో వారికి రాత్రివేళ క్లాస్‌రూమే హాస్టల్‌గా మారుతోంది.

హాస్టల్ గజగజ

వసతి గృహాల్లో వణుకుతున్న స్టూడెంట్స్



ఆసిఫాబాద్‌లోని గురుకుల పాఠశాలలో రెక్కలు లేని కిటికీలు



జగిత్యాల హాస్టల్‌లో కిటికీలు లేకపోవడంతో...

- డోర్లు లేని రూంలు.. రెక్కల్లేని కిటికీలు
- అడ్డుగా దుప్పట్లు, పేపర్లు, అట్టలు పెట్టుకుంటున్న పిల్లలు
- బెడ్లు లేకపోవడంతో చలిలో నేలపైనే నిద్ర

వెలుగు నెట్‌వర్క్:

ప్రభుత్వ హాస్టళ్లు వణికిపోతున్నయి. పిల్లలంతా చలికి గజగజమంటున్నరు. రూములుంటే డోర్లు లేక, డోర్లు ఉంటే కిటికీలకు రెక్కల్లేక చల్లటి ఇగంల రాత్రి పూట చానా ఇబ్బందులు పడుతున్నరు. కిటికీలకు, డోర్లకు దుప్పట్లు, అట్టలు, రేకులు, పేపర్లు అడ్డం పెట్టుకొని గడుపుతున్నరు. కొన్నిచోట్ల ఇంకా దుప్పట్లే అందలేదు. అందినచోట్ల చాలా పల్చగా ఉండడంతో అవి చలిని ఆపడం లేదు. చాలా హాస్టళ్లలో బెడ్లు లేకపోవడంతో వణుక్కుంటూ నేలపైనే పడుకుంటున్నరు. చలికితోడు దోమలు కూడా తోడవడంతో జ్వరాల బారిన పడుతున్నరు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో పరిస్థితిని 'వెలుగు' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కొన్ని హాస్టళ్లలో వసతులు బాగానే ఉన్నా చాలాచోట్ల 'చలి'తో పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్టు తేలింది.

దుప్పట్లు అందలె..

హాస్టల్ స్టూడెంట్స్‌కు ప్రభుత్వమే మంచాలు, పరుపులు, దుప్పట్లు అందజేస్తోంది. కానీ కొన్నిచోట్ల వార్డెన్లు వాటిని విద్యార్థులకు అందించడం లేదు. ముఖ్యంగా ఆశ్రమ స్కూళ్లు, ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్టళ్లలో వసతుల లేమి కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగులో ఐటీడీఏ పరిధిలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో పిల్లలకు ఇంకా దుప్పట్లు అందలేదు. గతేడాది అందజేసినా ఈ ఏడాది కొత్తగా చేరిన స్టూడెంట్స్‌కు ఇంకా ఇవ్వలేదు. అడిగితే ప్రభుత్వం నుంచే రాలేదని వార్డెన్ అంటున్నట్టు వారు చెబుతున్నారు. ఇంకొన్ని చోట్ల అందజేసినా పిల్లలు క్రిస్మస్ సెలవులకు వెళ్తూ వారితోపాటు దుప్పట్లను కూడా తీసుకెళ్లి మళ్లీ తీసుకురాలేదని వార్డెన్లు అంటున్నారు. తమకు అందజేసిన దుప్పట్లు, బెడ్‌షీట్లు పల్చగా ఉన్నాయని, అవి కప్పుకున్నా చలి ఆగడం లేదని మెదక్ జిల్లా శివ్వంపేట ఎస్టీ హాస్టల్ విద్యార్థులు చెప్పారు. బెల్లంపల్లి పట్టణంలోని బాలుర బీసీ హాస్టల్ స్టూడెంట్స్‌కు రగ్గులు ఇంకా ఇవ్వలేదు. దీంతో పిల్లలే ఇంటి నుంచి తెచ్చుకున్నారు. గత ఏడాది నుంచి తమకు దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు. ఇక్కడ బెడ్లు కూడా లేకపోవడంతో నేలపైనే నిద్రపోతున్నారు. ఇక్కడే ఉన్న ఎస్సీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో 519 మంది ఉన్నా సుమారు 50 మందికి మాత్రమే దుప్పట్లు అందాయి. కొత్తగా వచ్చిన వారికి ఇంకా ఇవ్వలేదు. ఆదిలాబాద్ నియోజక వర్గంలోని తాంసి, తలమడుడు, బేల మండలాల్లో కూడా విద్యార్థులు బ్లాంకెట్లు లేక అవస్థలు పడుతున్నారు.



మిర్యాలగూడలోని ఈదులగూడ ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌లో చలికి వణుకుతూ నేలపైనే నిద్రిస్తున్న స్టూడెంట్స్

డోర్లు లేవ్.. కిటికీలకు రెక్కల్లేవ్..

కొన్ని హాస్టళ్లలో స్టూడెంట్స్‌కు దుప్పట్లు పంపిణీ చేసినా రూంలకు డోర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. తలుపులున్నచోట కిటికీలకు రెక్కలు లేవు. దీంతో పిల్లలే డోర్లకు, కిటికీలకు దుప్పట్లు, రేకులు వంటివి అడ్డుగా పెట్టుకుంటున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలోని బీసీ బాలుర హాస్టల్‌లో 40పైనే విద్యార్థులున్నారు. రెండే రూంలున్నాయి. వాటికి తలుపులు సరిగ్గా లేవు. కిటికీలకు రెక్కలు లేవు. దీంతో రాత్రిపూట చలి, దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ జిల్లా కొల్చారంలోని బీసీ హాస్టల్‌లో 112 మంది స్టూడెంట్స్ ఉన్నారు. అందరికీ దుప్పట్లు ఇచ్చారు. కానీ మంచాలు లేకపోవడంతో కింద బండల పైనే పడుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎస్సీ హాస్టళ్లలో దుప్పట్లు పంపిణీ చేసినా రూంలకు కిటికీలు, డోర్లు లేవు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 250 మంది విద్యార్థులున్నా సరిపడ రూంలు లేవు. భవనం శిథిలావస్థకు చేరింది. గదుల్లోని కిటికీలకు తలుపునలు లేవు. దీంతో కొన్నింటికి పిల్లలు సంచులు, బట్టలు కట్టుకున్నారు. రగ్గులున్నా విండోలు, డోర్లు లేక చలికి వణుకుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో గదుల్లేక క్లాస్‌రూంలోనే నిద్రిస్తున్నారు. ఆసిఫాబాద్‌లోని గురుకుల పాఠశాలలో 485 మంది విద్యార్థులున్నా కిటికీలు లేక చలికి గజగజ వణుకుతున్నారు. బెడ్లు లేకపోవడంతో నేలపై నే పడుకుంటున్నారు.



పెద్దపల్లి ఏస్టీ హాస్టల్‌లో విరిగిపోయిన కిటికీ రెక్కలకు దుప్పట్లు కట్టిన దృశ్యం



చిన్న నీటి పారుదలలో రాష్ట్రానికి అవార్డు

హైదరాబాద్, వెలుగు: మిషన్ కాకతీయలో భాగంగా చిన్న నీటి పారుదల వనరులను పటిష్టం చేసినందుకు రాష్ట్ర సర్కారును ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ఢిల్లీలోని స్కోప్ కాంప్లెక్స్‌లో శుక్రవారం 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్' 91వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నీటి పారుదల, కరెంటు రంగాల్లో ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలు, సంస్థలు, ఆఫీసర్లకు సంస్థ అవార్డులు ఇచ్చింది. తెలంగాణ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్యామ్ సుందర్ కేంద్ర మంత్రి ఆర్కే సింగ్, సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ హుస్సేన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నయీం ఆస్తులు రూ.1200 కోట్లు?

అవన్నీ బినామీ పేర్లతోనే ఉన్నాయని తేల్చినట్టు సమాచారం

హైదరాబాద్, వెలుగు:

గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తులు రూ.1200 కోట్ల వరకు ఉండొచ్చని ఆదాయపు పన్నుశాఖ తేల్చినట్టు తెలుస్తోంది. ఆ ఆస్తులన్నీ బినామీ పేర్లతోనే ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. బినామీ ప్రాపర్టీస్ ప్రొహిబిషనరీ యూనిట్ కింద ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నట్టు చెబుతున్నారు. అడ్జుకేటింట్ అథారిటీ కింద వాటిని అటాచ్ చేసేందుకు అనుమతివ్వాల్సిందిగా ఐటీ శాఖ పిటిషన్ దాఖలు చేసినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఢిల్లీ ఐటీ అధికారులు రంగంలోకి దిగినట్టు సమాచారం. నయీం ఆస్తుల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నయీం చనిపోయాక అతడి స్థావరాలు, అనుచరుల నుంచి నగదు, ఆస్తుల పేపర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సిట్‌నూ ఏర్పాటు చేసింది. ఈ విషయంపై మాట్లాడేందుకు ఐటీ అధికారులు నిరాకరించారు.

చివరి చూపునకు అమెరికా పంపుతాం

గుర్రపుతండా మృతుల బంధువులకు కేటీఆర్ హామీ

హైదరాబాద్, వెలుగు: అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రం కొలియర్‌విల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నల్లగొండ జిల్లా విద్యార్థుల అంత్యక్రియలకు బంధువులను అమెరికా పంపిస్తామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు హామీ ఇచ్చారు. నేరడుగొమ్ము మండలం గుర్రపుతండాకు చెందిన కేతావత్ శ్రీనివాస్ నాయక్, సుజాత దంపతుల పిల్లలు సాత్విక షరోన్(17), ఆరోన్ సుహాస్(15), జాయ్ సుజిత(14) క్రిస్మస్ వేడుకలకు స్నేహితుల ఇంటికి వెళ్లి అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో చనిపోయారు. వారి మృతదేహాలను ఇండియాకు రప్పించాలని పిల్లల బంధువులు, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, బిషప్ లాజరస్ శుక్రవారం కేటీఆర్‌ను కలుసుకున్నారు. ఆఫీసర్లు మృత దేహాలను విమానంలో తీసుకురావడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. దీంతో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ప్రభుత్వం తరఫున బంధువులను అమెరికా పంపే ఏర్పాట్లు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

కార్యదర్శి ఫలితాలపై విచారణ వాయిదా

హైదరాబాద్, వెలుగు: జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఫలితాలపై విచారణ ఈ నెల 21కి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి అభినంద్‌కుమార్ షావలి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థులు పిటిషన్ వేయగా నియామకాలపై కోర్టు స్టే విధించింది. ఎస్టీ అభ్యర్థులు ఎక్కువున్న జిల్లాల వివరాలివ్వాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేశారు.

రైల్వేలో 13వేలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, వెలుగు : రైల్వేలో వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. 13,487 పోస్టుల నియామకాలకు రైల్వే శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూనియర్ ఇంజనీర్లు(ఐటీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ (డీఎంఎస్), తదితర పోస్టులకు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వివరాలను www.rrbsecunderabad.nic.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని తెలిపింది.



శుక్రవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్. పక్కన కుంతియా తదితరులు

గాంధీభవన్‌కు మళ్లీ కళ

25 రోజుల తర్వాత నేతలు, కార్యకర్తల సందడి

హైదరాబాద్, వెలుగు:

- 3 రోజులు వరుస సమావేశాలు
- పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలపై చర్చలు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు
- త్వరలో డీసీసీ అధ్యక్షుల నియామకం: ఉత్తమ్

గాంధీ భవన్‌కు మళ్లీ కళ వచ్చింది. సుమారు 25 రోజులపాటు చడీచప్పుడు లేకుండా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆఫీసు శుక్రవారం ఎటుచూసినా నాయకులు, కార్యకర్తల సందడితో కనిపించింది. కనీసం ఇంటిని విడిచి బయటకు రావడానికి కూడా ఇష్టపడని కొందరు నేతలు.. ఆఫీసుకు వచ్చి ఒకరినొకరు పలకరించుకున్నారు. ఎలా ముందుకు వెళ్దామని చర్చించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమదే గెలుపని, అధికారం పక్కా అని భావించిన కాంగ్రెస్ నేతలు డిసెంబర్ 11న ఫలితాలను చూసి తీవ్ర నిరాశకు లోనయ్యారు. అధికారం మాట పక్కనబెడితే.. గతంలో వచ్చినన్ని సీట్లు కూడా పార్టీకి రాకపోవడంతో వాళ్లంతా ఇళ్లకే పరిమితమయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కు అడపాదడపా ఒకరిద్దరు నేతలు వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టి వెళ్లేవారు తప్ప సమావేశాల ముచ్చటే లేదు. కార్యకర్తలు మచ్చుకైనా కనిపించేవారు కాదు. ఈ క్రమంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఏఐసీసీ చీఫ్ రాహుల్‌గాంధీ గురువారం ఢిల్లీకి పిలిపించుకొని లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆదేశించారు. సంస్థాగత పదవుల భర్తీకి అనుమతించారు. ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగిన ఏఐసీసీ ఇన్‌చార్జులు, రాష్ట్ర నేతలు అప్పటికప్పుడు సమీక్షా సమావేశాల తేదీలు ఖరారు చేశారు. పార్టీ బాధ్యులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, జిల్లా నేతలను గాంధీభవన్‌కు తరలి రావాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి వరుసగా మూడురోజులపాటు సమావేశాలు ఏర్పాటు చేశారు. తొలిరోజైన శుక్రవారం నేతలు, వారితోపాటు భారీగా కార్యకర్తలు గాంధీభవన్‌కు రావడంతో పరిసరాలు కళకళలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పీసీసీ ఓబీసీ నేతల సమావేశం జరగ్గా.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమీక్షలు జరిగాయి. శనివారం, ఆదివారం కూడా సమీక్షలు కొనసాగనున్నాయి.

ఓటమిపై సమీక్ష.. ఎన్నికలకు సమాయత్తం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను కాంగ్రెస్ నేతలు సమీక్షించుకున్నారు. వాటి నుంచి తేరుకొని.. పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని నిర్ణయించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు దిశగా ముందుకు సాగాలని క్యాడర్‌కు పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణన్, రాష్ట్ర నేతలు షబ్బీర్ అలీ, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. లోక్‌సభ ఎన్నికల వైపు క్యాడర్‌ను నడిపించేందుకు కోఆర్డినేషన్ కమిటీ, ఎలక్షన్ కమిటీ, పబ్లిసిటీ కమిటీ, మీడియా కోఆర్డినేషన్ కమిటీలను నియమించాలని పీసీసీ నిర్ణయించింది.

అభ్యర్థులను ముందే ప్రకటిస్తే మేలు!

లోక్‌సభ అభ్యర్థులను ముందే ప్రకటిస్తే పార్టీకి మేలు జరుగుతుందని, ప్రచారం చేసుకునేందుకు సమయం దొరుకుతుందని పలువురు నేతలు సమీక్ష సమావేశంలో అభిప్రాయపడ్డట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తన అభ్యర్థులను ముందుగా ప్రకటించడంతో వారు 90 రోజుల పాటు ప్రచారం చేసుకున్నారని, మనం మాత్రం 9 రోజుల ముందే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారానికి సమయం లేకపోయిందని కొందరు నేతలు అన్నట్లు సమాచారం. పార్టీ తరఫున ప్రచార సామగ్రి వంటివి అభ్యర్థులకు పంపిణీ చేయాలని నేతలకు పలువురు సూచించినట్లు తెలిసింది.

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లివ్వాలని పీసీసీ ఓబీసీ రాష్ట్ర సమావేశం తీర్మానించింది. రాష్ట్ర సెల్ చైర్మన్ జె. చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ బీసీ నేతలు హాజరయ్యారు. వచ్చే నెలలో ఏఐసీసీ చీఫ్ రాహుల్ అధ్యక్షతన ఢిల్లీలో జాతీయ బీసీ గర్జన నిర్వహించనున్నట్లు సమావేశానంతరం చిత్తరంజన్ దాస్ మీడియాకు తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన కేసీఆర్.. బీసీల సర్వే చేయలేరా అని ఆయన ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.

యూరప్ పర్యటనకు ఉత్తమ్

త్వరలో రెండురోజుల పాటు తాను యూరప్ పర్యటనకు వెళ్లనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎల్పీ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది తెలియదని అన్నారు.

14 లోపు సంస్థాగత పదవుల భర్తీ: ఉత్తమ్

ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ సంస్థాగత పదవులను ఈ నెల 14 లోపు భర్తీ చేస్తామని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అన్ని జిల్లాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తామని, ఇందుకోసం అర్హులైన నాయకుల పేర్లు సూచించాలని నేతలను ఆయన కోరారు. లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల కోసం క్యాడర్‌లో జోష్ నింపాలన్నారు. అసెంబ్లీ ఫలితాలకు రాబోయే లోక్‌సభ ఎన్నికలకు చాలా తేడా ఉందని, పొరపాట్లను గుర్తించి రిపీట్ కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల పేర్లను కూడా డీసీసీ అధ్యక్ష పదవుల కోసం సిఫారసు చేస్తామని ఉత్తమ్ చెప్పారు. బ్లాక్, మండల, బూత్ స్థాయి కమిటీలను కూడా పూర్తి చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులే ఇప్పుడు పంచాయతీ, లోక్‌సభ ఎన్నికల్లో బాధ్యతలు తీసుకోవాలని, వారే ఇన్‌చార్జులుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఓటరు నమోదు విషయంలో కూడా నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.

శబరిమల హింసకు కేంద్రం అండ

ప్రజలను రెచ్చగొడుతున్నరు: సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

హైదరాబాద్, వెలుగు: శబరిమలలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సాగిస్తున్న హింసాకాండకు కేంద్ర ప్రభుత్వం అండదండలున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వంపైకి ప్రజలను రెచ్చగొట్టి ఎగదోస్తున్నారని విమర్శించారు. ఇంత గొడవ జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకం కాదని, మతోన్మాదానికి మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. కమ్యూనిస్టుల్లోనూ అయ్యప్ప భక్తులున్నారని స్పష్టం చేశారు. ఈ నెల 8,9 తేదీల్లో కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న



సమ్మెకు సీపీఐ మద్దతిస్తుందని తెలిపారు. శుక్రవారం మఖ్దూంభవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాఫెల్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తున్న మోడీ, శబరిమలపై ఇచ్చిన తీర్పును మాత్రం అంగీకరించడం లేదని విమర్శించారు. మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఫెడరల్ ఫ్రంట్ గురించి తెలియదని చెప్పడమే దానికి నిదర్శమన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఒక్కసారి కూడా మోడీ ప్రెస్‌మీట్ పెట్టలేదని, ఎవరైనా ఆయన చెప్పిందే వినాలని, ఎదురు ప్రశ్నలుండొద్దనే ఈ విధానం ఎంచుకున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో మోడీకి గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ మినహా ఇతర పార్టీలతో అవకాశమున్న చోట కలిసి పోటీ చేయాలని జిల్లా కమిటీలకు సూచించినట్లు చాడ చెప్పారు.


శుక్రవారం హైదరాబాద్‌లో బ్యాలెట్ బాక్సులను మీడియాకు చూపుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి

నడుస్తున్నవేవీ ఆగవు.. కొత్తవి వద్దు

హైదరాబాద్, వెలుగు:

- ప్రభుత్వ కార్యక్రమాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి
- ప్రస్తుత పథకాలు కొనసాగుతాయి
- గ్రామీణ ప్రాంతాలకే కోడ్..
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తించదని వెల్లడి

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ఎలాంటి స్కీమ్‌లు ప్రవేశపెట్టడానికి అవకాశం ఉండదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి చెప్పారు. అలాగని గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు కలిపి పథకాలు పెట్టడానికి కూడా వీలుండదని, కేవలం పట్టణాలకు సంబంధించి మాత్రం కోడ్ వర్తించదని వివరించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, నియమ నిబంధనలు, కొత్త పంచాయతీ చట్టం-2018 తదితర అంశాలపై ఎలక్షన్ అబ్జర్వర్లుగా ఉన్న ఐఏఎస్‌లు, ఆడిట్ ఆఫీసర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. అనంతరం నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ చీరలు, రైతుబంధు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయవచ్చా అని ప్రశ్నించగా.. ఇప్పటికే కొనసాగుతున్న స్కీమ్‌లు మాత్రం కొనసాగుతాయని, కొత్తవి ప్రకటించడానికి వీలు లేదని స్పష్టం చేశారు.

పంచాయతీ యూనిట్‌గా కేటాయింపులు

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులేవీ రాలేదని, ఎన్నికలకు టాస్క్‌ఫోర్స్, ట్రాకింగ్ ఫోర్స్, స్పెషల్ ఫోర్స్‌ను వినియోగిస్తామని చెప్పారు. ప్రతి పంచాయతీ ఒక యూనిట్‌గా ఉంటుందని, ప్రతి దానిలో ఆఫ్ సెక్షన్ పోలీసు ఫోర్స్ ఉంటుందని తెలిపారు. భద్రత దృష్ట్యా మూడు దశల్లో ఎన్నికలు జరుపుతున్నట్టు చెప్పారు.

బలవంతపు ఏకగ్రీవం సరికాదు

పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయని.. బలవంతంగా గానీ, పోటీ చేయాలనుకునే వారిపై ఒత్తిడి తెచ్చిగానీ ఏకగ్రీవం చేయడానికి వీలులేదని నాగిరెడ్డి చెప్పారు. గ్రామస్తులంతా స్వచ్ఛందంగా ఏకగ్రీవం చేసుకుంటామంటే అభ్యంతరం ఉండదన్నారు. గతంలో గ్రామ అభ్యుదయ సంఘాలు, గ్రామాభివృద్ధి సంఘాలు సర్పంచ్ పదవిని వేలం వేసేవని, అవన్నీ చట్టవిరుద్ధమని, వాటిని సహించేది లేదని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనరల్ అబ్జర్వర్స్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్స్‌కు అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడినట్టు ఎన్నికల సంఘం దృష్టికి వచ్చినా, అబ్జర్వర్లు గుర్తించినా రీపోలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ షాడో టీమ్‌లు పరిశీలిస్తుంటాయని, పరిమితిని మించితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాగిరెడ్డితో సీఎస్, డీజీపీ భేటీ

సీఎస్ జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో నాగిరెడ్డితో భేటీ అయ్యారు. ఎన్నికల కోడ్, సిబ్బంది, భద్రతపై చర్చించినట్లు సమాచారం.

రైతు బంధు, బతుకమ్మ చీరలకు ఓకే..

రాష్ట్రంలో ఇప్పటికే కొనసాగుతున్న పథకాలకు కోడ్ వర్తించదని నాగిరెడ్డి స్పష్టం చేసిన నేపథ్యంలో.. రైతు బంధు, బతుకమ్మ చీరల పంపిణీ తదితర పథకాలు యథాతథంగా అమలుకానున్నాయి.

‘పంచాయతీ’ల్లో ఎస్టీలకు అన్యాయం

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లలో ఎస్టీల జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను జనరల్‌కు కేటాయించి ఎస్టీలకు అన్యాయం చేశారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు శుక్రవారం ఆరోపించారు. సీఎం కేసీఆర్ మాటల గారడీతో గిరిజనులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.

బీసీలపై ప్రేమ ఉంటే రిట్ ఎందుకేయలె?

రిజర్వేషన్ల తగ్గింపు అన్యాయమే: షబ్బీర్

హైదరాబాద్, వెలుగు: హైకోర్టు తీర్పు సాకుతో రిజర్వేషన్లు తగ్గించి సీఎం కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ ఆరోపించారు. వారిపై ప్రేమ ఉంటే రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పుపై రిట్ పిటిషన్ ఎందుకేయలేదని శుక్రవారం ప్రశ్నించారు. గతంలో తాము బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించామని గుర్తుచేశారు. ముస్లింలు, ఎస్టీల రిజర్వేషన్ల పెంపు అంశంలోనూ కేసీఆర్ మాట మార్చారని దుయ్యబట్టారు.

ప్రమోషన్లలోనూ రిజర్వేషన్లు

ఆర్.కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, వెలుగు: బీసీ విద్యుత్ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అవరోధాలు లేవని, చట్టపరంగా చిక్కులు లేకున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలను అణచివేయాలని చూసిందని మండిపడ్డారు.


శుక్రవారం తెలంగాణ భవన్‌లో వినతిపత్రాలు తీసుకుంటున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పది ఇండ్లకో కార్యకర్త

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం ■ టీఆర్‌ఎస్ క్యాడర్‌కు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, వెలుగు:

- ‘ట్రక్కు’టమార విద్యలవల్లే ఉత్తమ్ గెలిచారని విమర్శ
- పొన్నాలను చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో తెలుస్తలేదని ఎద్దేవా

‘ప్రతి పది ఇండ్లకో కార్యకర్తను నియమించుకోవాలి. వంద మందికో కార్యకర్త ఉండాలి. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వీళ్లు సిద్ధంగా ఉండాలి. అప్పుడే పార్టీ పటిష్టంగా ఉంటుంది. వచ్చే ఎన్నికల కోసం బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకోవాలి. సిరిసిల్లలో పటిష్టమైన బూత్ కమిటీలతోనే నా మెజార్టీ పెరిగింది. అన్ని చోట్ల ఇదే పద్ధతి అనుసరించాలి’ అని టీఆర్‌ఎస్ క్యాడర్‌కు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్‌కు శుక్రవారం హుజూరాబాద్, చొప్పదండి నుంచి తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్టీని పటిష్టంగా మార్చి లోక్‌సభ ఎన్నికల్లోనూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే పరిస్థితి లేదని, టీఆర్‌ఎస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వీలైనన్ని గ్రామాలను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 3,400 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని, వాటిలో అనేక పంచాయతీలను ఏకగ్రీవం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కేసీఆర్ చొప్పదండి అల్లుడు అని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. నల్లగొండలో కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారని, అందుకే అక్కడ మహామహులు మట్టి కరిచారని పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో ట్రక్కు గుర్తు వల్లే పీసీసీ చీఫ్ ఉత్తమ్ గెలిచారని, కారు, ట్రక్కుకు కలిపి యాభై శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. ఉత్తమ్ ‘ట్రక్కు’ టమార విద్యలతో ఎన్నికల్లో గెలిచారని, ఆయనంత అహంకారి మరొకరు లేరని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన రూ. 500 కోట్లకు ఆశపడి టీడీపీకి కాంగ్రెస్ దాసోహమన్నదని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ, మోడీ, చివరకు ఆరోగ్యం బాగా లేకపోయినా సోనియా గాంధీ తెలంగాణలో ప్రచారం నిర్వహించారని, అయినా ప్రజలు టీఆర్‌ఎస్‌ను బ్రహ్మాండంగా ఆదరించారని, కేసీఆర్‌ను అక్కున చేర్చుకున్నారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ వందకు పైగా సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతల బుర్రలు పాడయ్యాయని, పొన్నాల లక్ష్మయ్య మళ్లీ ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలియడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఓటర్ల తీర్పుతో కొందరు కాంగ్రెస్ నేతలు రిటైర్మెంట్ తీసుకుంటే, మరికొందరు కనిపించకుండా పోయారని, వాళ్లు ఇప్పట్లో లేచే పరిస్థితి లేదని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు తమదే అధికారం అని కలలుగని మంత్రి పదవులు పంచుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ కార్యకర్తలు మాత్రం అధికారం వచ్చిందనే గర్వంతో ఉండకుండా, ప్రజలతోనే మమేకం కావాలని ఆయన సూచించారు.

నలుగురు ఐపీఎస్‌లకు పదోన్నతి

హైదరాబాద్, వెలుగు: నలుగురు ఐపీఎస్‌లకు డీఐజీలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఎస్పీ శివకుమార్, సంగారెడ్డి ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వెస్ట్ జోన్ డీసీపీ ఏఆర్ శ్రీనివాస్, కరీంనగర్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి డీఐజీలుగా పదోన్నతి పొందారు.

ఆస్థానా కేసు ఆఫీసర్ బదిలీ

న్యూఢిల్లీ: సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ జాయింట్ డైరెక్టర్ వి.మురుగేశన్ బదిలీ అయ్యారు. ఆయన్ను బొగ్గు కుంభకోణం కేసుల దర్యాప్తుకు మారుస్తూ శుక్రవారం ఆర్డర్లు జారీ అయ్యాయి. ఆస్థానా కేసు దర్యాప్తు బాధ్యతలను మరో జాయింట్ డైరెక్టర్ జీకే గోస్వామికి అప్పగిస్తూ సీబీఐ ఉత్తర్వులిచ్చింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సానా సతీశ్ బాబు కంప్లయింట్‌తో గతేడాది అక్టోబర్‌లో ఆస్థానాపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.



టీఎన్జీవో తీర్మానాలు సీఎం దృష్టికి

హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, వెలుగు: 'విభజన సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. ఈమధ్యే హైకోర్టు విభజన కూడా పూర్తయింది. ఇక సర్కారు దృష్టంతా అభివృద్ధిపైనే' అని హోంమంత్రి మహమూద్ అలీ చెప్పారు. సర్కారు ఉద్యోగులను తన కుటుంబ సభ్యులుగా కేసీఆర్ భావిస్తున్నారని, ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతాయని చెప్పారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఎన్జీవో) స్టేట్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, కొత్త సంవత్సర డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి హోంమంత్రి హాజరై మాట్లాడారు. వృద్ధి రేటులో దేశంలో మన రాష్ట్రమే టాప్‌లో ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవో చేసిన 14 తీర్మానాలను సీఎంకు అందజేస్తానన్నారు. ఉద్యోగుల కష్టాలు తెలిసిన సీఎం ఉండటం మన అదృష్టమని, త్వరలోనే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తారని శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. ఏపీలోని 800 మంది ఉద్యోగులను రాష్ట్రానికి తీసుకరావడానికి చొరవ చూపాలని ప్రభుత్వాన్ని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి కోరారు.

4 వేలల్లో 10 మందేనా?

వరల్డ్ టాప్ 1% రీసర్చర్లలో ఇండియన్లు చాలా తక్కువ

హైదరాబాద్, వెలుగు: దేశంలో ఐఐఎస్‌సీ, ఐఐటీలు, టీఐఎఫ్ఆర్, జేఎన్‌యూ లాంటి ప్రముఖ విద్యా సంస్థలెన్నో ఉన్నాయి. వాటిల్లోంచి ఎంతో మంది సైంటిస్టులు, రీసర్చర్లు, విద్యావంతులు బయటకొస్తున్నారు. వివిధ దేశాల్లో సేవలందిస్తున్నారు. కానీ ప్రపంచంలోని టాప్ 1 శాతం రీసర్చర్లలో కేవలం 10 మందే ఇండియన్లు ఉన్నారని క్లారివేట్ అనలిటిక్స్ సర్వే చెబుతోంది. లిస్టులో చైనా వాళ్లు 482 మంది, అమెరికా నుంచి 2,639, యూకే నుంచి 546 మంది ఉన్నారని వెల్లడించింది. 60 దేశాల నుంచి 4 వేల మంది టాప్ 1 శాతంలో ఉన్నట్లు సర్వే పేర్కొంది. ఆ 4 వేల మందిలో 80 శాతం 10 దేశాల వారేనని, వారిలోనూ 70 శాతం పేర్లు 5 దేశాల సైంటిస్టులే ఉన్నారని వివరించింది. హార్వర్డ్ వర్సిటీ నుంచి 186 మంది లిస్టులో ఉన్నారంది.

ఐదేళ్లలో పరారైన ఆర్థిక నేరగాళ్లు 27 మంది

లోక్‌సభలో వెల్లడించిన మంత్రి

న్యూఢిల్లీ: ఐదేళ్లలో 27 మంది ఆర్థిక నేరగాళ్లు, ఎగవేతదారులు ఇండియా వదిలి పరారయ్యారని కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా రాత పూర్వక సమాధానమిచ్చారు. పారిపోయిన వారిలో 20 మందికి రెడ్‌కార్నర్ నోటీసులివ్వాలని ఇంటర్‌పోల్‌ను కోరామన్నారు. వారిలో 8 మందికి ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయని చెప్పారు. ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని ఇండియాకు తిరిగి పంపించాల్సిందిగా అభ్యర్థించామన్నారు.



టైమ్ క్యాప్సూల్‌లో ఉంచిన వస్తువులు

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో క్యాప్సూల్‌ను పూడ్చారు

- అందులో బ్రహ్మోస్ క్షిపణి, తేజస్ ఫైటర్ టెక్నాలజీలు
- భవిష్యత్ తరాల కోసమేనట

జలంధర్: మంగళ్‌యాన్, బ్రహ్మోస్ క్షిపణి, కలాం శాట్, తేజస్ ఫైటర్ ఇలా ఇండియా టెక్నాలజీని చాటి చెప్పే 100 వస్తువులను లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయకూ)లో శుక్రవారం పాతిపెట్టారు. 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు వచ్చిన ముగ్గురు నోబెల్ గ్రహీతలు అవ్రమ్ హెర్ష్కో, డంకన్ ఎం.హల్డానే, థామస్ క్రిస్టియన్ సుధోఫ్ ఈ పని చేశారు. భవిష్యత్ తరాలకు నేటి టెక్నాలజీ గురించి తెలిపేందుకే ''టైమ్ క్యాప్సూల్''ను భూమిలో పాతారని వర్సిటీ తెలిపింది. వీటిని ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా తామే తయారు చేసినట్లు వెల్లడించింది. 10 అడుగుల లోతులో పూడ్చిన క్యాప్సూల్‌లో ల్యాండ్‌లైన్ టెలిఫోన్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, వెయింగ్ మెషీన్, వాటర్ పంప్, స్టాప్ వాచ్, హెడ్ ఫోన్స్, కెమెరా, డ్రోన్, వీఆర్ గ్లాసులు, పెన్ డ్రైవ్, రిఫ్లెక్టార్ స్కోప్, డబుల్ మైక్రోస్కోప్, సోలార్ సెల్, హార్డ్ డిస్క్ (ఇందులో సరికొత్త డాక్యుమెంటరీలు, సినిమాలు ఉన్నాయి) తదితర వస్తువులు ఉన్నాయంది. 100 ఏళ్ల తర్వాత వీటిని బయటకు తీస్తారని పేర్కొంది. దీని వల్ల అప్పటి తరానికి, నేటి తరం గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పింది.

కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు: ఆంధ్ర వర్సిటీ వీసీ

వేల ఏళ్ల క్రితమే ఇండియాలో టెస్ట్ ట్యూబ్ బేబీ, స్టెమ్ సెల్ టెక్నాలజీ ఉందని సైన్స్ కాంగ్రెస్‌కు హాజరైన ఆంధ్రా యూనివర్సిటీ వీసీ నాగేశ్వరరావు అన్నారు. అందుకు కౌరవులే ఆధారమని చెప్పారు. కౌరవులందరూ టెస్ట్ ట్యూబ్ బేబీలని అన్నారు. ప్రస్తుతం క్షిపణుల్లో వాడుతున్న గైడెడ్ టెక్నాలజీ రాముడి కాలంలోనే ఉందని చెప్పారు. శత్రువులపై రాముడు వాడిన అస్త్ర, శస్త్రాలు దాడి చేసి వెనక్కు వచ్చేవని పేర్కొన్నారు. రావణుడికి పుష్పక విమానమే కాకుండా 24 రకాల విమానాలు ఉండేవని రామాయణం చెబుతోందన్నారు. శ్రీలంకలో ఉన్న ఎయిర్‌పోర్టుల్లో ఇవి ఉండేవని చెప్పారు.

జగన్‌పై దాడి కేసు ఎన్ఐఏకి



- ఏపీ హైకోర్టు ఉత్తర్వులు
- కేంద్ర హోం శాఖ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం

వెలుగు బ్యూరో: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన కత్తి దాడి కేసును ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)కి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది అక్టోబర్ 25న జగన్‌పై జరిగిన దాడిపై కొందరు వైఎస్సార్‌సీపీ నేతలు హైకోర్టులో వేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం సరిగా దర్యాప్తు చేయలేదని, ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించాలని జగన్ తరఫు న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. దాడి జరిగిన ఎయిర్‌పోర్టు లాంజ్.. కేంద్రం పరిధిలోకి వస్తుంది కాబట్టి కేసును ఎన్ఐఏకు ఇవ్వాలని కేంద్ర హోం శాఖ కూడా విన్నవించింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం దర్యాప్తు చేసి, నిందితుడిని విచారించిందని, పూర్తిస్థాయిలో కేసు దర్యాప్తు జరిగిందని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత కేసును ఎన్ఐఏకు అప్పగించేందుకే ధర్మాసనం మొగ్గు చూపింది.

డిసెంబర్ 31నే కేసు ఎన్ఐఏకు

ఎన్ఐఏ చట్టం-2008లోని సెక్షన్ 8 ప్రకారం విమానాశ్రయాల్లో జరిగిన నేరం దర్యాప్తు చేపట్టాల్సిన బాధ్యత ఎన్ఐఏకే ఉంటుందని కోర్టుకు కేంద్ర హోంశాఖ తెలిపింది. అందుకే డిసెంబర్ 31నే కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించినట్లు వివరించింది. తమ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం జనవరి 1న ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని చెప్పింది. ఎయిర్‌పోర్టు భద్రత చూసే సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కోర్టుకు తెలిపింది. మరోవైపు హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

ఉస్మానియాలో అదనపు కౌంటర్లు

గాంధీలో మూడు షిఫ్టుల్లో వీల్‌చైర్ సిబ్బంది



'వెలుగు' కథనాలకు స్పందన

- డీఎంఈ రమేశ్ రెడ్డి వెల్లడి
- త్వరలో అన్ని పెద్దాసుపత్రుల్లో బయోమెట్రిక్

హైదరాబాద్, వెలుగు: ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో రోగుల ఇబ్బందులపై 'వెలుగు' కథనాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, అవకతవకలపై దృష్టి పెట్టినట్లు డీఎంఈ రమేశ్ రెడ్డి తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో మందులు ఇచ్చే కౌంటర్లను వెంటనే పెంచాల్సిందిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రను ఆదేశించారు. దీంతో సోమవారం నుంచి ఉస్మానియాలో అదనపు కౌంటర్లు అందుబాటులోకి రానున్నాయి. ఇక గాంధీ ఆసుపత్రిలో వీల్‌చైర్స్ నిర్వహణకే ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తామని రమేశ్ రెడ్డి చెప్పారు. ఆసుపత్రిలో మూడు షిఫ్టుల్లోనూ వీల్ చైర్స్ వద్ద సిబ్బంది ఉండేలా సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

కథనాలతో కదిలారు

'ఉస్మానియాకు సర్జరీ చెయ్యాలె', 'వీల్ చైర్‌పై గాంధీ' పేరుతో డిసెంబర్ 28, 29 తేదీల్లో 'వెలుగు'లో కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఉస్మానియా ఆసుపత్రిలో కౌంటర్ల సంఖ్య తక్కువగా ఉన్నందున దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వందలాది మంది రోగులు ముందు రోజు రాత్రే వచ్చి ఆసుపత్రి పరిసరాల్లో ఉండి, ఉదయాన్నే క్యూలైన్లో నిలబడుతున్నారు. దీంతో కౌంటర్ల వద్ద తోపులాటలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలువురు స్పృహ తప్పి పడిపోయిన ఘటనలు ఉన్నాయి. అలాగే గాంధీ ఆస్పత్రిలో వీల్‌చైర్లు, సీటీ స్కాన్లకు లంచాలు వసూలు చేస్తున్న వైనాన్నీ 'వెలుగు' వివరించింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ''ఆసుపత్రుల్లో వీల్ చైర్స్ చాలా ఉన్నా, నిర్వహణ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సమస్య వస్తోంది. ఇకపై మూడు షిఫ్టుల్లో వీల్ చైర్స్ వద్ద సిబ్బంది ఉండేలా సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశాం. లంచాల దందాను నియంత్రిస్తాం'' అని రమేశ్‌రెడ్డి చెప్పారు.

త్వరలో అన్ని ఆసుపత్రుల్లో బయోమెట్రిక్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతా బయోమెట్రిక్ ద్వారా తమ హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని టీచింగ్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్లను డీఎంఈ రమేశ్ రెడ్డి ఆదేశించారు. ఒక్కో షిఫ్టులో 30 మందికి తగ్గకుండా అన్ని షిఫ్టుల్లోనూ కింది స్థాయి సిబ్బంది ఓపీలో అందుబాటులో ఉండాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ తక్కువ మందిని విధుల్లోకి పంపి ఎక్కువ హాజరు చూపి అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో విధుల హాజరు విషయంలో అక్రమాల్ని సహించబోమని ఆయన హెచ్చరించారు.

సీఎం సొంతూర్లోనూ పోటీ

కీలకంగా మారిన 'మండలం' నినాదం ■ సర్పంచ్ పదవికి పోటాపోటీ



సిద్దిపేట, వెలుగు: సీఎం కేసీఆర్ సొంతూరైన సిద్దిపేట జిల్లా చింతమడకలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి రగిలింది. ఈసారి సీటు జనరల్‌గా మారడంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. ఇప్పటికే ఎవరికి వారు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తొలివిడతలోనే చింతమడకకు ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంకంపేట, దమ్మచెరువు మదిర గ్రామాలు కూడా ఈ పంచాయతీ పరిధిలోకే వస్తాయి. మొత్తంగా పంచాయతీ పరిధిలో జనాభా 2,521 మంది (2011 లెక్కల ప్రకారం). ఇందులో 1,227 మంది పురుషులు, 1,294 మంది మహిళలు ఉన్నారు. ఓటర్లు 1,854 మంది. కేసీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచీ గ్రామాభివృద్ధికి తోడ్పడ్డారు. గ్రామంలోని తమ ఇంటిని పంచాయతీకి ఇవ్వడంతో.. బ్యాంకు, హైస్కూల్, బాలవికాస వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రతి ఎన్నికల్లోనూ కేసీఆర్ దంపతులు చింతమడకలోనే ఓటేస్తారు. ఈ పంచాయతీకి ఇప్పటి వరకు ఎన్నికలు జరిగాయేతప్ప ఏకగ్రీవం జరగలేదు.

ఈసారి పోటా పోటీ..

చింతమడక సర్పంచ్ పదవి కోసం ఈసారి చాలా మంది పోటీ పడుతున్నారు. హంసకేతన్‌రెడ్డి, ఎర్రోళ్ల శేఖర్, సత్యనారాయణగౌడ్, మల్లేశం తదితరులు మద్దతు కోసం గ్రామస్తులతో సమావేశాలు కూడా మొదలుపెట్టారు. మరోవైపు గ్రామంలో మెజార్టీ ఓట్లు ముదిరాజ్ కులస్తులవే కావడంతో ఈసారి తమ అభ్యర్థిని గెలిపించుకోవాలనే దిశగా ఆలోచిస్తున్నారు. ఇప్పటికే వారి పక్షాన దేవేందర్ అనే వ్యక్తికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. గ్రామానికి చెందిన కొందరు నేరుగా సీఎం కేసీఆర్‌ను కలిసేంతగా పరిచయాలు ఉండటంతో సర్పంచ్ పదవి విషయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎవరి పేరునూ ప్రతిపాదించడం లేదని, తమలో తామే ఓ నిర్ణయానికి రావాలని సూచిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

మండల కేంద్రం చేయాలంటూ..

చింతమడకను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 18 రోజులుగా గ్రామస్తులు దీక్షలు చేస్తున్నారు. ఇటీవల కొత్త మండలాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించడంతోనే చింతమడకవాసులు ఆందోళన మొదలుపెట్టారు. ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిసే ప్రయత్నాలు విఫలం కావడంతో గ్రామంలో దీక్షలు మొదలుపెట్టారు. పంచాయతీ ఎన్నికల్లో ఈ అంశం ప్రధానంగా మారనుంది.

15 ఏళ్లుగా అభివృద్ధి జోరు

సీఎం కేసీఆర్, ఆ తర్వాత హరీశ్‌రావు ఎమ్మెల్యేగా ఉండటంతో చింతమడక అభివృద్ధి జోరందుకుంది. గ్రామంలో రోడ్లు, పంచాయతీ భవనం, పీహెచ్‌సీ, ధాన్యం గోడౌన్, కల్యాణ మండపం, డబుల్ బెడ్రూం ఇళ్లు, మహిళా సంఘాలు, వివిధ కుల సంఘాల భవనాలు నిర్మాణం చేసుకున్నాయి. గ్రామం మీదుగా దుబ్బాక వెళ్లే మార్గాన్ని విస్తరించడమే కాకుండా బాల వికాస ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఇప్పటికే 48 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు కేటాయించగా.. మరో 50 డబుల్ ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి.

వ్యక్తులను చూసి ఓట్లేసేవారు

'4 దశాబ్దాల క్రితం పనిచేసే వ్యక్తులకు ఓట్లేసేవారు. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లో ధన ప్రవాహమే కీలకమవుతోంది'

- కల్వకుంట్ల బాల్‌కిషన్‌రావు, మాజీ సర్పంచ్ (కేసీఆర్ చిన్నాన్న)

కోట్ల రూపాయలతో అభివృద్ధి

గత ఐదేళ్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాం. ఆస్పత్రి, బాలవికాస ప్లాంట్, గ్రంథాలయం, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాం.

- ఎర్రోల్ల లక్ష్మీశేఖర్, తాజా మాజీ సర్పంచ్

నా హయాంలోనే సీసీ రోడ్లు

చింతమడకలో రెండు దశాబ్దాల క్రితం నా హయాంలోనే సీసీ రోడ్లను నిర్మించాం. ఈసారి ఎన్నికల్లో గెలిచి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా.

- బొంబొతుల సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్

అమెరికాలో హైవేపై అగ్నిప్రమాదం

ఏడుగురు మృతి

ఫ్లోరిడా: అమెరికాలోని ఫ్లోరిడా హైవేపై ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా.. మరి కొందరు గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. గైన్సివిల్లీ దగ్గర్లో రెండు పెద్ద వాహనాలు, ప్యాసింజర్ వెహికల్స్ ఒకదానొకటి ఢీకొన్నా యి. దీంతో రోడ్డుపై డీజిల్ పడి భారీగా మంటలు చెలరేగి వాహనాలు తగలబడ్డాయి. ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే చనిపోయారని, మరో వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడని అధికారులు చెప్పారు. ప్రమాద సమయంలో 189 లీటర్ల డీజిల్ రోడ్డుపై పడటంతో భారీగా మంటలొచ్చాయని, మంటల ధాటికి రోడ్డు కూడా బాగా దెబ్బతినిందని హైవే పోలీసులు చెప్పారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

చైనా మాంజా అమ్మితే జైలుకే

ఐదేళ్ల శిక్ష.. రూ.లక్ష జరిమానా

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో చైనా మాంజా అమ్మినా.. వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) ప్రశాంత్ కుమార్ ఝా శుక్రవారం హెచ్చరించారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం చైనా మాంజా అమ్మిన వారికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తామని చెప్పారు. మాంజా వల్ల పక్షులకు హాని జరిగితే రూ.10 వేల పెనాల్టీ, ఏడేళ్ల పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. ఇంకెవరికి ప్రమాదం జరిగినా కేసులు పెడతామన్నారు. అంతకు ముందు వివిధ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశమై సలహాలు తీసుకున్నారు. జనాలకు, పక్షులకు హాని జరుగుతుండటంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైనా మాంజాను నిషేధించిందని తెలిపారు. ఇప్పటి వరకు 900 కిలోల వరకు మాంజాను సీజ్ చేశామని, 123 కేసులు నమోదయ్యాయన్నారు. మాంజా రవాణాకు వాహనాలను వాడితే వాటినీ సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆ మాంజా ప్లాస్టిక్‌తో తయారవుతుందని, పర్యావరణానికి హాని చేస్తుందన్నారు. ఎవరైనా మాంజా అమ్మినా, వాడినా 18004255364 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆన్‌లైన్‌లో 63,311 ఆర్జిత సేవల టికెట్లు

తిరుమల, వెలుగు: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి ఏప్రిల్ నెల కోటాలో 63,311 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం ప్రకటించారు. 'ఆన్‌లైన్ డిప్ విధానంలో 10,061 టికెట్లు విడుదల చేశాం. జనరల్ కేటగిరీలో 53,250 సేవాటికెట్లు ఉండగా, వీటిలో 2,500 విశేషపూజ, 11,875 కల్యాణం, 3,750 ఊంజల్ సేవ, 6,875 ఆర్జిత బ్రహ్మోత్సవం, 12,650 వసంతోత్సవం, 15,600 సహస్రదీపాలంకార సేవ టికెట్లున్నాయి' అన్నారు. ఈనెల 8, 22 తేదీల్లో వృద్ధులు, దివ్యాంగులకు, 9, 23 తేదీల్లో ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. మార్చి 13న హైదరాబాద్ లో శ్రీవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట జరగుతుందని చెప్పారు.

మదర్ బాంబ్.. మేడిన్ చైనా



- అమెరికా లాంటి మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌ను తయారు చేసిన డ్రాగన్
- యూఎస్ బాంబు కన్నా చిన్నది, బరువూ తక్కువే

బీజింగ్: అది 2017.. అఫ్గానిస్తాన్‌లోని నంగర్‌హర్ ప్రావిన్స్.. రాత్రి 7 గంటలు.. ఎక్కడెక్కడ దాడులు చేయాలో, ఎలాంటి ప్లాన్లు వేయాలో ఐసిస్ ఉగ్రవాదులు బిజీగా చర్చిస్తున్నారు. సరిగ్గా అప్పుడే చెవులకు చిల్లులు పడేలా శబ్దం. ఉన్నట్టుండి ఆ ప్రాంతంలోని ఉగ్ర స్థావరం నేలమట్టమైంది. పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారు. కారణం.. అమెరికా వదిలిన అతి పెద్ద నాన్ న్యూక్లియర్ బాంబ్. పేరు మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్ బాంబ్ (MOAB). దాన్నే మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అంటారు. 2003లో తయారు చేసిన ఆ బాంబును యుద్ధ క్షేత్రంలో అమెరికా అప్పుడే తొలిసారి ప్రయోగించింది.

పెద్దన్నకు దీటుగా

పెద్దన్న అమెరికా మాబ్ గురించి తెలిశాక చైనా ఊరుకుంటుందా. అగ్రరాజ్యానికి దీటుగా తన స్టైల్లో బాంబును రూపొందించింది. దానికీ మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అనే పేరు పెట్టింది. హెచ్ 6కే బాంబర్ సాయంతో దాన్ని పరీక్షించిన వీడియోను చైనా డిఫెన్స్ ఇండస్ట్రీ సంస్థ నార్త్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేషన్ లిమిటెడ్ (నొరిన్కో) కొద్ది రోజుల కిందటే తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఆ బాంబు వల్ల జరిగిన విధ్వంసాన్ని వీడియో కళ్లకు కట్టింది. ఆ బాంబుకున్న సామర్థ్యాన్ని బట్టి న్యూక్లియర్ బాంబుల తర్వాత స్థానం దీనిదేనని చైనా మీడియా సంస్థ చెప్పింది.

బరువు, సైజు రెండూ తక్కువే

అమెరికా మాబ్ కన్నా చైనా బాంబు తక్కువ బరువుంటుంది. సైజు కూడా చిన్నదే. వీడియో చూసినదాన్ని బట్టి బాంబు 5 నుంచి 6 మీటర్ల పొడవుంటుందని బీజింగ్‌కు చెందిన మిలిటరీ అనలిస్ట్ వెయ్ డాంగ్‌క్సు చెప్పింది. రక్షణ స్థావరాలు, కోటలు, భవనాలను ఆ బాంబు సునాయాసంగా నాశనం చేస్తుందని వెల్లడించింది. యుద్ధ సమయంలో హెలికాప్టర్ల నుంచి దళాలు దిగే ప్రాంతంలో అడవుల్లాంటి అడ్డంకులుంటే బాంబుతో ఒక్కసారిగా నాశనం చేయొచ్చని చెప్పింది. యూఎస్ బాంబు చాలా పెద్దగా, బరువుగా ఉంటుంది కాబట్టి బాంబర్ సాయంతో తీసుకెళ్లలేమని, పెద్ద ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ వాడాల్సి ఉంటుందని వివరించింది. కానీ బాంబర్ అయితేనే తొందరగా బాంబును మోసుకెళ్తుందని, ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ కన్నా సమర్థంగా లక్ష్యాన్ని గురి చూసి కొడుతుందని చెప్పింది. హెచ్ 6కేను దృష్టిలో పెట్టుకొనే చైనా బాంబును తయారుచేసి ఉండొచ్చంది.

పేలుడు శక్తి 11 టీఎన్‌టీలకు సమానం

అమెరికా 2003 మార్చి 11న, నవంబరు మధ్యలో మరో సారి 'తల్లి బాంబు'ను సీ130 యుద్ధ విమానం నుండి ప్రయోగించింది. బరువు 9,525 కిలోలు. పొడవు 9 మీటర్లు. దీని పేలుడు శక్తి 11 టన్నుల టీఎన్‌టీలకు సమానం. విస్ఫోటన శక్తి సుమారు 150 మీటర్ల వరకు వ్యాపిస్తుంది. గాలిలో పేలిన కొద్ది సెకన్లలోనే పరిసర ప్రాంతాలలోని కొన్ని వందల అడుగుల వరకు వున్న ఆక్సిజన్‌ను లాగేసి ప్రాణుల్ని చంపేస్తుంది. దీన్నే 'థర్మోబారిక్' అంటారు. వృక్షాలు, భవనాలు నేలమట్టమైపోతాయి.

రష్యా దగ్గర బాంబులకు బాబు

అమెరికా బాంబు గురించి తెలిసిన కొద్ది సంవత్సరాలకు రష్యా అంతకంటే శక్తివంతమైన బాంబును తయారు చేసింది. దానికి ఫాదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని పేరు పెట్టింది. అది అమెరికా బాంబు కన్నా 4 రెట్లు శక్తివంతమైంది. అయితే చైనా బాంబు రష్యా దగ్గరున్న బాంబులా థర్మోబారిక్ కాదని నొరిన్కో వెల్లడించింది.

శనివారం | హైదరాబాద్
05.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



ఆలిండియా రేడియోకు అల్విదా

జాతీయ చానల్ మూసేస్తున్నాం: ప్రసార భారతి

- మరో 5 రీజనల్‌సెంటర్లూ క్లోజ్

న్యూఢిల్లీ: మూడు దశాబ్దాలుగా దేశ ప్రజలకు జాతీయ వ్యవహారాలపై తాజా సమాచారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆలిండియా రేడియో నేషనల్ చానల్ ఇక వినిపించదు. ఖర్చును తగ్గించుకోవడంలో భాగంగా ఆలిండియా రేడియో నేషనల్ చానల్‌ను మూసేస్తున్నట్టు ప్రసార భారతి ప్రకటించింది. దీంతోపాటు హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నో, షిల్లాంగ్, తిరువనంతపురం సిటీల్లో ఉన్న రీజనల్‌ట్రైనింగ్ అకాడమీలను కూడా మూసేయాలని ప్రసార భారతి నిర్ణయించింది. తోడాపూర్, నాగ్ పూర్ లాంటి ప్రదేశాల్లోనినేషనల్‌చానల్‌లో పనిచేస్తున్న ప్రో గ్రామ్, టెక్నికల్, మినిస్టీరియల్, ఇతర సిబ్బందితోపాటు ఐదు రీజనల్‌బ్రాడ్‌కాస్టింగ్ అండ్‌మల్టీమీడియా అకాడమీల్లో పనిచేస్తున్నవారిని సంస్థ అవసరాల మేరకు పోస్టింగ్స్ ఇస్తామని ఆలిండియా రేడియో డైరెక్టర్‌జనరల్‌జారీ చేసిన ఆర్డర్స్ లో వివరించారు. ఆలిండియా రేడియో సేవలను హేతుబద్ధీకరించేందుకు (రేషనలైజ్), ఖర్చును తగ్గించుకునేందుకు ప్రసారభారతి ఈ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆల్ ఇండియా రేడియో డీజీకి గత ఏడాది డిసెంబరు 24న సమాచారం ఇచ్చారు.అయితే భద్రంగా ఉంచుకోదగ్గ ప్రోగ్రామ్స్‌కు సంబంధించిన ఆర్కైవ్స్‌ను ఢిల్లీలోని సెంట్రల్ ఆర్కైవ్స్‌కు పంపిస్తారు. నేషనల్ చానల్ రికార్డ్ చేసిన ఈ ప్రోగ్రామ్స్‌ను ఢిల్లీలో డిజిటలైజ్ చేసి భద్రపరుస్తారు. ఆలిండియా రేడియో నేషనల్ చానల్‌ను 1987లో ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కార్యక్రమాలను ప్రసారం చేసేది. జాతీయ అంశాలపై శ్రోతలకు అవగాహన కల్పించడంలో ఈ రేడియో చానల్ ముఖ్యపాత్ర వహించింది.

మరోవైపు, ప్రసార భారతి తీసుకున్న నిర్ణయంపై ఆలిండియా రేడియోలోని కొన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఖర్చుల్ని తగ్గించుకునేందుకు చాలా మార్గాలుండగా ఈ చానల్స్‌ను మూసేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. "లైవ్ స్ట్రీమ్ ఉంది. అప్లికేషన్ ఆధారంగా సర్వీసులున్నాయి. ఖర్చులు తగ్గించుకోడానికి చాలా దారులున్నాయి. నేషనల్ చానల్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోడానికి బదులు, దాన్ని మూసేయడం దారుణం" అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



రాఫెల్‌తోనే మళ్లీ వస్తారు మోడీ

- బోఫోర్స్ స్కాంతో కాంగ్రెస్ మునిగిపోయింది
- లోక్‌సభలో రక్షణమంత్రి
- రాఫెల్ డీల్‌పై వాడివేడి చర్చ
- రాఫెల్ కుంభకోణంలో ప్రధానే ప్రధాన సూత్రధారి: రాహుల్
- గంటలు మాట్లాడినా అసలు విషయం చెప్పలేదు: నిర్మల



రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలు:

- ఫ్లయిట్ ధరను రూ. 560 కోట్ల నుంచి రూ. 1600 కోట్లకు ఎవరు పెంచారు?
- ఈ నిర్ణయం ఎయిర్‌ఫోర్స్‌దా? రక్షణ మంత్రిదా? ప్రధానిదా?
- 126 యుద్ధవిమానాలకు బదులు 36 ఫ్లయిట్స్‌ను కొనాలని ఎందుకు అనుకున్నారు?
- హాల్ బదులు ఏఏ (అనిల్ అంబానీ)కు కాంట్రాక్ట్ ఎవరిచ్చారు?
- ఈ డీల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ అంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?



రక్షణమంత్రి సమాధానాలు:

- రక్షణ డీల్, డీల్ ఇన్ డిఫెన్స్ మధ్య తేడా ఉంది.
- ప్రతి 'ఏఏ' (అనిల్ అంబానీ) వెనుక ఒక 'క్యూ(ఖత్రోచీ)', 'ఆర్‌వి (రాబర్ట్ వాద్రా)' ఉన్నారు.
- రక్షణ విషయంలో యూపీఏ ప్రతిష్టంభనను సృష్టించింది.
- 'హాల్' విషయంలో కాంగ్రెస్ మొసలికన్నీరు కార్చాల్సిన పనిలేదు.
- డసో, హెచ్ఏఎల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు.
- కాంగ్రెస్‌కు రహస్య ఉద్దేశాలున్నాయి

న్యూఢిల్లీ:

రాఫెల్‌తోనే ప్రధాని మోడీ మళ్లీ అధికారంలోకి వస్తారని అన్నారు రక్షణమంత్రి నిర్మలా సీతారామన్. 'బోఫోర్స్ ఓ పెద్ద స్కాం అని, రాఫెల్ మాత్రం అలాంటిది కాదన్నారు. బోఫోర్స్‌తో కాంగ్రెస్ మునిగిపోయిందని, రాఫెల్ అంశంతోనే మోడీ మళ్లీ అధికారంలోకి వస్తారన్న ధీమాను రక్షణమంత్రి వ్యక్తంచేశారు.

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశంపై శుక్రవారం లోక్‌సభలో మరోసారి వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు రక్షణశాఖ మంత్రి సమాధానం చెప్పారు. ఇండియా కొనుగోలు చేసిన మొదటి రాఫెల్ ఫైటర్ ఫ్లయిట్ ఈఏడాది సెప్టెంబరులో మనదేశానికి వస్తుందన్నారు. మిగిలిన ఎయిర్‌క్రాఫ్టులు 2022 నాటి కల్లా అందుబాటులో ఉంటాయని చెప్పారు. రక్షణ విషయంలో దేశ భద్రతను, ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకునే ఒప్పందాలు చేసుకుంటామని, ఈ విషయంలో రాజీ పడేదిలేదని ఆమె స్పష్టంచేశారు.

హెచ్ఏఎల్‌లో కాంగ్రెస్‌ది మొసలికన్నీరు: నిర్మలా సీతారామన్

రక్షణ విషయాల్లో యూపీఏ సర్కార్ తీరును రక్షణ మంత్రి తప్పుపట్టారు. పొరుగున ఉన్న చైనా, పాకిస్థాన్‌లు అప్రమత్తంగా ఉంటే అప్పటి యూపీఏ సర్కార్ కేవలం 18 యుద్ధవిమానాలను మాత్రమే కొనుగోలు చేసిందని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. రాఫెల్ తయారీ కాంట్రాక్ట్‌ను హెచ్ఏఎల్‌కు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టిన రాహుల్‌గాంధీ కామెంట్స్‌పై నా సీతారామన్ ఘాటుగా సమాధానం చెప్పారు. తేజస్ విషయంలో హెచ్ఏఎల్ వేగంగా పనిచేయలేని విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. హెచ్ఏఎల్ విషయంలో కాంగ్రెస్ మొసలికన్నీరు కారుస్తోందన్నారు. హెచ్ఏఎల్‌కు ఎన్డీయే సర్కార్ లక్ష కోట్ల ఒప్పందాలు అప్పగించామని మంత్రి వివరించారు.

రాఫెల్ డీల్ విషయంలో ప్రధాని మోడీపై కాంగ్రెస్ వాడిన భాష అభ్యంతరకరంగా ఉందని మంత్రి అన్నారు. ఎయిర్ ఫోర్స్ చీఫ్‌ను సైతం అబద్ధాల కోరుగా కాంగ్రెస్ చిత్రీకరిస్తోందన్నారు. ఎన్డీయే హయాంలో 'హాల్' సామర్థ్యాన్ని మెరుగుపరిచామన్నారు. యూపీఏ హయాంలో హెచ్ఏఎల్‌ను పక్కన పెట్టి అగస్టాతో ఎందుకు ఒప్పందం చేసుకున్నారని ఆమె కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. 2013 నాటి ఆఫ్‌సెట్ గైడ్‌లైన్స్ ప్రకారమే రాఫెల్ ఒప్పందాలు జరిగాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. రాఫెల్ ఒప్పందంలో తానుకానీ, మోడీ కానీ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. రక్షణశాఖ మంత్రి కామెంట్స్‌పై రాహుల్‌గాంధీ కూడా గట్టిగానే స్పందించారు. రాఫెల్ తయారీ కాంట్రాక్టు అనిల్ అంబానీకి ఎలావెళ్లిందని ఆయన ప్రశ్నించారు. విమానాల ధరలు సీక్రెట్‌గా ఉంచాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. రాఫెల్ ఒప్పందంలో ప్రధాని మోడీ జోక్యం చేసుకుని తన స్నేహితుడు అనిల్ అంబానీకి కాంట్రాక్ట్ వచ్చేలా చేశారని ఆయన ఆరోపించారు. మోడీనే ఈ స్కామ్‌లో ప్రధాన సూత్రధారి అని అన్నారు. లోక్‌సభలో రాఫెల్‌పై చర్చ జరిగిన తర్వాత రాహుల్ మీడియాతో మాట్లాడుతూ... రక్షణ మంత్రి రెండున్నర గంటలపైగా మాట్లాడినా ముఖ్యమైన ప్రశ్నలకు మాత్రం సమాధానాలు చెప్పలేదన్నారు.



"అధికారంలోకి వస్తే వివాదాస్పద రాఫెల్ ఒప్పందంపై క్రిమినల్ దర్యాప్తు చేసి దోషుల్ని కఠినంగా శిక్షిస్తాం. రాఫెల్‌పై చర్చకు భయపడి మోడీ దూరంగా వెళ్లిపోతున్నారు."
కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ

శబరిమలలో శ్రీలంక స్త్రీ

- ఆలయంలోకి వెళ్లిందన్న సీఎంవో
- వెళ్లలేదన్న శశికళ
- రాష్ట్రంలో పలు చోట్ల 144 సెక్షన్

శబరిమల: శబరిమల ఆలయంలోకి మరో మహిళ ప్రవేశించారు. శ్రీలంకకు చెందిన శశికళ(47) అనే మహిళ గురువారం అర్ధరాత్రి తర్వాత ఆలయంలోకి ప్రవేశించి, అయ్యప్పను దర్శించుకున్నారని సీఎంవో అధికారులు, పోలీసులు ధ్రువీకరించారు. ఈ మేరకు శశికళ ఆలయంలోకి వెళ్తున్న సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేశారు. అయితే ఆమె 18 మెట్లు ఎక్కారా లేదా అనే విషయంపై స్పష్టత లేదని చెప్పారు. శశికళ మాత్రం తాను దర్శనం చేసుకోలేదని చెప్పారు. సన్నిధానానికి వెళ్తుంటే భక్తులు ఎవరూ అడ్డుకోలేదని, పోలీసులు మాత్రం తనని వెనక్కి పంపారని ఆరోపించారు. తన భర్త, కొడుకుతో కలిసి వచ్చానని, వాళ్లు ఇద్దరు మాత్రమే దర్శనం చేసుకున్నారని ఆమె అన్నారు. శశికళ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆమెను ఎవరూ అడ్డుకోలేదని పోలీసులన్నారు. శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించారనే విషయంపై శుక్రవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు చోట్ల బాంబు దాడులు జరిగాయని పోలీసులు చెప్పారు.

థాయ్ తీరంలో 'పబుక్' అలజడి

బంగాళాఖాతం వైపు మళ్లొచ్చన్న అధికారులు

- భారీ వర్షాలు, ఈదురుగాలులు
- పలు దీవుల్లో చిక్కుకున్న టూరిస్టులు
- ప్రధాన భూ భాగంతో తెగిపోయిన సంబంధాలు
- ఒక్క కో సముయ్ దీవిలోనే 20 వేల మంది
- ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటున్న పర్యాటకులు
- రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం



బ్యాంకాక్:

'పబుక్' తుఫాను దక్షిణ థాయ్‌లాండ్‌లో అలజడి సృష్టిస్తోంది. దేశంలో గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా విజృంభిస్తోంది. దీంతో చాలా దీవుల్లోని పర్యాటక ప్రాంతాల్లో టూరిస్టులు చిక్కుకుపోయారు. ప్రధాన భూభాగంతో సంబంధాలు తెగిపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

75 కిలోమీటర్ల వేగంతో గాలులు

'పబుక్' తుఫాను శుక్రవారం నఖోన్ సి థమ్మరట్ ప్రావిన్స్ లోని పక్ పనంగ్ జిల్లాలోకి ప్రవేశించింది. దీంతో థాయ్‌లాండ్‌లోని ప్రముఖ టూరిస్టు ప్రాంతాలు కో సముయ్, కో ఫంగన్, కో తావ్ దీవులతోపాటు అండమాన్ సముద్రంలోని ఫుకెట్, కో ఫి ఫి దీవులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని థాయ్‌ల్యాండ్ వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం గంటకు 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. భారీ వర్షాలు కురుస్తున్నాయి.

మున్ముందు 95 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని, కుండపోత వర్షాలు కురవొచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మలాయ్ నుంచి అండమాన్ సముద్రంలోకి 'పబుక్' తుఫాను ప్రవేశిస్తుందని, అటు నుంచి బంగాళాఖాతంలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో మయన్మార్, బంగ్లాదేశ్, ఇండియాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు.

కో సముయ్‌లో చిక్కుకున్న టూరిస్టులు

కో సముయ్, కో టావో, కో ఫంగన్ దీవుల నుంచి వేలాది మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే కో సముయ్‌లో వేలాది మంది టూరిస్టులు చిక్కుకున్నారు. అక్కడ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరెంటు సరఫరా కూడా సరిగా లేదు. "కో సముయ్ దీవిలో 20 వేల మంది వరకు టూరిస్టులు ఉన్నారు. ప్రధాన భూభాగంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఇక్కడ గురువారం నుంచే అన్ని రకాల రవాణా ఆగిపోయింది. తుఫాను తీవ్రత తగ్గే వరకు దీవిలో ఉన్న వారికి అవసరమైన ఆహారం అందుబాటులో ఉంది" అని కో సముయ్ జిల్లా చీఫ్ కిట్టిపాప్ రోడన్ చెప్పారు. కో టావో డియూలో 4 వేల మంది, కో ఫంగన్‌లో 15 వేల మంది చిక్కుకుపోయారని అధికారులు చెప్పారు. ఇక్కడ ఏదైనా ఎమర్జెన్సీ తలెత్తితే రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహించడం కష్టమేని అన్నారు.

రవాణా పూర్తిగా నిలిపివేత

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్ని విమాన, బోటు సర్వీసులను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. నఖోన్ సి థమ్మరట్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. శుక్రవారం కో సముయ్ నుంచి వెళ్లే అన్ని విమాన సర్వీసులను రద్దు చేసినట్లు బ్యాంకాక్ ఎయిర్‌వేస్ ప్రకటించింది.

షెల్టర్లకు తరలింపు

కోస్టల్ ఏరియాల్లో నివసిస్తున్న వేలాది మంది స్థానికులను గురువారమే షెల్టర్లకు తరలించినట్లు డిజాస్టర్ ప్రివెన్షన్, మిటిగేషన్ ఏజెన్సీ తెలిపింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న వారిని తరలించేందుకు మూడు రోజులుగా ఆర్మీ సాయం చేస్తోందని ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ ఛైపోల్ థిటిసా తెలిపారు. తీర ప్రాంతాలను దాదాపుగా ఖాళీ చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో సేవలందించేందుకు రాయల్ థాయ్ నేవీకి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, రెండు షిప్పులను కూడా అందుబాటులో ఉంచారు.

ఏటా ఇదే సమయంలో..

ఏటా ఇదే సమయంలో థాయ్‌ల్యాండ్ గల్ఫ్ తీరంలో తుఫానులు వస్తుంటాయి. 1962లో వచ్చిన హరియెట్ తుఫానుకు 900 మందికిపైగా చనిపోయారు. ఆ తర్వాత 1989లో వచ్చిన గేయ్ తుఫాను కారణంగా 800 మంది మృతి చెందారు. తాజా పబుక్ తుఫాను వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్థానిక అధికారులు చెబుతున్నారు.

చిక్కుకుపోయాం

"నా భర్త పుట్టిన రోజును జరుపుకునేందుకు కుటుంబమంతా కలిసి కో సముయ్ బీచ్‌కు వచ్చాం. శుక్రవారమే తిరిగి వెళ్లాల్సి ఉంది. కానీ తుఫాను కారణంగా అన్ని విమాన, నౌక సర్వీసులు రద్దు చేయడంతో దిక్కుతోచడంలేదు. తుఫాను గురించిన సమాచారాన్ని స్థానిక అధికారులు చెప్పడం లేదు. అసలు వాళ్లు ఏం చేస్తున్నారో కూడా తెలీదు. ప్రస్తుతం బీచ్‌కు కిలోమీటర్ దూరంలోని ఓ ప్రైవేటు విల్లాలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. నాకు చాలా భయంగా ఉంది. ఏం జరగబోతోందో అర్థం కావట్లేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోయేందుకు వేరే దారి కూడా లేదు"

- అమెరికన్ టూరిస్టు మిరండా అబిడిర్

అయోధ్య కేసు విచారణ 10కి వాయిదా

న్యూఢిల్లీ: అయోధ్య వివాదం కేసు మరోసారి వాయిదా పడింది. శుక్రవారం ఈ కేసు విచారణకు రాగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్.కె. కౌల్‌తో కూడిన ధర్మాసనం వెంటనే వాయిదా వేసింది. ఈ కేసుపై విచారణ తేదీని తగిన బెంచ్ ఈ నెల 10న నిర్ణయిస్తుందని ప్రకటించి.. 30 సెకన్లలోనే వాయిదా వేసింది. సీనియర్ అడ్వకేట్లు హరీశ్ సాల్వే, రాజీవ్ ధావన్ లకు వాదనలు వినిపించే అవకాశం కూడా రాలేదు. అయోధ్య వివాదంపై గతంలో దాఖలైన 4 సివిల్ వ్యాజ్యాలపై అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. మొత్తం 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని చెప్పింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 14 అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు జనవరి మొదటివారంలో తగిన బెంచ్ విచారణ చేపడుతుందని గత ఏడాది అక్టోబర్ 29న ప్రకటించింది. శుక్రవారం విచారణకు రాగానే మరోసారి వాయిదా వేసింది.



రెండో రోజూ ఐటీ సోదాలు

బెంగళూరు: కర్నాటకలోని టాప్‌సినీ యాక్టర్ల ఇళ్లల్లో రెండో రోజు ఐటీ సోదాలు కొనసాగాయి. హీరోలు శివరాజ్ కుమార్, పునిత్ రాజ్‌కుమార్, సుదీప్, యశ్, ప్రముఖ నిర్మాతలు సీఆర్‌మనోహర్, రాక్‌లైన్ వెంకటేశ్, కనకదుర్గ ఇళ్లలో గురువారం నుంచి ఈ సోదాలు జరుగుతున్నాయి. శుక్రవారం వారి బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో, ఆఫీసుల్లో కూడా సోదాలు జరిపినట్టు అధికారులు చెప్పారు. ఫైళ్లు, అకౌంట్స్ పుస్తకాలు, డాక్యుమెంట్లు పరిశీలించిన అధికారులు పెద్ద మొత్తంలో బంగారం, నగదును సీజ్‌చేశామని చెప్పారు.



శ్రీనగర్‌లో శుక్రవారం కురిసిన మంచు కార్లపై ఇలా పేరుకుపోయింది

ఉత్తరాదిన చలి తగ్గనంటోంది

న్యూ ఢిల్లీ:

ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. చలి గాలులతో ప్రజలు వణుకుతున్నారు. దట్టమైన పొగమంచు వల్ల ప్రజా రవాణా స్తంభించిపోయింది. ఢిల్లీలో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. శుక్రవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రత 7.1డిగ్రీలుగా రికార్డయింది. శని, ఆదివారాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. కాశ్మీర్ వ్యాలీ అంతటా శుక్రవారం మధ్యాహ్నం నుంచి మంచు కురుస్తుండడంతో జనం ఇబ్బంది పడ్డారు. శ్రీనగర్ వైపు వాహనాలను అధికారులు నిలిపేశారు. రోడ్లపై మంచును ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. రాకపోకలు పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్, హర్యానాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువకు పడిపోయాయి. అదంపూర్, జలంధర్‌లో అత్యంత తక్కువగా 1.2 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్‌లలో 3.3, అమృత్‌సర్, ఫరీద్‌కోట్‌లో 4 డిగ్రీలు, చండీగఢ్‌లో రాత్రి ఉష్ణోగ్రత 5.5డిగ్రీలు గా నమోదైంది. యూపీలోని ఆగ్రాలో అత్యంత తక్కువగా 4.1 డిగ్రీలు నమోదైంది. గోరఖ్‌పూర్‌లోనూ చలి తీవ్రత కొనసాగుతోంది.

డీపీసీసీ పదవికి మాకెన్ బైబై

న్యూఢిల్లీ:

కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ (డీపీసీసీ) పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సాయంత్రం కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, ఢిల్లీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జి పి.సి.చాకోలను అజయ్ మాకెన్ కలిశారు. ఆయన రాజీనామాను రాహుల్ గాంధీ ఆమోదించినట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. నాలుగేళ్ల క్రితం అజయ్ మాకెన్ ఢిల్లీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టారు. "2015 ఎన్నికల తర్వాత ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ గా పార్టీ శ్రేణులు, మీడియా నుంచి నాకు అపారమైన ప్రేమ, మద్దతు లభించాయి. అందరికీ కృతజ్ఞతలు" అంటూ ఆయన ట్వీట్ చేశారు. గత సెప్టెంబర్ లో మాకెన్ రాజీనామాపై వచ్చిన వార్తలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మెడికల్ చెకప్ కోసం ఆయన విదేశాలకు వెళ్లినట్లు చెప్పింది. 2019 ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తు కుదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఆప్ తో పొత్తును మాకెన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ బాధ్యతలను మాజీ సీఎం షీలా దీక్షిత్ కు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. కాంగ్రెస్ నాయకులు యోగానంద్ శాస్త్రి, రాజ్ కుమార్ చౌహాన్, హరూన్ యూసుఫ్, చటర్ సింగ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.



- ఆప్ తో పొత్తును వ్యతిరేకించిన అజయ్ మాకెన్
- కొత్త చీఫ్ రేసులో షీలా దీక్షిత్

ఊరిని మరువలేదు



వధూవరులు యశస్విని, రాజారామ్‌లతో జి.వివేక్, ఎర్రబెల్లి దయాకరరావు

- ఎన్నారై రాజేందర్‌రెడ్డి దంపతులకు ప్రశంసలు
- సొంతఊరి జనాల మధ్య కుమారుడి రిసెప్షన్ వేడుకలు
- హాజరైన వివేక్ వెంకటస్వామి, ఎర్రబెల్లి దయాకరరావు

మహబూబాబాద్, వెలుగు: ఎంత ఎదిగినా కన్న తల్లిదండ్రులను, జన్మనిచ్చిన గడ్డను మరువకూడదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్ వెంకటస్వామి, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు మండలంలోని చెర్లపాలెంకు చెందిన ఎన్నారై రాజేందర్‌రెడ్డి దంపతుల చిన్న కుమారుడు అనుమాండ్ల రాజారామ్, యశస్విని పెళ్లి రిసెప్షన్‌కు వారు హాజరై వధువరులను ఆశీర్వదించారు. రాజేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. వివేక్, ఎర్రబెల్లిలను గ్రామస్థులు రెండు కిలోమీటర్ల దూరం నుంచి బతుకమ్మలు, కోలాటాలు, నృత్యాలతో ఎదురుకొన్నారు. గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు, ఎంపిపి కర్నసోమయ్య, గ్రామస్థులు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, డాక్టర్‌వెంకట్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరికి సేవలు అభినందనీయం
ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎన్నారై డాక్టర్ అనుమాండ్ల రాజేందర్‌రెడ్డి, ఝాన్సీ దంపతులు అమెరికాలో స్థిరపడినా సొంతూరి మీద ప్రేమతో గ్రామాన్ని దత్తత తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే దయాకరరావు అన్నారు. ప్రభుత్వ స్కూళ్లకు భవనాలు నిర్మించడం, 1995లోనే తొర్రూరులో రూ.22లక్షలతో ప్రభుత్వ ఆస్పత్రి కట్టారని, పేదలకు డబుల్‌బెడ్‌రూమ్‌ల కోసం, పంచాయతీ భవనం కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చారని, పేద పిల్లల చదువుకోసం సహాయం చేస్తున్నారని గుర్తు చేశారు.

ప్రజలు సేవలను మరువరు
జి. వివేకానందవెంకటస్వామి


పుట్టిన గడ్డకు సేవ చేస్తే ప్రజలు ఎప్పటికి మరిచిపోరని ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి అన్నారు. తన క్లాస్‌మెట్ డాక్టర్‌అనుమాండ్ల రాజేందర్‌రెడ్డి, ఝాన్సీ దంపతులు విదేశాల్లో ఉంటున్నా సొంత ఊరితో పాటు తొర్రూరు తదితర గ్రామాల్లో రూ. లక్షల రూపాయలతో విద్య, వైద్య సేవలను అందిస్తున్నారని కొనియాడారు. ప్రపంచీకరణ ప్రభావంతో పల్లెలను మరిచిపోతున్నారని, రాజేందర్‌రెడ్డి మూలాలను మరిపోలేదన్నారు. ఊరంతా తరలివచ్చి తమ సొంత కార్యక్రమంలాగా రిసెప్షన్‌లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు.

వివేక్ సలహాతోనే సేవ కార్యక్రమాలు
డాక్టర్‌అనుమాండ్ల రాజేందర్‌రెడ్డి

తన క్లాస్‌మెట్, ప్రభుత్వసలహాదారు జి. వివేక్‌వెంకటస్వామి సలహా మేరకు సేవ కార్యక్రమాలను మొదలుపెట్టినట్టు డాక్టర్‌అనుమాండ్ల రాజేందర్‌రెడ్డి అన్నారు. తన భార్య కూడా తోడుండడంతో విద్యా, వైద్య రంగాల్లో సేవలను విస్తరించామన్నారు. తమ పట్ల గ్రామస్థులు చూపిస్తున్న అభిమానాన్ని మరువలేమన్నారు.



గజమాలతో ప్రభుత్వ సలహదారు జి,వివేక్, ఎమ్మెల్యేఎర్రబెల్లి దయాకర్‌రావులకు సన్మానం



Ramesh Chennamaneni
M.L.A
...ulavada Assembly Constituency
Rajanna Sircilla District

H.No. 1141, "Srinivasa"
MLA's Colony, Road No. 1...
Banjara Hills, Hyderabad -



కేటీఆర్ దారిలో..

గ్రామ పంచాయతీల ఏకగ్రీవానికి ఎమ్మెల్యే కేటీఆర్ దారిలోనే చాలామంది ఎమ్మెల్యేలు నడుస్తున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేస్తానని గురువారం సిరిసిల్లలో కేటీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో మరో నలుగురు ఎమ్మెల్యేలు ఇలాంటి ప్రకటనే చేశారు.

- ఏకగ్రీవ పంచాయతీలకు బంపర్ ఆఫర్లు
- ప్రభుత్వ నజరానాకు తోడు ఎమ్మెల్యేల నిధులు
- తాజాగా నలుగురు శాసనసభ్యుల ప్రకటన
- ఒక్కటవుతున్న గ్రామాల ప్రజలు

వెలుగు, సిరిసిల్ల:

ఏకగ్రీవ పంచాయతీలకు ఎమ్మెల్యేలు బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవడం ద్వారా తమ పతారా పెంచుకోవాలని చూస్తున్నారు. మొదట సిరిసిల్ల ఎమ్మెల్యే కె. తారకరామారావు ఈ ఆఫర్‌అనౌన్స్ చేశారు. ఆయన బాటలోనే ఇప్పుడు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు కూడా ఆఫరిచ్చారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే రూ. 10 లక్షల ప్రోత్సాహకానికి తోడు ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.15 లక్షలు కేటాయిస్తానని ఆయన ప్రకటించారు. ఈ మేరకు అన్ని గ్రామాలపెద్దలకు, యువతకు రమేష్ బాబు లేఖ రాశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్ తండా వాసులు సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొని అందరి దృష్టిని ఆకర్షించారు. నామినేషన్లకు గ్రామస్థులు ఏకగ్రీవ ఎన్నికకు తీర్మానం చేశారని కేటీఆర్ అభినందించారు. లక్ష్మీపూర్ స్ఫూర్తితో ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం కావాలని ఆయన సిరిసిల్లాలో మాట్లాడుతూ సూచించారు. ఎమ్మెల్యేల ఆఫర్లతో గ్రామాల్లో ఆలోచన మొదలైంది. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగితే ఊరికి మేలు జరుగుతుందనుకుంటున్నారు. దీంతో ఒక్కో గ్రామమే తీర్మానం చేయడం మొదలైంది. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం దేగవత్ తండా పాలకవర్గం మొత్తం ఏకగ్రీవమైంది. అదే విధంగా గంభీరావుపేట మండలం పొన్నలపల్లిలో కూడా పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకున్నట్లు ప్రకటించారు. వీటికి ప్రభుత్వం తరుపున రూ. 10 లక్షల నజరానాతో పాటు ఎమ్మెల్యే కేటీఆర్ కూడా నిధులు ఇస్తారు. ఈ గ్రామాలకు మొదటి ఏడాదే రూ. 25 లక్షల నిధులు అదనంగా రానున్నాయి. దీనితో పాటుగా నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కూడా శుక్రవారం ఏకగ్రీవమైంది. ఆఫర్లు బాగా పని చేస్తుండడంతో మరి కొందరు ఎమ్మెల్యేలు ఏకగ్రీవాలకు ప్రోత్సాహకాలు ఇస్తామంటున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి రూ.10 లక్షలు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.10 లక్షలు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ రూ.10 లక్షలు ప్రకటించారు.

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పంచాయతీ రాజ్ చట్టం 2018 వల్ల పల్లెలకు ఎక్కువగా నిధులు వచ్చే అవకాశం ఉంది. కొత్తగా గిరిజన తండాలు పంచాయతీలయ్యాయి. చిన్న పంచాయతీ కావడంతో అభివృద్ధి మీద గ్రామస్థులు దృష్టి పెడుతున్నారు. అటు సర్కారు, ఇటు ఎమ్మెల్యేలు నజరానాలు ప్రకటించడంతో ఊరొళ్లంతా ఒక్క తాటిమీద కొస్తున్నారు. గ్రామపెద్దలు, విద్యావంతులు ఏకగ్రీవాల కోసం అందరినీ ఒప్పించే బాధ్యతలు తీసుకుంటున్నారు. చాలా చోట్ల ఈ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గతంలో ఏకగ్రీవాలకు ఇచ్చే పారితోషికాలు చాలా తక్కువ. మేజర్ పంచాయతీలకు రూ. 5 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ. 2.5 లక్షలు ఇచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తున్నారు. తెలంగాణ ఏర్పడేనాటికే ఏకగ్రీవమైన 541 పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున విడుదల చేసింది. ఈసారి కూడా ఇదే మొత్తాన్ని పారితోషికంగి ఇవ్వనుంది. దీనికి ఇప్పుడు ఎమ్మెల్యేల నిధులు ఇస్తామంటుండడంతో ఏకగ్రీవాలు పెరిగే అవకాశం ఉంది.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఐదు గంటల్లోనే దొరికిన కిడ్నాపర్

- తల్లిదండ్రులకు బాలున్ని అప్పగించిన పోలీసులు
- హుస్నాబాద్ లో కిడ్నాప్.. మల్లారంలో పట్టివేత

ఎల్కతుర్తి/సిద్దిపేట, వెలుగు: బాలుణ్ణి కిడ్నాప్ కేసును పోలీసులు ఐదు గంటల్లో ఛేదించారు. ఓ యువకుడు బాలుడిని ఎత్తుకుపోతున్న సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పట్టుకున్నారు. హుస్నాబాద్, భీమదేవరపల్లి పోలీసుల జాయింట్ ఆపరేషన్ ద్వారా బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరాడు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన సీహెచ్‌స్రవంతి, శ్రీనివాస్‌ల రెండేళ్ల కుమారుడు పరమేశ్ ఇంటి ముందు ఆడుకుంటుండగా పోలోజు నాగరాజు అనే యువకుడు కిడ్నాప్ చేశాడు. బాలున్ని తీసుకొని భీమదేవరపల్లి మండలం మల్లారానికి వచ్చాడు. బాబు ఏడుస్తుండడం, నాగరాజు ప్రవర్తనతో అనుమానం వచ్చిన సర్పంచ్ తిరుపతి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే హుస్నాబాద్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వేట మొదలుపెట్టారు. మల్లారంలో పిల్లాడు ఉన్నాడని తెలుసుకుని కిడ్నాప్ కు పాల్పడిన నాగరాజును అదుపులోకి తీసుకుని బాలుణ్ణి తల్లిదండ్రులకు అప్పగించారు. నాగరాజు ఎందుకు పిల్లవాడిని కిడ్నాప్ చేశాడనే విషయాన్ని ఆరా తీస్తున్నట్టు ఏసీపీ మహేందర్ తెలిపారు.

పోలీసుల అదుపులో ఎన్డీ దళ కమాండర్?

ధ్రువీకరించని పోలీసులు

మహబూబాబాద్, వెలుగు : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న వర్గం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న సింగరబోయిన వీరభద్రం అలియాస్ రామును శక్రవారం మహబూబాబాద్ స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆ పార్టీ నేతల కథనం ప్రకారం.. అనారోగ్యంతో బాధపడుతున్న వీరభద్రం ఖమ్మం జిల్లాలో చికత్స పొంది జిల్లాలోని డోర్నకల్ మండలంలోని వెన్నారం గ్రామంలో తమ బంధువుల ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఇంటిని చుట్టుముట్టారు. రాముతో పాటు ఆయన భార్య సునీత, ఇంటి యజమాని బల్లె బోయిన రాములు, మరో వ్యక్తి జల్లె నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. న్యూడెమోక్రసీ నేతలు మాత్రం ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపరుచాలని కోరుతున్నారు.

గుండుపిన్ను.. సూది.. దారం..

ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 156 రకాల వస్తువులు

మెదక్, వెలుగు : గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పది.. ఇరవై కాదు.. ఒక్కో కేంద్రానికి 156 రకాల వస్తువులు. పోలింగ్ స్టేషన్ల ఎంపిక ఇదివరకే పూర్తయింది. మొదటి విడత ఎన్నికలు జరుగనున్న గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని జిల్లా కేంద్రంలోని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కార్యాలయం నుంచి మండలాలకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి పంచాయతీల వారీగా పోలింగ్ స్టేషన్లకు చేరవేస్తారు. అయితే పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 156 రకాల వస్తువులు సరఫరా చేస్తుండడం విశేషం. ఇందులో బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ మీద ఓటు వేసేందుకు ఉపయోగించే స్టాంపు, వేలికి గుర్తు పెట్టే సిరా బాటిల్ తోపాటు గుండుపిన్ను, సూది, బ్లేడు,



పోలింగ్ స్టేషన్‌లకు సరఫరా చేస్తున్న సామగ్రి

దారం, సుతిలి తాడు, అగ్గిపెట్టె, పెన్సిళ్లు, పెన్నులు, గమ్ బాటిల్, క్యాండిల్స్, లక్క, స్టాంప్ ప్యాడ్, కార్బన్ పేపర్లు, రబ్బర్ బ్యాండ్లు, రిబ్బన్లు, పేపర్ వెయిట్లు, ఫ్లెక్సిబుల్ వైర్, ఇంకు బాటిల్, తడిసిన స్పాంజ్ ఉంచే చిన్న కప్పు, వైట్ పేపర్లు, వివిధ సైజుల ఎన్వలప్ కవర్లు, ప్లాస్టిక్ ట్రేలు, కంపార్టుమెంట్ అట్టలు, ట్రంకు పెట్టె, గోనె సంచి, బట్ట సంచి, ట్యాగ్‌లు, లేబుల్స్, సైన్ బోర్డులు తదితర వస్తువులు ఉన్నాయి.

కంచెలో చిక్కి.. తప్పించుకున్న చిరుత

నిజామాబాద్, వెలుగు : నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి శివారులో ఓ చిరుత రైతులు పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న కంచెలో చిక్కుకుంది. గురువారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత కంచెలో చిక్కుకున్న విషయాన్ని గ్రామస్తులు గమనించి శుక్రవారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దాంతో మామిడిపల్లి రేంజ్ ఆఫీసర్ అమృతమ్మ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగ్ రావుతో సహా ఫారెస్ట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో వచ్చి కంచెలో ఇరుక్కున్న చిరుతను ప్రాణాలతో కాపాడేందుకు ప్రయత్నించారు. జిల్లా అధికారుల ద్వారా హైదరాబాద్ లోని నెహ్రూ జువాలజికల్ పార్క్ లోని ఎనిమల్ రెస్క్యూ టీం కు సమాచారం అందించారు. వారి రాక కోసం అధికారులు ఎదురు చూసారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో చిరుత బోనులో చిక్కిన వార్త బయటకు రావడంతో అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఫారెస్ట్ అధికారులతో పాటు పోలీసులు కూడా చేరుకున్నారు.




కంచెలో చిక్కిన చిరుత విడిపించుకుని జనాలపై దాడి చేయకుండా ఉండేందుకు జనాలను చిరుత చిక్కుకున్న చోటికి చాలా దూరంలో ఉంచారు. ఎవరినీ దగ్గరికి అనుమతించలేదు. సాయంత్రం వరకు రెస్క్యూ టీం రాలేదు. టీం రావడం చాలా ఆలస్యమైంది. అప్పటి వరకు చిరుత ఉచ్చునుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది. ఎట్టకేలకు రెస్క్యూటీంలు మెదక్, హైదరాబాద్ నుంచి రెండు టీంలు వచ్చి వలలు సిద్ధం చేసుకున్నారు. ఈ లోపే చిరుత ఉచ్చును విడిపించుకుని అడవిలోకి పరుగెత్తింది.

కంసాన్‌పల్లి ఏకగ్రీవం

మహబూబ్‌నగర్, వెలుగు:

గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టానికి ముందే మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి పంచాయతీ పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నాడు గ్రామంలోని సీతారాముడి గుడిలో గ్రామస్తులంతా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గురునాథ్ గౌడ్‌కే మళ్లీ సర్పంచ్ పదవి ఇవ్వాలని తీర్మానం చేశారు. జిల్లాలోనే తొలి ఏకగ్రీవ పంచాయతీ కంసాన్‌పల్లి అధికార పార్టీ టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లింది. 3,213 జనాభా కలిగిన ఈ గ్రామంలో 2,222 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,122, స్త్రీలు 1,100 మంది ఉన్నారు. 2013 ఎన్నికల్లో గురునాథ్‌గౌడ్ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి శిష్యుడైన ఆయన కాంగ్రెస్ మద్దతుదారుడిగా గత ఎన్నికల్లో పోటీ చేసి 380 ఓట్ల మెజార్టీతో టీడీపీ మద్దతుదారుడిపై అఖండ విజయం సాధించారు. తన రాజకీయ గురువు చిట్టెం టీఆర్ఎస్‌లోకి వెళ్లడంతో ఆయన కూడా ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా ఈఎన్నికల్లో కంసాన్‌పల్లి గ్రామపంచాయతి బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో మళ్లీ అదృష్టం వరించింది. గతంలో గ్రామానికి చేసిన అభివృద్ధి, పంచాయతీ ఏకగ్రీవం అయితే ప్రభుత్వం ఇచ్చే నజరానాతో పాటు మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షతో ఆయనను మళ్లీ సర్పంచ్‌గా ఏన్నుకున్నారు.



- వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవమే..
- కాబోయే సర్పంచ్‌కు గ్రామస్తుల అభినందనలు
- అభివృద్ధి కోసమే.. గ్రామస్తుల తీర్మానం

గ్రామస్తులకు రుణపడి ఉంటా

“ తనను రెండోసారి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు రుణపడి ఉంటానని తాజా మాజీ సర్పంచ్ గురునాథ్ గౌడ్ అన్నారు. ప్రజల ఆశలు వమ్ముచేయకుండా గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. ఇంత పెద్ద గ్రామపంచాయతీ బాధ్యతలు మళ్లీ తనకే అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

- గుర్నాథ్‌గౌడ్



ఇద్దరు అమ్మాయిలు మృతి

యాదాద్రి, వెలుగు:

యాదాద్రి భువనగిరి జిల్లాలో శుక్రవారం ఒక్క రోజే ఇద్దరు అమ్మాయిలు మృతి చెందారు. ఆలేరులోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన 9వ తరగతి అమ్మాయి కేతావత్ బిందు(14), మోత్కూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంకు చెందిన 6వ తరగతి అమ్మాయి ఊహ(11) ఆకస్మాత్తుగా మృతి చెందారు. వీరిద్దరూ స్పృహ తప్పి మృతి చెందడం, కారణం తెలియకపోవడం వివాదాస్పదంగా మారింది.

నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం మేగ్యాతండాకు చెందిన కేతావత్ భాస్కర్, బుజ్జి దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె. భాస్కర్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. కుమారుడు విజయ్ పాలిటెక్నిక్ డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కూతురు బిందు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలోని బ్యాక్ టు బ్యాక్ అనే క్రిస్టయన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహంలో ఉంటూ, ఆలేరులోని జేఎంజే పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈమె 3వ తరగతి నుంచి ఇక్కడే ఉంటూ, ఇదే పాఠశాలలో చదువుకుంటోంది. ప్రస్తుతం ఈ వసతి గృహంలో 51మంది అమ్మాయిలు ఉన్నారు. వీరిని సదరు స్వచ్ఛంద సంస్థే ఆలేరులో జేఎంజే, ఎవరెస్ట్ స్కూళ్లో చదివిస్తోంది. వసతి గృహంకు చెందిన బస్సులోనే రోజూ వచ్చి పోతారు. అయితే, శుక్రవారం ఉదయం రోజూ మాదిరిగానే నిద్ర లేచిన విద్యార్థిని బిందు వాష్‌రూంకు వెళ్లి స్పృహ తప్పి పడిపోయింది.



బిందు

ఎంతకూ రాకపోవడంతో తోటి విద్యార్థులు నీలిమా, నేహలు చూసి, మేనేజర్ దేవదాసుకు చెప్పారు. వెంటనే జనగామలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బిందు మృతిచెందినట్టుగా వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న బిందు బంధువులు శుక్రవారం సాయంత్రం హాస్టల్ వద్దకు వచ్చి, వసతి గృహం యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మృతిచెందిందని ఆందోళన చేపట్టారు. ఆలేరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోత్కూరులోని కేజీబీవీలో..

మోత్కూరులో నిర్వహిస్తున్న అడ్డగూడూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం 6వ తరగతి అమ్మాయి ఊహ(11) ఆకస్మాత్తుగా మృతి చెందింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన ఏల ఉప్పలయ్య, శ్యామల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఊహ మోత్కూరులోని కేజీబీవీలో ఆరో తరగతి చదువుతుండగా, చిన్న కూతురు తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత ఊహ స్పృహ తప్పి కింద పడిపోయింది. వెంటనే భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అనారోగ్యం కారణంగా చనిపోయినట్టు భావిస్తున్నారు. విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న జేసీ రమేశ్, భువనగిరి ఆర్డీఓ భూపాల్‌రెడ్డి ఏరియా దవాఖానకు వెళ్లి, ఊహ మృతదేహాన్ని పరిశీలించి, వైద్యులను వివరాలడిగి తెలుసుకున్నారు.



ఊహ

పరువు నష్టం దావాలో దిగ్విజయ్ కు ఊరట

- నాన్ బెయిలబుల్ వారెంట్ సస్పెండ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, వెలుగు: పరువు నష్టం దావాలో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీపై అనుచిత వ్యాఖ్యల కేసులో నాంపల్లి కోర్టు ఆయనపై జారీ చేసిన నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. భయపెట్టి డబ్బులు వసూలు చేసేందుకు అసదుద్దీన్ కొన్ని రాష్ట్రాల్లో మజ్లిస్ పార్టీని బరిలోకి దింపారంటూ గతంలో హైదరాబాద్ లో దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యలు చేశారు. తద్వారా ఒవైసీ పరువుకు భంగం కలిగించారంటూ దిగ్విజయ్ సింగ్ పై మజ్లిస్ పార్టీ జనరల్ సెక్రటరీ హుస్సేన్ అన్వర్ నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు. దీనిపై పలుమార్లు విచారణ జరిపిన నాంపల్లి కోర్టు వ్యక్తిగతంగా హాజరు కావాలని దిగ్విజయ్ ను ఆదేశించింది. విచారణకు గైర్హాజరవడంతో నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

పంచాయతీలను ఏకగ్రీవం చేయండి

- గిరిజనులు, ఆదివాసులకు గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వినతి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని 3,146 గిరిజన పంచాయతీల ఏకగ్రీవానికి సహకరించాలని జీసీసీ చైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీ నాయక్ శుక్రవారం కోరారు. ఏకగ్రీవ పంచాయతీకి ప్రభుత్వం రూ.10 లక్షల ప్రోత్సాహకం ఇస్తుందని, ఎమ్మెల్యేల నిధుల నుంచి రూ.15 లక్షలొస్తాయని చెప్పారు. గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండా పంచాయతీ సర్పంచ్‌గా లకావత్ మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, తోటల పెంపకానికి ఇస్తున్న సబ్సిడీలతో రైతన్నలు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు కొద్ది మొత్తంలో ఉన్న పూలు, పండ్ల తోటలు రాష్ట్రంలో ఇప్పుడు నాలుగు లక్షల పదిహేను వేల ఎకరాల్లో సాగవుతున్నాయి.

‘ఉద్యాన’ కళ

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు సబ్సిడీ | ఎకరాకు రూ.3.5 లక్షలు | తోటలకు ప్రభుత్వ ప్రోత్సాహం



హైదరాబాద్, వెలుగు:

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. వీటి సాగులో రైతులకు శిక్షణతో పాటు, సబ్సిడీ రూపంలో సర్కారు ఆర్థిక చేయూతనిస్తుండడంతో తోటల పెంపకానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఆధునిక పద్ధతిలో సాగుచేస్తున్న అంజీర, ఆపిల్ బేర్, దానిమ్మ, సీతాఫలం, జామ, మామిడి తదితర పండ్ల తోటలతో పాటు జెర్బెరా, కార్నేషన్, చామంతి వంటి పూలసాగు కోసం సబ్సిడీలను అందిస్తోంది. ఈ ఏడాది నుంచి డ్రాగన్ ఫ్రూట్ సాగుకోసం సబ్సిడీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పండ్లకు మార్కెట్ లో డిమాండ్ పెరగడం, సాగుకు రాష్ట వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇండోనేసియా, ఇజ్రాయెల్, చైనా తదితర దేశాలతో పాటు మన దేశంలో కొన్ని రాష్ట్రాల్లోనే ఈ ఫ్రూట్ సాగులో ఉంది. కొంతకాలంగా రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, సూర్యాపేట, మేడ్చల్ జిల్లాల్లో పలువురు రైతులు దాదాపు 70 ఎకరాల్లో ఈ పంట పండిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

30 ఏళ్ల దాకా పంట దిగుబడి..

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు తొలిసారి పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. దాంతో పంట వేయడానికి రైతులు వెనకడుగేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సబ్సిడీ ఇవ్వాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఈ పంట వేయాలంటే ఒక్కో ఎకరాకు రూ.4 నుంచి 5లక్షల దాకా ఖర్చవుతోంది. ఇందులో 75శాతం అంటే గరిష్ఠంగా రూ.3.56 లక్షలను సబ్సిడీ రూపంలో ఉద్యానశాఖ ఇస్తుంది. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వ్యయాన్ని భరిస్తాయి. ఈ ఏడాది ఒక్కో రైతుకు ఎకరా చొప్పున 20 మందికి సబ్సిడీ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లోనూ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయాలని ఉద్యానశాఖ యోచిస్తోంది. ఎకరాకు 2 వేల మొక్కలు నాటుకోవచ్చని, మొక్కలు నాటిన రెండో ఏడాది నుంచి 30 ఏళ్ల దాకా దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కొత్తగా 37 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి వచ్చాయి. మొత్తంగా 4 లక్షల 15 వేల ఎకరాల్లో ఈ పంటలు సాగు చేస్తున్నారని సంబంధిత అధికారులు వెల్లడించారు. తక్కువ నీటివినియోగం, ప్రభుత్వ సబ్సిడీతో పాటు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉండడంతో ఉద్యాన సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

క్లీన్ చేయండి.. సర్పంచ్ అవ్వండి!



- ఆశావహుల మధ్య పోటీ పెట్టిన జనగామ ఎమ్మెల్యే
- ‘క్లీన్ విలేజ్’లుగా పల్లెలు

జనగామ, వెలుగు:

అంతట ఉన్నట్టే జనగామ సెగ్మెంట్‌లోనూ సర్పంచ్ ఆశావహులు దండిగానే ఉన్నరు. షెడ్యూల్‌కు ముందునుంచే ఎమ్మెల్యే యాదగిరి రెడ్డి ఇంటి చుట్టూ తిరుగుతున్నరు. ఏ గ్రామంలో చూసినా నలుగురైదుగురు పోటీ పడుతున్నరు. ఎవరిని కాదన్నా బాగోదు. అందుకే ఎమ్మెల్యే.. వాళ్ల మధ్యనే పోటీ పెట్టారు. సర్పంచ్‌గా నిలబడాలనుకునేటోళ్లంతా వారివారి గ్రామాల్ని ‘క్లీన్ విలేజ్’గా మార్చుకుని రావాలని సూచించారు. చేసిన పని ఆధారంగా గ్రామ, మండల కమిటీలు నిర్ణయం తీసుకుంటాయని చెప్పేశారు. ఎవరైనా గెలిచినంక చేస్తరు గానీ.. ఇప్పుడే ఎట్లా చేయాలని కొందరు సర్పంచ్ ఆశ చంపుకుంటే.. మరి కొందరు మాత్రం ఇదే చాన్సని పనిలోకి దూకేశారు. కొన్ని గ్రామాల్లో తొలి విడతలోనే ఎన్నికలు జరుగుతుండడంతో ఆగమేఘాల మీద ‘క్లీన్ విలేజ్’ పనులు మొదలెట్టారు. మిగిలున్న రెండు రోజుల్లోనే తేల్చుకోవాలని యుద్ధప్రాతిపదికన పలుగు, పార పట్టి చెమటోడ్చుతున్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఆశావహులు రోడ్లపై గుంతలు పూడ్చడం, పిచ్చిమొక్కలు పీకేయడం, మురుగు కాల్వలు శుభ్రం చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. అసలే ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ముక్కుసూటి మనిషి.. అనుకున్నది కచ్చితంగా చేసే రకం.. అందుకే ఆశావహులు కూడా సీరియస్‌గానే తీసుకున్నరు. ఇదంతా చూస్తున్న పల్లె జనం మాత్రం ఎమ్మెల్యే ఐడియాను తెగ మెచ్చేసుకుంటున్నారు. జనగామ మండలంలోని పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, ఎర్రకుంట తండ, శామీర్‌పేట తదితర గ్రామాలతోపాటు సింహభాగం గ్రామ పంచాయతీల్లో ఆశావహులు శుక్రవారం పారిశుధ్య పనులు మొదలు పెట్టారు. బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల్లోనూ క్లీనింగ్ మొదలైంది. జనగామ మండలం ఎర్రకుంట తండా ఈ సారి కొత్త పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడి నుంచి 11 మంది పోటీ పడుతున్నరు. వీరంతా ఎమ్మెల్యే పిలుపుమేరకు శుక్రవారం తండా అంతా కలియతిరుగుతూ ‘క్లీన్’ చేసేశారు. ఇక సర్పంచ్ ఎవరో తేలాల్సి ఉంది.

కమర్షియల్ ‘ట్యాక్స్’.. 29,476 కోట్లు

నవంబర్ వరకు రూ.33,326 కోట్ల టార్గెట్

హైదరాబాద్, వెలుగు:

వాణిజ్య పన్నుల విభాగం ఆదాయం క్రమంగా పెరుగుతోంది. రూ.29,476.21 కోట్ల ఆదాయం వచ్చింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువవుతోంది. పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేసి వ్యాపారులందరినీ పన్ను పరిధిలోకి తీసుకొస్తోంది. వాహనాల ఆకస్మిక తనిఖీల వంటి చర్యలతో పన్ను ఆదాయం పెరుగుతోంది. పన్నుల విధానాన్ని కంప్యూటరైజ్ చేయడం, రిటర్నులు, రీఫండ్ల విషయంలో సింగిల్ విండో విధానం, దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం వంటి చర్యలూ రాబడికి కారణమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. జీఎస్టీ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యాట్‌లూ రాబడిని పెంచుతున్నాయి. పెట్రోలియం ఉత్పత్తులు, ఎక్సైజ్ శాఖలు జీఎస్టీ పరిధిలో లేకపోవడం వల్ల వాటి నుంచీ ఆదాయం ఎక్కువైందని అంటున్నారు.

జూలైలోనే ఎక్కువొచ్చింది

2017-18 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు రూ.29,476.21 కోట్ల ఆదాయం వచ్చిందని కమర్షియల్ టాక్స్ అధికారులు చెబుతున్నారు. ఆదాయం 20.71 శాతం పెరిగిందంటున్నారు. మొత్తం ఆర్థిక సంవత్సరంలో రూ.52,438.54 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు, నవంబర్ నాటికి రూ.33,326 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ నిర్దేశించుకున్నారు. ఆ లక్ష్యంలో 88.45 శాతం అందుకున్నారు. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎక్కువగా జూలైలో రూ.4006.49 కోట్ల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు. జూన్‌లో రూ.3,952.08 కోట్లు, అక్టోబర్‌లో రూ.3,922.44 కోట్ల పన్నులు వసూలయ్యాయి. మేలో తక్కువగా రూ.3,376.17 కోట్ల ఆదాయం వచ్చింది.

జీఎస్టీతో పారదర్శకత

మేం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్లే పన్ను రాబడి పెరిగింది. ఆన్‌లైన్ విధానంలో పన్ను ఎగవేతలు, బకాయిలను తనిఖీ చేశాం. ఎప్పటికప్పుడు సంస్థలకు నోటీసులు పంపించాం. దీంతో పాత బకాయిలు వసూలయ్యాయి. జీఎస్టీ వచ్చాక వ్యాపార లావాదేవీల్లో పారదర్శకత పెరిగింది.

- అనిల్‌కుమార్, కమిషనర్

≡ క్విక్ బైట్స్

దంతకాంతి, శ్రవణం?

- ఈఎన్‌టీ, డెంటల్ పరీక్షలకు పేర్ల పరిశీలన
- నేటి నుంచి పైలట్ ప్రాజెక్టు
- ఫిబ్రవరిలో రాష్ట్రమంతా అమలు

హైదరాబాద్, వెలుగు: త్వరలో ప్రారంభమయ్యే ఈఎన్‌టీ, దంత పరీక్షల కార్యక్రమాలకు ప్రభుత్వం పలు పేర్లను పరిశీలిస్తోంది. రెండూ వేర్వేరు పరీక్షలు కావడంతో విడివిడిగా పేర్లు పెట్టే ఆలోచనలో అధికారులున్నారు. దంత పరీక్షలకు పంటి వెలుగు, దంతకాంతి పేర్లను సీఎం కేసీఆర్‌కు అధికారులు సూచించినట్లు సమాచారం. 'కంటి వెలుగు' జనాల్లోకి వెళ్లడంతో దానికి దగ్గరగా ఉండేలా ఈ పేరు సూచించినట్లు తెలుస్తోంది. ఈఎన్‌టీ పరీక్షల్లో చెవికి సంబంధించిన పరీక్షలే కీలకం కావడంతో 'శ్రవణం' పేరు పరిశీలిస్తున్న సమాచారం. వీటిపై సీఎం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వీటిని ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. శనివారం నుంచి రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ పరీక్షలు చేయనున్నారు.

పథకాలకు ఆకట్టుకునే పేర్లు..

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, రైతుబంధు, ఆసరా, షీటీమ్స్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కంటివెలుగు.. ఇవన్నీ కేసీఆర్ మదిలో నుంచి పుట్టిన ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పేర్లు. ప్రజల్లోకి త్వరగా చేరేలా, ఒక్కసారి వినగానే గుర్తుండిపోయేలా ఈ పేర్లు ఉండటంతో గుర్తింపు వచ్చినట్లు ప్రభుత్వం భావిస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకే ప్రాధాన్యం

కాంగ్రెస్ నేత చిత్తరంజన్‌దాస్

హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు బీసీలకే కేటాయించాలని పీసీసీ ఓబీసీ సెల్ తీర్మానించింది. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కార్యకర్తల సమావేశంలో సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ మాట్లాడారు. బీసీలను రాజకీయంగా బలహీనపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. సమగ్ర కుటుంబ సర్వే జరిపించిన సీఎం కేసీఆర్‌కు బీసీల లెక్క తెల్వదా అని ప్రశ్నించారు. ఫిబ్రవరిలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ అధ్యక్షతన ఢిల్లీలో బీసీ గర్జన సభ ఉంటుందన్నారు.

8,9 తేదీల్లో సమ్మెకు లెఫ్ట్ మద్దతు

హైదరాబాద్, వెలుగు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 8,9 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు నిర్వహిస్తున్న సమ్మెకు రాష్ట్రంలోని వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ కోసం పలుమార్లు ఆందోళనలు చేసినా.. ప్రభుత్వ పెద్దల్లో మార్పు రాలేదని వామపక్షాల నేతలు చెప్పారు. ప్రధాని మోడీ సర్కారు తీసుకొచ్చిన జీఎస్టీ, నోట్లరద్దు వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతం చేశాయన్నారు. కేంద్రం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదలను మర్చిపోయిందని విమర్శించారు.

కనీస వేతనాలు అమలు చేయండి

- మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ డిమాండ్

హైదరాబాద్, వెలుగు: ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతానాలు అమలు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన యూనియన్ రెండో మహాసభలో నగర యూనియన్ విభాగానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తమకు కనీస వేతనాలు అమలు చేయాలంటూ వేతన సంఘం చేసిన సిఫార్సులు అయిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనిపై పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అన్ని ఆసుపత్రుల్లోనూ నాలుగో తరగతి ఉద్యోగులు రిటైర్డ్ అవుతున్నారని, కాంట్రాక్టు కార్మికులే ఎనభై శాతం విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకపోవడం తమ హక్కులకు భంగం కలిగించడమేనని అన్నారు.

21 రోజుల్లో విలీన గ్రామాలకు ఎన్నికలు

హైకోర్టులో అదనపు ఏజీ

హైదరాబాద్, వెలుగు: పలు జిల్లాల్లోని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు 21కి వాయిదా వేసింది. విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోరాదని అదనపు ఏజీ రాంచందర్‌రావు వాదించారు. హైకోర్టు ఉత్తర్వులిస్తే 21 రోజుల్లోగా విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆయన వాదనలను రికార్డు చేసుకుంది.

కొండా దంపతులకు ఊరట

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ దంపతులకు పోలీసు భద్రతను నాలుగు వారాలపాటు కొనసాగించాలని హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొండా మురళికి 2+3, సురేఖకు 2+2 భద్రతను యథాతథంగా కొనసాగించాలని ఆదేశించిన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచందర్‌రావు విచారణను నాలుగు వారాలు వాయిదా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు భద్రత తగ్గించేందుకు ప్రయత్నిస్తోందని, తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని కొండా దంపతులు హైకోర్టును ఆశ్రయంచారు.

గొర్రెల పంపిణీలో అవినీతి కోట్లలో

గొర్రెల పెంపకందారుల సంఘం ఆరోపణ

హైదరాబాద్, వెలుగు: గొర్రెల పంపిణీ పథకంలో వెటర్నరీ డాక్టర్లు, దళారీలే ఎక్కువగా లాభపడ్డారని తెలంగాణ గొర్రెల పెంపకందారుల సంఘం ఆరోపించింది. గొర్రెల పంపిణీలో ఇబ్బందులపై శుక్రవారం ఆ సంఘం అధ్యక్షుడు రావుల జంగయ్య, ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, ఇతర నేతలు హైదరాబాద్ లో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వెటర్నరీ డాక్టర్లు దళారులతో కుమ్మక్కై అధిక ధరలకు నాసిరకం గొర్రెలను కొనుగోలు చేశారని అన్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లలో 50 శాతం గొర్రెలు ముసలివి, చిన్నవే ఉన్నాయని చెప్పారు. దాణా, మెడికల్ కిట్లలో 50శాతం కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. కోట్ల రూపాయల్లో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సమగ్ర న్యాయ విచారణ జరిపి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెలకు బదులుగా గొల్లకురుమల అకౌంట్లలోకి నేరుగా నగదు బదిలీ చేయాలని కోరారు. చనిపోయిన గొర్రెలన్నింటికీ బీమా పరిహారం చెల్లించాలన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలివ్వండి

అన్ని శాఖలకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, వెలుగు: వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు పంపాలని అన్ని శాఖలకు ఆర్థికశాఖ నుంచి ఉత్తర్వులందాయి. నిర్దేశిత పద్ధతిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. ఆర్థిక శాఖ పోర్టల్ వెబ్ పేజీ శుక్రవారం నుంచి ప్రారంభమైందని, 2018-19లో పథకాల వారీగా బడ్జెట్ అంచనాలు, రివైజ్డ్ ఎస్టిమేట్లు ఇవ్వాలని తెలిపారు.

మోడల్ స్కూళ్లకు వారంలో నోటిఫికేషన్

హైదరాబాద్, వెలుగు: మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లకు వారంలో నోటిఫికేషన్లు ఇచ్చేందుకు పాఠశాల విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి 100 సీట్లతో పాటు మిగిలిన తరగతుల్లో ఖాళీలకూ నోటిఫికేషన్ జారీ చేయనుంది. 194 స్కూళ్లలో 19,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి.



మంచిగ లేకుంటే మూసుడే!

- డిగ్రీ కాలేజీల ఆకస్మిక తనిఖీలకు టీఎస్‌సీహెచ్‌ఈ అధికారుల కసరత్తు
- వసతుల్లేని, సీట్లు నిండని కళాశాలలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, వెలుగు:

ప్రమాణాలు పాటించని ప్రైవేటు డిగ్రీ కాలేజీలపై కొరడా ఝుళిపించేందుకు ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) సిద్ధమైంది. అవసరమైతే మంచిగలేని, నిబంధనలు పాటించని కాలేజీలను మూసేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కాలేజీల్లో ప్రమాణాలు, ఇతర సమస్యలపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు నిర్ణయించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో కాలేజీల సంఖ్యలను తగ్గించాలనుకుంటున్న ఉన్నత విద్యామండలికి ఇది కలిసొస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో 1041 డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో 859 ప్రైవేటువి కాగా, మిగతావి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు. అన్ని కలిపి 4 లక్షల వరకూ సీట్లున్నాయి. నిజానికి డిమాండ్ కన్నా కాలేజీలు, సీట్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వాటి సంఖ్యను తగ్గించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదులు వచ్చిన కాలేజీలు, ఈ విద్యా సంవత్సరం తక్కువ సీట్లు భర్తీ అయిన కాలేజీలపై అధికారులు దృష్టి పెట్టారు. అనుమతి ఒకచోట తీసుకొని, మరోచోట తరగతులు నిర్వహిస్తున్న కాలేజీలపై ఇప్పటికే 30 దాకా ఫిర్యాదులొచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఏ కాలేజీకి ఎక్కడ పర్మిషన్ ఉంది, ఎక్కడ తరగతులు పెడుతున్నారు అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇటు 25 శాతం కన్నా తక్కువ సీట్లు నిండిన కాలేజీల్లో మౌలిక వసతులను పరిశీలించి అవసరమైతే వాటిని మూసేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కాలేజీల ఆకస్మిక తనిఖీలకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రత్యేక బృందాల ఏర్పాటుకు కసరత్తులు చేస్తున్నారు.

రూ.3వేల కోట్ల నష్టాలు సర్కారే భరించాలి

ఎక్స్ పర్ట్ కమిటీకి కార్మిక సంఘాల సూచన

హైదరాబాద్, వెలుగు: ప్రస్తుత రూ. 3 వేల కోట్ల నష్టాలను సర్కారు భరించి డీజిల్ భారం తగ్గిస్తే ఆర్టీసీ నష్టాలు నివారించొచ్చని ఎక్స్‌పర్ట్ కమిటీకి కార్మిక సంఘాల నేతలు సూచించారు. ఆర్టీసీ షెడ్యూల్ విధానాన్ని వికేంద్రీకరించాలని కోరారు. బస్సులను ఆదాయం కోసం నడపాలని, కిలోమీటర్ల కోసం కాదన్నారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు ఏర్పాటు చేసిన 12 మంది సభ్యుల కమిటీతో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు సమావేశమయ్యారు. ఆర్టీసీకి ఏటా బడ్జెట్‌లో 1 % ప్రొవిజన్ కేటాయించి రాయితీలను ఏ నెలకానెల చెల్లిస్తే నష్టాన్ని నివారించవచ్చని ఈయూ నేతలు సూచించారు. పల్లె వెలుగు బస్సుల నష్టాలను సర్కారే భరించాలని, ఏటా 5% చార్జీలు పెంచుకునేలా అనుమతించాలన్నారు. పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించి జీఎస్టీలోకి తీసుకురావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం నేతలు కోరారు. ఆర్టీసీలోని జోనల్, డివిజన్ వ్యవస్థ రద్దు చేయాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్ల ఉద్యోగ భద్రతకు ఆటంకంగా ఉన్న రెగ్యులేషన్స్ మార్చాలని సూచించారు.

యూపీఏ హయాంలోనే ఎయిమ్స్

- త్వరగా వైద్యసేవలు ప్రారంభించాలి: కాంగ్రెస్

హైదరాబాద్, వెలుగు: యూపీఏ హయాంలోనే ఎయిమ్స్ మంజూరైందని, అది కాంగ్రెస్ చలవేనని పీసీసీ ట్రెజరర్ గూడూరు నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో ఏర్పాటైన బీబీనగర్ నిమ్స్ (ఎయిమ్స్)లో ఐదేళ్ల తర్వాత కూడా ప్రభుత్వం పూర్తి స్థాయి వైద్య సేవలు ప్రారంభించలేదని శుక్రవారం విమర్శించారు. రాష్ట్ర సమస్యలు పట్టించుకోని సీఎం కేసీఆర్ దేశాన్ని ఉద్ధరిస్తానంటూ బయలుదేరడం హాస్యాస్పదమన్నారు. ఎయిమ్స్‌లో వైద్య సేవలు ప్రారంభించే అంశాన్ని లోక్‌సభలో ఎంపీ బూర ప్రస్తావించలేదన్నారు.


18 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు

హైదరాబాద్, వెలుగు: పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజు చెల్లించేందుకు బోర్డు మరోసారి అవకాశమిచ్చింది. తత్కాల్ స్కీమ్ కింద రూ. వెయ్యి లేట్ ఫీజుతో ఈనెల 18వరకు చెల్లించవచ్చని రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఇప్పటికే ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులకూ అవకాశమిస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న స్కూళ్లోనే ఫీజు చెల్లించవచ్చని చెప్పారు.

'చీపురు'లో పుల్లలు జారుకుంటున్నయ్



మూస రాజకీయాలకు భిన్నంగా తెర పైకి వచ్చిన రాజకీయ సంస్థ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్). అవినీతికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమంలో నుంచి పుట్టుకొచ్చింది. 'రాజకీయాలకు కొత్త అర్థం చెప్పడానికే పార్టీని పెట్టాన'ని అప్పట్లో అరవింద్ కేజ్రీవాల్ చెప్పినవి ఇప్పటికీ చాలామందికి గుర్తున్నాయి. గట్టిగా ఏడేళ్లు గడవకుండానే ఆప్ నుంచి సీనియర్ లీడర్లు ఒక్కొక్కరుగా గుడ్ బై చెబుతున్నారు? అన్ని పార్టీల్లోలాగే ఆప్‌లోనూ వ్యక్తి పూజ పెరిగిపోతోందా? కేజ్రీవాల్ వ్యవహార శైలి మితిమీరిందా? సీనియర్ నేత హర్వీందర్ సింగ్ పూల్కా రాజీనామాతో ఈ ప్రశ్నలు మరోసారి తెరపైకి వచ్చాయి.



సీనియర్ లాయర్ హెచ్.ఎస్.పూల్కా రాజీనామా చేయడంతో ఆమ్ ఆద్మీ పార్టీ లోగుట్టు బయట పడింది. పార్టీలో నాయకులు కంఫర్ట్ గా లేరన్న అనుమానాలకు బలం చేకూర్చినట్లయింది. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పైనే ఉంది. ఆప్ నుంచి వ్యవస్థాపక నాయకులు బయటకు వెళ్లడం ఇదేమీ ఫస్ట్ టైమ్ కాదు. ఈ ఏడేళ్లలో చాలా మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. కొంతమంది బయటకు వెళ్లి, కేజ్రీవాల్ పనితీరును ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యవహార శైలిని టార్గెట్ చేశారు. మరికొంతమంది బయటపడలేదు. ఎందుకు లే చెప్పడం అనుకున్నారో ఏమో కానీ మనసులోనే దాచుకున్నారు.


హర్వీందర్ సింగ్ పూల్కా

పంజాబ్ కు చెందిన హర్వీందర్ సింగ్ పూల్కా వృత్తిరీత్యా న్యాయవాది. ఢిల్లీ హై కోర్టులో సీనియర్ లాయర్. ఢిల్లీలో చాలా పేరున్న సామాజిక కార్యకర్త. ఢిల్లీలో సామాజిక సంస్థల గొడుగులా భావించే 'సిటిజన్స్ జస్టిస్ కమిటీ' (సీజేసీ) ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. సిక్కులపై దాడులు జరగడానికి కొంతకాలం ముందే పూల్కా ఢిల్లీ హైకోర్టులో ప్రాక్టీస్ చేయడానికి వచ్చారు. ఆనాటి అల్లర్లను ప్రత్యక్షంగా చూశారు. దోషులకు శిక్షలు పడేంతవరకు పోరాటం చేయాల్సిందేనని అప్పట్లోనే డిసైడ్ అయ్యారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లతో సంబంధం ఉన్న వారిపై న్యాయస్థానంలో అలుపెరుగని పోరాటం చేశారు. సజ్జన్ కుమార్‌కి శిక్ష పడేంతవరకు నిద్రపోలేదు.

సామాజిక సమస్యలపై పోరాటంతో బిజీగా ఉన్న పూల్కా... కొత్త రాజకీయాలకు అర్థం చెబుతానన్న కేజ్రీవాల్ మాటలకు ఫిదా అయ్యారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటే మరింత ప్రజా సేవ చేయవచ్చన్న ఉద్దేశంతో 2014లో ఆప్‌లో చేరారు. అదే ఏడాది లూధియానా (పంజాబ్) నియోజకవర్గం నుంచి లోక్‌సభకి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో దాఖా నుంచి పోటీ చేసి గెలిచారు. కొంతకాలం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. సిక్కులకు సంబంధించిన కొన్ని అంశాల్లో ఆమ్ ఆద్మీ అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా కిందటేడాది ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అప్పట్నుంచి పార్టీలోనే కొనసాగి, చివరకు ఆప్ నుంచి వైదొలిగారు.

పుట్టిన రెండేళ్లకే రాజీనామాలు

పుట్టిన రెండేళ్లకే ఆప్‌లో లుకలుకలు మొదలయ్యాయి. పార్టీలో మొదట్నుంచి ఉన్న మహిళా నేత షాజియా ఇల్మీ రాజీనామా చేశారు. ఆమెతో పాటు కెప్టెన్ గోపీనాథ్ కూడా పార్టీకి గుడ్ బై కొట్టారు. ఆప్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని షాజియా తన రాజీనామాకు కారణం చెప్పారు. అలాగే, కిందటేడాది మరో ఇద్దరు వ్యవస్థాపక సభ్యులు అశుతోష్, ఆశీష్ ఖేతాన్ వెళ్లిపోయారు. అశుతోష్‌ని బుజ్జగించడానికి కేజ్రీవాల్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వీళ్లిద్దరి రాజీనామాలతో ఆప్‌లో పరిస్థితి అంత బాలేదన్న ఊహాగానాలకు రెక్కలు వచ్చాయి.

అశుతోష్, ఆశీష్ ఖేతాన్ ఇద్దరూ వ్యక్తిగత కారణాలతోనే పార్టీ నుంచి బయటకు వెళ్లినట్లు చెప్పారే కానీ బహిరంగంగా కేజ్రీవాల్ ను విమర్శించలేదు. అయితే, కేజ్రీవాల్ వ్యవహార శైలి నచ్చకనే వీళ్లిద్దరూ బయటకు వెళ్లారన్న గుసగుసలు వినిపించాయి. రాజ్యసభకి ఎవరిని పంపించాలన్న విషయంలో కేజ్రీవాల్, అశుతోష్ మధ్య తేడాలు వచ్చినట్లు లోపలి సమాచారం. తాము సూచించిన వ్యక్తులను కాదని, కార్పొరేట్ శక్తులకు రాజ్యసభ టికెట్లు అమ్ముకున్నారని అశుతోష్ తన సన్నిహితుల దగ్గర అప్పట్లో బాధపడ్డట్లు పొలిటికల్ సర్కిల్స్ టాక్. ఈ నేపథ్యంలో ఆప్‌పై భ్రమలు తొలగిపోయి, పార్టీ నుంచి వెళ్లిపోయారన్న కథనాలు కూడా హల్‌చల్ చేశాయి.

ఆప్ ఒన్ మాన్ ఆర్మీనా?


ఇవన్నిటినీ లోతుగా గమనిస్తే 'ఆప్ ఒన్ మాన్ ఆర్మీనా!' అనే అనుమానాలు వస్తున్నాయి. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ముందు కేజ్రీవాల్ ఎవరితోనూ సంప్రదించరన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మనీశ్ సిసోడియా లాంటి ఒకరిద్దరు ఆత్మీయులతోనే ఆయన మనస్సు విప్పుతారని చాలా మంది చెబుతారు. జాతీయ రాజకీయాలకు సంబంధించి బీజేపీ, కాంగ్రెస్‌తో సమాన దూరంలో ఉండాలా? లేక, ఏదో ఒక పార్టీతో జత కట్టాలా అనే కీలక అంశంపై కూడా సీనియర్లతో మాటామంతీ ఉండదన్న విమర్శలు ఉన్నాయి. సస్పెన్షన్లు, బహిష్కరణల వంటి కీలక నిర్ణయాలు తీసుకునేముందు కేజ్రీవాల్ ఎవరినీ సంప్రదించరన్న ప్రచారం ఉంది. అవినీతికి వ్యతిరేకంగా దేశమంతా ఉద్యమం రగిల్చిన అన్నా హజారేతో కలిపి నడిచిన కేజ్రీవాల్ కూడా మూస నాయకుడేనన్న విమర్శలు ఉన్నాయి. రాజకీయ పార్టీల నుంచి పాత నాయకులు వెళ్లిపోవడం కొత్త కాదు. అయితే ఆప్‌లో ఇది చాలా ఎక్కువగా ఉంది. పార్టీ సిద్ధాంతాలకు, కేజ్రీవాల్ లెక్చర్లకు ఆకర్షితులై చేరిన యువతరం నాయకులు ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు. ఆ పార్టీ గుర్తులోని చీపురు పుల్లల్లా జారుకుంటున్నారు. యోగేంద్ర యాదవ్ లాంటి వారిని ఏకంగా బహిష్కరించారు. మొత్తం మీద 'ఆప్'ని కేజ్రీవాల్ తన సొంత జాగీరులా చూస్తున్నారన్న ఆరోపణలైతే గట్టిగా వినిపిస్తున్నాయి. కీలకమైన జనరల్ ఎలక్షన్ మరో నాలుగైదు నెలల్లో ఉండగా, పూల్కా రాజీనామా చేయడం పార్టీ కేడర్‌లో కలవరం పుట్టించింది. డిఫరెంట్ ఐడియాలజీతో, యాంటీ-కరప్షన్ ఉద్యమంతో జనంలోకి చొచ్చుకెళ్లిన 'ఆప్'ని కేజ్రీవాల్ తన జాగీరులా మార్చేశారన్న ఆరోపణ బలంగా ఉంది.

– ఎస్. అబ్దుల్ ఖాలిక్

పంజాబ్‌లో రెండుగా చీలిన ఆప్

కేజ్రీవాల్ వ్యవహార శైలి ప్రభావం పంజాబ్ శాఖపై పడింది. అసెంబ్లీలో లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఉన్న సుఖ్ పాల్ సింగ్ ఖైరాని ఆ పదవి నుంచి ఉన్నట్టుండి కేజ్రీవాల్ తొలగించారు. ఖైరా నుంచి సంజాయిషీ అడగలేదు. ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చిన్నపాటి వివరణ కూడా ఇవ్వలేదు. ఇంకేముంది, వివాదం రాజుకుంది. కేజ్రీవాల్ వైఖరిని ఖైరా ఎండగట్టారు. హై కమాండ్‌పై పోరాటానికి సై అన్నారు. తన విధేయులైన ఎమ్మెల్యేలతో వేరు కుంపటి పెట్టుకున్నారు. దీంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఆప్ నుంచి సస్పెండ్ చేసి కేజ్రీ చేతులు దులుపుకున్నారు.


సుఖ్ పాల్ సింగ్ ఖైరా



గ్రామాలలో ప్రజాస్వామ్యం వికసించి, స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి పురోగమిస్తుందన్నారు మహాత్మ గాంధీ. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలలో స్వయం పాలన ఏర్పరచడంకోసం పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడమైంది. గ్రామాభివృద్ధి కొనసాగినప్పుడే దేశం మొత్తం అభివృద్ధి దిశగా పయనిస్తుంది . ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ సమయం ఆసన్నమైనది . ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ఎలక్షన్ కమిషన్ రిజర్వేషన్‌లను ఖరారు చేసి ఎన్నికలకు సిద్ధమైంది .జనవరి 21, 25, 29న మూడు విడతలుగా ఒక నెలలోపే సర్పంచులను నియమించబోతుంది. కానీ, ఎన్నుకోబడే వ్యక్తులు ఎలా ఉండాలి ? ఎవరిని ఎన్నుకోవాలి? అనే సంగతి ఓటర్ల పైననే వున్నది.

సర్పంచులుగా సర్రైనోళ్లే కావాలి

గ్రామ ప్రథమ పౌరుడు (సర్పంచ్)గా ఎన్నికైనవారికి తమ విధులు ఏమిటో బాగా తెలిసి ఉండాలి, దేశంలో గ్రామాభివృద్ధి కి కృషి చేసిన సర్పంచ్‌ల గురించి తెలుసుకొని, తమ గ్రామాన్ని అభివృద్ధి బాటలో పెట్టాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒక ఎత్తయితే, గ్రామస్థాయిలో జరిగే ఎన్నికలు మరొక ఎత్తు. ఎందుకంటే రాష్ట్ర, కేంద్ర నాయకులు ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు ఎంత ఘాటుగా చేసుకున్నా వ్యక్తిగతంగా స్నేహభావంతో మెలుగుతారు. అదే విషయాన్ని గ్రామస్థాయిలో చూసినట్లయితే ఒకరిపై ఒకరు పగ, ప్రతీకారం పెంచుకుంటారు. కొన్నికొన్నిసార్లు తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. తమ పార్టీని గానీ, పార్టీ నాయకుడినిగానీ ఏమైనా అంటే సహించరు. తమ కుటుంబ సభ్యులకంటే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు.

అంతేకాకుండా, అడ్మినిస్ట్రేషన్ పరంగా చూస్తే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కంటే పంచాయితీ ఎలక్షన్ నిర్వహణ కష్టం . ఇన్ని కష్టాల మధ్య అంతా సిద్ధమైంది . రిజర్వేషన్‌లలో తేడాలొచ్చాయని కొంతమంది కోర్టు మెట్లు ఎక్కారు కానీ, కోర్టు సైతం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాంటప్పుడు గ్రామీణులు జాగ్రత్తగా గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాలి. ఇప్పుడు జరిగే పంచాయితీ ఎన్నికలలో యువతే కీలకం కానున్నారు.

గతంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసి, చరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను చూస్తే...

- రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనవారు గ్రామ వీధులన్నీ సిమెంట్ రోడ్లు వేయించారు. ప్రతి వీధికి క్లోజ్‌డ్ డ్రైనేజీని, ప్రతి ఇంటికి మరుగు దొడ్డిని ఏర్పాటు చేయించారు. స్కూలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయితీ భవనం, గ్రంథాలయం నిర్మించారు. 2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'నిర్మల గ్రామ పురస్కారం' అందుకున్నారు .రాష్ట్ర ప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందారు.
- వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామచంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి.
- గంగాదేవిపల్లిలో గ్రామసభద్వారా రక్షిత మంచినీటి కమిటీ, పారిశుద్ధ్య కమిటీ, ఆరోగ్య కమిటీ, సమాచార కమిటీలు మొదలైన వివిధ రకాలైన 18 కమిటీలను ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య వచ్చినా తగిన కమిటీతో సంప్రదించి సులభంగా పరిష్కరించుకునేలా చేశారు.
- బాల బాలికలను స్కూళ్లలో చేర్పించేలా ప్రోత్సహించి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించగలిగారు.
- జనాభా నియంత్రణలో భాగంగా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లను చేయించారు.
- గ్రామంలోని ప్రతి పసిపిల్లలకు పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందించారు.
- గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా తెరిపించి పొదుపు చర్యలు ప్రోత్సహించారు.
- గ్రామంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాముఖ్యతనిచ్చి, అంటురోగాలు వ్యాపించకుండా జాగ్రత్త పడ్డారు.
- గ్రామంలో అందరి అంగీకారంతో మద్యపానాన్ని నిషేధించారు.

అంతకంటే ముందు, గ్రామాలలో జరిగే ఈ పంచాయితీ ఎన్నికలలో స్నేహపూరిత పోటీని కలిగి వుండాలి. వ్యక్తిగత ఛాలెంజ్‌లకు పోయి, వృధాగా ఖర్చులుపెట్టి, ఓటర్లకు మందు బిరియానీ వంటివి ఇచ్చి, ప్రలోభాలకు గురి చేయకూడదు. గ్రామంలోని ప్రజలంతా కలిసి కట్టుగా వీలైతే ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి. గ్రామ క్షేమం , సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను సర్పంచ్‌లుగా ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. ఒక మంచి వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకున్నట్లయితే గ్రామాభివృద్ధి జరుగుతుంది. పల్లెల ప్రగతి దేశాభివృద్ధికి సూచిక.



– డా .పోలం సైదులు

ఏమన్నారంటే



తెలుసుకో ట్రంప్

అఫ్గనిస్తాన్‌లో రోడ్లు, డ్యాములు వంటి మౌలిక సదుపాయాలకోసం ఇండియా దాదాపు 3 బిలియన్ డాలర్లు సాయం చేసింది. ఈ విషయాలన్నీ ట్రంప్ గుర్తు చేసుకోవాలి.

-అహ్మద్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నేత



లోపాలు చెప్పదా!

ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్ గురించి కాంగ్రెస్ అన్నీ గొప్పలే చెబుతోంది. కానీ, ఆ సంస్థలో లోపాలను చెప్పడం లేదు. అన్నీ ఆలోచించే రెండు ప్లాటూన్లను కొంటున్నాం.

– నిర్మల సీతారామన్, రక్షణ మంత్రి



ఆవులకోసం భరిస్తాం

గో సేవ కోసం యూపీ సర్కారు స్పెషల్ సెస్ వేయడం మంచిదే. ఈ ఫండ్స్‌ని సరిగ్గా ఉపయోగించాలి. గోమాతలకోసం మరో ట్యాక్స్ వేసినా భరిస్తాం.

– అపర్ణ యాదవ్, ఎస్‌పీ నాయకురాలు

మంది తినేడిది తక్వ పారబోసేది ఎక్వ



ప్రతి గింజ మీద తినేటోళ్ల పేరుంటది అంటరు. కానీ, ఎక్వ గింజల మీద కుక్కలు, పందులు పేర్లు ఉండేతట్టున్నాయి. అవును మరి. వండిన సగం తిండిని పారేస్తున్నాం. ప్రపంచం మొత్తంల పారేసే తిండి విలువ 74 లక్షల కోట్లు. మొత్తంగా ఉత్పత్తి అయ్యే ఆహారంలో ఇది మూడో వంతు. ఇటీవలే ఓ అంతర్జాతీయ నివేదికలో వెల్లడైన లెక్కలు ఇవి. ఇందులో మన దేశానికేమీ మినహాయింపు లేదు. ఇంటిలో ప్లేట్ నిండ అన్నం పెట్టుకొని సగం తిని... సగం విడిచిపెడితిమి. రాత్రి మిగిలిన సలిబువ్వ నోట్లోకి పోదాయే. మల్ల ఉడుకుడుకుది వండిపెడితేగానీ తినం. కూర బాగలేకున్నా... అన్నమే ఇడిశిపెడతాం. ఇగ హోటల్ల ఫుల్ మీల్స్‌కి ఆర్డర్ చేసి... సగం తినకుండానే చేయి కడిగితిమి. ఇగ పెండ్లిలు, ధావతులల్ల కుప్పలకు కుప్పల అన్నం పారబోస్తారు. ఎంత ఎక్కువ వండితే అంత గొప్పగా లగ్గం చేసినాం అని మురిసేవాళ్లుంటారు. ఇసొంటి కార్యాలల్ల వేస్ట్ చేసే తిండి విలువ లెక్క పెడితే... ఎన్నో కోట్లు ఉంటుంది. ఓ దిక్కు కోట్ల మందికి మింగ మెతుకు లేక రోజూ ఒక్కపొద్దులు ఉండేటోళ్లు ఉన్నారు. రోడ్ల మీది అడుక్కొని తింటారు. ఆకలి రాజ్యం సినిమా వచ్చి 37 ఏండ్లు. సినిమా పాతదైనా... కమల్ హాసన్ లాంటోళ్ల ఆకలైతే తీరలేదు. కోట్ల మందికి మూడు పూటల అన్నం దొరకడం లేదు. రెండు పూటలు తినేవాళ్లు కొందరు ఉంటే...ఒక్క పూట దొరికితే చాలు అనుకునేవాళ్లు ఇంకెందరో ఉన్నారు. ఇంటిలో సరిపోను సామాగ్రి ఉన్నా... వండుకునే ఓపిక లేక ఆన్ లైన్ ఆర్డర్ ఇచ్చి ఇంటికి తెప్పించుకుంటున్న ఈ రోజుల్లో కూడా ఆకలి చావులు మరింత విషాదం.

సోమాలియా, ఇథియోపియా, ఉగాండా లాంటి దేశాల్లో ఆకలితో బక్క చిక్కి బొక్కలు తేలిన మనుషులను చూస్తున్నాం. ఎవలి ముందు టీవీల మైక్ పెట్టినా ముందు ఆకలి తీర్చండి ఆ తరువాత ఎంత ఆకలి ఉన్నదో చెబుతాం అనే పరిస్థితి. ఆకలి, పోషకాహార లోపం వల్ల నిమిషానికో బాలుడో, బాలికో మరణిస్తున్నారంటే ఆహార కొరత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా పంటల సాగు తగ్గుతోంది. పండించేవాళ్ల సంఖ్య కూడా తగ్గుతోంది. కానీ, తినేవాళ్ల సంఖ్య దినదినం పెరుగుతూనే ఉంది. పండిన ధాన్యం దాచడానికి సరిపోను గోదాంలు ఉండవు. ఉన్న వాటిలో దాస్తే సగం పంది కొక్కుల పాలే. ముక్కిబోతే తీసుకుపోయి సముద్రానికి సమర్పిస్తాం. పంటకు గిట్టుబాటు ధరలేక రైతు బాధపడుతుంటే... ఆ పంటను నిల్వ చేసుకుని సీజన్‌లో అమ్ముకుందామంటే... ఆ అవకాశం ఉండదు. కానీ, మనకు ఇవేమీ పట్టవు. అవసరం లేని విషయాలు లెక్కనే అనిపిస్తుంది. మనం కరాబ్ చేస్తున్నది తిండి ఒక్కటేగాదు... పండిచ్చే భూమిని, పారే నీళ్లను, తయారయ్యే మందులను, రైతుల చెమటను కూడా.

– రఘు భువనగిరి

టీచింగ్ ఫ్యాకల్టీతోనే ఫలితం

మన దేశంలోని యూనివర్సిటీల అకడమిక్ పెర్ఫార్మెన్స్, వరల్డ్ ర్యాంకింగ్స్ మెరుగుపడాలంటే టీచింగ్‌తోపాటు రీసెర్చ్ ట్యాలెంట్ ఉన్న ఎక్కువ మందిని ఫ్యాకల్టీగా నియమించుకోవాలి. పరిశోధనకు అవకాశం ఉన్న సబ్జెక్టుల్లోనే రీసెర్చ్ స్కాలర్స్‌తో పాఠాలు చెప్పించాలి. మిగిలిన కోర్సులను టీచింగ్ ఓరియెంటెడ్ ప్రొఫెసర్లకే వదిలేయాలి. ఈ దిశగా ఇప్పటికే అడుగులు వేసిన ఢిల్లీ ఐఐటీ బాటలో అన్ని ఉన్నత విద్య, పరిశోధన సంస్థలు నడవాలి.



వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్‌ల్లో ఇండియా పెర్ఫార్మెన్స్ రానురాను తేలిపోతోంది. మన దేశంలోని వర్సిటీలు ప్రపంచంలోని బెస్ట్ ఇన్‌స్టిట్యూషన్లతో పోల్చితే రీసెర్చ్‌లో, పరిశోధనా ఫలితాల్ని పబ్లిష్ చేయడంలో చాలా వెనకబడటమే దీనికి కారణం. ఈ లోపాన్ని సరిదిద్దటానికి కేంద్రం 2010లోనే చర్యలు తీసుకుంది. వర్సిటీలను, ఫ్యాకల్టీని రీసెర్చ్ దిశగా ఎంకరేజ్ చేయటానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అకడమిక్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (ఏపీఐ)లను ప్రవేశ పెట్టింది. 'హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్లలోని ప్రొఫెసర్లు తమ రీసెర్చ్ పేపర్లను పేరున్న జర్నల్స్‌లో పబ్లిష్ చేయటానికి ఇవి అవసరం. బోధన, పాలన బాధ్యతలతోపాటు ఏపీఐలనూ సాధించాలి. ప్రమోషన్లకు, ఇతర బెనిఫిట్లకు క్వాలిఫికేషన్‌గా వీటిని లెక్కలోకి తీసుకుంటాం' అని యూజీసీ తెలిపింది. ఈ చర్యను చాలా వర్సిటీలు వ్యతిరేకించాయి. రీసెర్చ్‌ను ప్రోత్సహించేలా లేదని అబ్జెక్షన్ చెప్పాయి. ప్రొఫెసర్లతో రీసెర్చ్ చేయించాలనే టార్గెట్‌తో ఏపీఐలను తెరపైకి తెచ్చిన యూజీసీ... చివరికి ఏం చేయాలా అని పరిశీలించుకోవాల్సి వచ్చింది. పీజీ కాలేజీల లెక్చరర్లు, ప్రొఫెసర్లతోపాటు తమ సంస్థల్లో రీసెర్చ్ సౌకర్యాల్లేక, పరిశోధనా పత్రాలను పబ్లిష్ చేయించుకోవటానికి వేరే దారి లేకపోవడంతో ఫేక్ జర్నల్స్‌కి పంపుతున్నారు. మొత్తం బయోమెడికల్ సైన్సెస్ రీసెర్చ్ పేపర్లలో 27 శాతం పేపర్లు ఇండియన్ యూనివర్సిటీల నుంచే వస్తున్నాయని ఓ స్టడీలో తేలింది. ఈ నేపథ్యంలోనే యూజీసీ ఏపీఐల ఆలోచన చేసింది. వర్సిటీల నుంచి వ్యతిరేకత రావటంతో వాటిలో కొన్ని మార్పులు చేసింది. మరో వైపు... చట్టబద్ధమైన జర్నల్స్‌ని గుర్తించటానికికూడా ప్రయత్నిస్తోంది. ఏదేమైనప్పటికీ ఏపీఐలు దేశంలోని చాలా విద్యా సంస్థల్లో డౌన్‌గ్రేడ్‌లో ఉన్న టీచింగ్‌ని అప్‌గ్రేడ్‌లోకి తెచ్చాయి. కానీ, వాటి వల్ల టీచింగ్‌కి ప్రాధాన్యత తగ్గింది. టీచింగ్ ఎంత బాగా ఉన్నా ప్రమోషన్‌కి మాత్రం పబ్లికేషన్లనే పట్టించుకుంటూ ఉండటంతో టీచింగ్‌పై ఆసక్తి తగ్గింది. ఈ పరిస్థితుల్లో దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది స్టూడెంట్ల భవిష్యత్ కోసం పీజీ కాలేజీలు, యూనివర్సిటీలు ట్యాలెంట్ ఉన్న ప్రొఫెసర్లను, లెక్చరర్లను ఎక్కువగా నియమించుకోవాల్సిన అవసరం ఉంది. అండర్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూషన్లలోని లెక్చరర్లకు, ప్రొఫెసర్లకు రీసెర్చ్‌ని ఒక ఆప్షనల్‌గా పెట్టాలి. థీసిస్‌ల చోరీలు, ఫేక్ జర్నల్స్‌లో పబ్లిషింగ్ వంటి రీసెర్చ్ సంబంధ మోసాలన్నింటికీ ముకుతాడు వేయాలి. వర్సిటీలు టీచింగ్‌తోపాటు రీసెర్చ్‌నీ ఎంకరేజ్ చేయాలి. వరల్డ్ ర్యాంకింగ్‌లకు ప్రాధాన్యత పెరుగుతుండటంతో మన యూనివర్సిటీలు కూడా తమ ఫ్యాకల్టీ మెంబర్ల నుంచి మరింత రీసెర్చ్‌ని డిమాండ్ చేస్తున్నాయి. ఎక్కువ మంది పరిశోధకులను ముఖ్యంగా పేరున్న జర్నల్స్‌లో పేపర్లు పబ్లిష్ అయినవాళ్లను, 'హెల్దీ పబ్లిషింగ్ రికార్డ్' ఉన్నవాళ్లను రిక్రూట్ చేసుకోవటానికి ఆసక్తి చూపుతున్నాయి. ఫలితంగా టీచింగ్ ఓరియెంటెడ్ ప్రొఫెసర్లు అసంతృప్తికి గురవుతున్నారు. రీసెర్చ్ ఓరియెంటెడ్ ఫ్యాకల్టీయేమో టీచింగ్‌ని పరిశోధనకు ఆటంకంగా భావిస్తోంది. ఇది నిజమే. దీంతో యూనివర్సిటీలు ఫ్యాకల్టీ కోసం పెద్దఎత్తున తీసుకున్న రీసెర్చ్ స్కాలర్లు తమ స్టూడెంట్లను అశ్రద్ధ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. అందువల్ల బోధన, పరిశోధన రెండూ చేసే దేశంలోని మిగతా ఉన్నత విద్యా సంస్థలన్నీ ఈ బాటలోనే నడిస్తే బెటర్.

– పుష్కర్,
డైరెక్టర్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ సెంటర్ గోవా

రీసెర్చ్‌కి ఫస్ట్ ప్రిఫరెన్స్

ఉన్నత విద్య, పరిశోధన సంస్థల్లో మంచి బోధనా వాతావరణం, ఉత్తమ మౌలిక సదుపాయాలు ఉన్నంత మాత్రాన సరిపోదు. రీసెర్చ్‌కి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే మన యూనివర్సిటీలు, రీసెర్చ్ సెంటర్లు వరల్డ్ ర్యాంకింగ్స్‌లో వండర్లు సృష్టిస్తాయి. నేనేదో అల్లాటప్పాగా చెప్పట్లేదు. ర్యాంకింగ్స్‌ని పబ్లిష్ చేసే ఒక ఆర్గనైజేషన్‌కి అధిపతిగా, అనుభవంతో నేను ఈ సూచన చేస్తున్నాను.

– అశ్విన్ ఫెర్నాండెజ్, ర్యాంకింగ్స్ పబ్లిషర్

ఢిల్లీ ఐఐటీ బెస్ట్

యూనివర్సిటీలు ఫ్యాకల్టీని తీసుకునేటప్పుడు రీసెర్చ్‌కి, టీచింగ్‌కి ఛాన్స్ ఉన్న కోర్సుల మధ్య బ్యాలెన్స్ చేసుకోవాలి. రీసెర్చ్, టీచింగ్ అవసరాలకు అనుగుణంగా ఫ్యాకల్టీని మేనేజ్ చేయాలి. అప్పుడే స్టూడెంట్ల భవిష్యత్‌కి ఢోకా ఉండదు. ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విధానాన్నే అనుసరిస్తోంది.





విజయ్ దేవరకొండకి పెద్ద ఫ్యాన్‌ని. అతని యాక్టింగ్ చాలా ఇష్టం. అయితే 'అర్జున్‌రెడ్డి' రీమేక్‌లో నటించడానికి ప్రధాన కారణం దర్శకుడు సందీప్ రెడ్డి. రీమేక్‌కి అతను మాత్రమే న్యాయం చేయగలడు. ఎందుకంటే అది అతని బేబీ. రీమేక్ అన్నాక కంపారిజన్స్ కామన్. ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారా అని ఎక్సైటింగ్‌గా ఉంది.

తెరపై ఎంతసేపు కనిపించామని కాదు. కథలో ఆ పాత్ర ప్రాధాన్యత ఏంటి, దానికి నేను ఎంతవరకూ న్యాయం చేయగలను, ప్రేక్షకులను ఎంతలా మెప్పించగలను అనేది ముఖ్యం. నేనెప్పుడూ దర్శకుడిని నమ్ముతాను. నటన విషయంలో పూర్తిగా అతనికి సరెండరవుతాను. ఎందుకంటే స్టోరీ, విజన్ వారిదే.

నాకదే బెస్ట్ కాంప్లిమెంట్

అతి తక్కువ సమయంలో తెలుగులో అగ్ర కథానాయిక స్థాయి గుర్తింపును అందుకుంది కియరా అద్వాని. సంక్రాంతికి 'వినయ విధేయ రామ'తో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆమెతో చిట్ చాట్.

- ఇందులో సీత అనే పాత్రను పోషించాను. కుటుంబంతో కలసి ఉన్నప్పుడు రాముడికి తగ్గ సీతలా ఉంటూ, వారెవరూ లేనప్పుడు హీరోపై పెత్తనం చెలాయిస్తూ టీజ్ చేస్తుంటాను. ఇద్దరి మధ్య ఇంటరెస్టింగ్ కెమిస్ట్రీ ఉంటుంది.
- బోయపాటి గారు బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌తో సహా కథ చెప్పినప్పుడే థియేటర్‌లో సినిమా చూసినట్టుంది. కథ నచ్చడంతో పాటు అందులో నా పాత్ర ఆసక్తిగా అనిపించింది.
- నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. స్కూల్, కాలేజీ రోజుల్లో శిక్షణ తీసుకున్నాను. మంచి డ్యాన్సర్ అయిన చరణ్ నన్ను బెస్ట్ డ్యాన్స్ పార్టనర్ అనడం నాకు పెద్ద కాంప్లిమెంట్. ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీలో చేసిన రామ లవ్ సీత పాట నాకెంతో ఇష్టం. నా కెరీర్‌లోనే బెస్ట్ సాంగ్ అది. భారీగా చిత్రీకరించారు.
- రామ్‌చరణ్ రహస్యంగా ఇన్‌స్టగ్రామ్ చూస్తుంటాడు. అతనికో సీక్రెట్ అకౌంట్ కూడా ఉంది. నేను, ఉపాసన ఆ విషయమే మాట్లాడుకుంటాం. అతనికే కాదు, చాలామందికి సీక్రెట్ అకౌంట్స్ ఉంటాయి.
- 'ఎం.ఎస్.ధోని' సినిమా నన్ను ప్రేక్షకులకు దగ్గర చేసింది. నన్ను అందులో చూసే నమ్రత, శివ కొరటాల మహేశ్ సినిమాకి ఎంపిక చేశారు. నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది 'భరత్ అనే నేను'.
- నేను ప్యాన్ ఇండియా నటిని. తెలుగు కంటే ముందే హిందీలో రెండు సినిమాలు చేశాను. సౌత్ సినిమా, నార్త్ సినిమా అని నేను వేరుగా చూడను. 'బాహుబలి' అన్ని అడ్డుగోడల్నీ కూల్చేస్తూ ఇండియన్ సినిమాగా మెప్పించింది.
- ద్విభాషా, త్రిభాషా చిత్రాల సంఖ్య పెరిగింది. నెట్ ఫ్లిక్స్, అమెజాన్ వంటి వీడియో స్ట్రీమింగ్ సైట్స్‌లో కూడా వాటిని చూస్తున్నాం. నేనూ 'లస్ట్ స్టోరీస్' అనే వెబ్ మూవీలో నటించాను. భాష దేనికీ అడ్డు కాదు.
- కరణ్ జోహార్‌కి వీరాభిమానిని. ఓ రోజు రాత్రి ఫోన్ చేసి తన కొత్త చిత్రాల గురించి చెబుతుంటే నాకేమైనా ఆఫర్ ఇస్తున్నారా అని అడిగా. ఆఫీసుకొచ్చి కలవమన్నారు. వెళ్తే ఫిమేల్ ఓరియెంటెడ్ స్టోరీ అంటూ 'లస్ట్ స్టోరీస్' స్క్రిప్ట్ చెప్పారు. ఆయనపై నమ్మకంతో ఓకే అన్నా. దాంతో గ్లోబల్‌గా గుర్తింపు రావడంతో పాటు ఫిమేల్ ఫాలోయింగ్ కూడా పెరిగింది.


అనుకోకుండా డైరెక్టరయ్యా: కంగనా



ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా కంగనా రనౌత్ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'మణికర్ణిక'. క్రిష్ కొంతభాగం దర్శకత్వం వహించగా కంగనా పూర్తిచేశారు. జీ స్టూడియోస్‌తో కలసి కమల్ జైన్ నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదల కానుండగా తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అనంతరం కంగనా మాట్లాడుతూ ''తెలుగు వెర్షన్ ట్రైలర్ చూడటం సంతోషంగా ఉంది. డబ్బింగ్ వెర్షన్ విషయంలో విజయేంద్ర ప్రసాద్‌గారు ఎంతో హెల్ప్ చేశారు. ఈ పాత్ర కోసం రెండు నెలల పాటు గుర్రపు స్వారీ, కత్తియుద్ధంలో శిక్షణ తీసుకున్నాను. నేను డైరెక్షన్ చేయడం యాక్సిడెంటల్‌గా జరిగింది. ఆగస్టులో రావాల్సిన చిత్రమిది. దాంతో క్రిష్ మరో సినిమాకు అంగీకరించారు. బహుశా అది 'ఎన్టీఆర్' బయోపిక్ కావొచ్చు. ఆగస్టుకు 'మణికర్ణిక' పూర్తవకపోవడంతో మిగిలిన భాగం ఫిబ్రవరి తర్వాత పూర్తి చేస్తానన్నారు. కానీ జనవరిలోనే సినిమా విడుదలను ప్లాన్ చేయడంతో అనుకోకుండా నేను దర్శకత్వం వహించాల్సి వచ్చింది. క్రిష్ గొప్పగా తీశారు. నేను దాన్ని అనుసరించాను. విజయేంద్ర ప్రసాద్ రచయితగా మరో చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాను. త్వరలోనే ప్రారంభమవుతుంది'' అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ''ఇలాంటి దేశభక్తి చిత్రానికి పనిచేసి విజయేంద్రప్రసాద్, క్రిష్ తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటారు. మిగిలిన భాగానికి దర్శకత్వం వహించిన కంగన గారికి ధన్యవాదాలు. డేరింగ్, డ్యాషింగ్ హీరోయిన్ కంగనా, జాతీయ స్థాయి రచయిత విజయేంద్ర ప్రసాద్ కలసి వర్క్ చేసిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ''భారతదేశం అంటే బాహుబలి అని చెప్పుకునే స్థాయి విజయాన్ని ఇచ్చిన విజయేంద్ర ప్రసాద్ 'మణికర్ణిక'కు కథను అందించారు. మనిషి ఎత్తు తక్కువే కానీ నటిగా ఆకాశానికి ఎదిగింది కంగనా. ఆమె నటించిన ప్రతి సినిమా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా కూడా మెప్పిస్తుందని భావిస్తున్నాను'' అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ''హిమాచల్ ప్రదేశ్ నుంచి వచ్చిన కంగనా రనౌత్ అక్కడి కొండల్లాగే దృఢమైనది. అద్భుతమైన కథలను ఎంచుకుని ఎలాంటి పాత్రలోనైనా మెప్పించగల ప్రతిభాశాలి. 'మణికర్ణిక' విషయంలోనూ ఆమె ఎఫర్ట్ కనిపిస్తోంది'' అన్నారు.

డ్యాన్సర్‌గా సారా

స్టార్ డాటర్ సారా అలీ ఖాన్ చేసిన తొలి సినిమా 'కేదార్‌నాథ్' వివాదాల్లో చిక్కుకుని టీమ్‌ని టెన్షన్ పెట్టింది. కానీ ఆమె రెండో సినిమా 'సింబా' మాత్రం సూపర్ హిట్టయ్యి ఆ టెన్షన్‌ని మరిపించింది. ఆ సంతోషంలో ఉబ్బితబ్బిబ్బవుతోన్న సారాకి మరో సూపర్బ్ చాన్స్ దొరికిందని సమాచారం. డ్యాన్స్ ప్రధానంగా రెమో డిసౌజా తెరకెక్కించిన చిత్రం 'ఏబీసీడీ'. ఇది ఎంత పెద్ద హిట్టయ్యిందో దాని సీక్వెల్ కూడా అంతే సక్సెస్ సాధించింది. దాంతో ఇప్పుడు మూడో భాగాన్ని తీయడానికి రెడీ అవుతున్నాడు రెమో. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా మొదట కత్రినాను తీసుకున్నారు. కానీ 'భారత్' మూవీ కోసం ఆమె దీన్ని వదులుకుంది. దాంతో ఆమె స్థానంలో సారాని తీసుకున్నాడట రెమో. ఈ చిత్రంలో హీరోయిన్ అత్యద్భుతమైన పాకిస్థానీ డ్యాన్సర్‌గా కనిపిస్తుంది. కత్రినా చాలా మంచి డ్యాన్సర్ కనుక సరిగ్గా సరిపోతుందని తీసుకున్నారు. ఆమె స్థాయిలో సారా డ్యాన్స్ చేయగలదో లేదో చూడాలి.



పాయల్ పంట పండింది



మొదటి చిత్రం 'ఆర్ ఎక్స్ 100' చిత్రంతోనే దక్షిణాదిన చెప్పలేనంత పాపులర్ అయింది పాయల్ రాజ్‌పుత్. అయితే ఆ సినిమా ముద్ర బాగా పడడంతో ఎక్కువగా బోల్డ్ పాత్రలే వస్తున్నాయని ఆ మధ్య వాపోయింది. కానీ ఇప్పుడామె చేస్తోన్న చిత్రాలను బట్టి చూస్తే త్వరలోనే మంచి పొజిషన్‌కి చేరుకుంటుందనిపిస్తోంది. రాజు మహారాజు, అర్ధనారి సినిమాల డైరెక్టర్ భానుశంకర్ రూపొందిస్తోన్న లేడీ ఓరియెంటెడ్ మూవీలో పాయలే హీరోయిన్. ఆమె పంజాబీ చిత్రాలు హాన్జీ హాన్జీ, ఇష్కా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. తెలుగులో జయసుధ పాత్రలో నటించిన 'కథానాయకుడు' రిలీజ్‌కు రెడీగా ఉంది. మరోపక్క తమిళంలో ఉదయనిధి స్టాలిన్ తో 'ఏంజిల్' మూవీ మొదలైంది. ఆ షూటింగ్ లొకేషన్లో తీసిన వీడియో క్లిప్ ను కూడా నెట్లో పోస్ట్ చేసింది. మొత్తానికి పాయల్ పంట పండిందన్నమాట.



రొమాంటిక్ హిప్పీ


ఒకమ్మాయి వెంటపడితే అమాయకంగా ప్రేమించి మోసపోయాడు కార్తికేయ తన గత సినిమాలో. కానీ కొత్త సినిమాలో మాత్రం తనే అమ్మాయిల వెంట పడుతున్నట్టు కనిపిస్తున్నాడు. అతడు హీరోగా టీఎన్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హిప్పీ'. కలైపులి థాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ పోస్టర్ ఒకటి తాజాగా విడుదలైంది. బీచ్‌లో హీరోయిన్లు జజ్‌బా, దిగంగనాల వైపు రొమాంటిగ్గా చూస్తున్నాడు కార్తికేయ. ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ అని దర్శక నిర్మాతలు ముందే చెప్పారు. అది నిజమేనని ఈ పోస్టర్ ప్రూవ్ చేసింది.

మోడీగా వివేక్

బాలీవుడ్‌లో పొలిటికల్ బయోపిక్స్ జోరు పెరుగుతోందే తప్ప తగ్గట్లేదు. రీసెంట్‌గా 'ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' దుమారం రేపిన సంగతి తెలిసిందే. అంతలోనే మరో ప్రధాని లైఫ్ స్టోరీని తెరకెక్కించేందుకు రంగం సిద్ధమైంది. నరేంద్ర మోడీ జీవితాన్ని సినిమాగా మలిచేందుకు దర్శకుడు ఒమంగ్ కుమార్ రెడీ అయ్యాడు. ఈ సినిమా విషయమై గత కొద్ది రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. మోడీగా వివేక్ ఒబెరాయ్ నటిస్తాడనీ అన్నారు. ఈ రెండు విషయాలనూ రీసెంట్‌గా కన్‌ఫర్మ్ చేశారు టీమ్. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఈ నెల ఏడో తేదీన మహా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇరవై మూడు భాషల్లో విడుదల చేయనున్నారని సమాచారం. మోడీ జీవితంలో కాంట్రవర్శీలకు కొదువ లేదు. పైగా ఇప్పుడాయన ప్రధాని పదవిలో కూడా ఉన్నారు కాబట్టి ఈ సినిమా కూడా చర్చల్లో నిలవడం ఖాయం.



ట్విటర్ టాక్



''మీరెంత మంచివారు అన్నదానితో సంబంధం లేకుండా మిమ్మల్ని ద్వేషించేవారు ఎప్పుడూ మీ చుట్టూ ఉంటారు. వారి గురించి దిగులు పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వాళ్లు మిమ్మల్నే కాదు... తమని తాము కూడా ప్రేమించుకోరు. కాబట్టి వాళ్ల మీద జాలి పడండి తప్ప బాధపడకండి.''

– మంచు మనోజ్, హీరో

ఆన్ లొకేషన్



సల్మాన్ ఖాన్ హీరోగా అలీ అబ్బాస్ జాఫర్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'భారత్'. కత్రినా కైఫ్ కథానాయిక. ఆ చిత్ర షూటింగ్ లొకేషన్లో తీసిన ఫొటో.

గప్‌చుప్

తమిళంలో హిట్టయిన సినిమాలు తెలుగులో రీమేక్ కావడం మామూలే. సూపర్ హిట్ సైకో థ్రిల్లర్ మూవీ 'రాట్చసన్'ని కూడా తెలుగులో రీమేక్ చేయనున్నారని సమాచారం. ఇందులో నటించడానికి బెల్లంకొండ శ్రీనివాస్ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే నిజానికి ఆ ప్రాజెక్ట్ చేసేందుకు మొదట నితిన్ ఆసక్తి చూపించాడట. తనే రీమేక్ రైట్స్ తీసుకోవాలని ప్రయత్నించాడట. కానీ తమిళ నిర్మాతలు మరీ ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేశారని, అందుకే నితిన్ వెనక్కి తగ్గాడని అంటున్నారు. ఈ వార్త నిజమో కాదో మరి!



ఫొటో ఫీస్ట్



మంచు కురిసే వేళలో.. మనసు మురిసేనెందుకో... అప్పుడెప్పుడో విన్న అందమైన పాట. మంచులో తడిసిన ముద్దబంతిలా ఉన్న పూజా హెగ్డేని చూస్తుంటే మళ్లీ గుర్తొస్తోంది. ప్రస్తుతం షూటింగ్ కోసం విదేశాల్లో ఉన్న పూజ రీసెంట్‌గా ఈ ఫొటోని షేర్ చేసింది.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.442	రూ.5.00
వరంగల్	రూ.444	రూ.5.00

మార్కెట్

సెన్సెక్స్ 181 35,695.10

నిఫ్టీ 55 10,727.35



అనిల్ అంబానీని అరెస్టు చేయండి

సుప్రీంకోర్టుకు ఎరిక్సన్ వినతి

న్యూఢిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ తమకు బకాయిలు చెల్లించకుండా కోర్టు ధిక్కరణ నేరానికి పాల్పడిందంటూ స్వీడిష్ కంపెనీ ఎరిక్సన్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తమ కంపెనీకి రావాల్సిన రూ.550 కోట్లు చెల్లించేవరకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఛైర్మన్ అనిల్ అంబానీ విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలనీ, అరెస్టు చేయాలనీ సుప్రీంకోర్టును మరోసారి కోరింది. ఆర్‌కామ్‌తో పాటు రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ ఇన్ఫ్రాటెల్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మన్ అనిల్ సహా ఈ కంపెనీల ఉన్నతాధికారులు దేశం విడిచిపోకుండా అడ్డుకునేలా హోం మంత్రిత్వశాఖకు ఆదేశాలు ఇవ్వాలని కూడా కోరింది. అయితే తమ కంపెనీ స్పెక్ట్రంను అమ్మడానికి టెలికంశాఖ (డాట్) అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నదంటూ ఆర్‌కామ్ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. స్పెక్ట్రం అమ్మిన తరువాత ఎరిక్సన్‌కు బకాయిలు చెల్లిస్తామని తెలిపింది. ఈ విషయంలో అనిల్ అంబానీ స్వయంగా కోర్టుకు పూచీపడ్డారని కూడా ఆర్‌కామ్ తెలిపింది. ఈ రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరుపుతుంది. బకాయిలు చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆర్‌కామ్, ఇతర కంపెనీలు పట్టించుకోకపోవడంతో తాజా పిటిషన్ వేశామని ఎరిక్సన్ తరఫు న్యాయవాది అనిల్ ఖేర్ చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చి చాలా కాలమైనా ఇప్పటికీ డబ్బులు రాలేదన్నారు. ఆర్‌కామ్ కోర్టును ధిక్కరించినట్టు తేలితే ఆరు నెలలపాటు జైలుశిక్ష పడుతుందని అన్నారు. తమకు డబ్బు కట్టే వరకు ఆర్‌కామ్ ఇతర ఆస్తులు అమ్మకుండా స్టే ఇవ్వాలని కోరినట్టు వెల్లడించారు. ఇదివరకు జరిగిన ఆస్తుల అమ్మకాలను రద్దు చేయాలని కోరామన్నారు. ఆర్‌కామ్ దివాళా ప్రక్రియకు కూడా అనుమతించాలని ఎరిక్సన్ న్యాయమూర్తులను కోరింది. ఈ కంపెనీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను ఎన్సీఎల్టీ ఇది వరకే ఆమోదించింది. ఆస్తులను అమ్మి అప్పులు కడతామంటూ ఆర్‌కామ్ బయటపడింది. అప్పులను రూ.46 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్లకు తగ్గించుకుంటామని తెలిపింది. ఎరిక్సన్ సహా పలు సంస్థలకు బకాయిపడ్డ మొత్తాలను చెల్లించడానికి ఆర్‌కామ్ తన ఆస్తులను రిలయన్స్ జియోకు అమ్మకానికి పెట్టింది. ఇందుకు డాట్ తిరస్కరించింది. ఆర్‌కామ్ అప్పులను తీర్చడానికి జియో సిద్ధపడటం లేదు కాబట్టి అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని తెలిపింది. ఎరిక్సన్‌కు బకాయిలు చెల్లించడంలో ఆర్‌కామ్ రెండుసార్లు విఫలం కావడంతో కోర్టును ఆశ్రయించింది. బకాయిలు చెల్లించడానికి ఆర్‌కామ్‌కు సుప్రీంకోర్టు గత నెల 15 వరకు గడువు ఇచ్చింది. చెల్లింపు ఆలస్యమైతే 12 శాతం చొప్పున వడ్డీ చెల్లించాలని ఆదేశించింది.



7 % పెరిగిన చక్కెర ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం తొలి క్వార్టర్‌లో (అక్టోబరు-డిసెంబరు) చక్కెర ఉత్పత్తి ఏడుశాతం పెరగడంతో 110.52 లక్షల టన్నులకు చేరింది. కర్ణాటక, మహారాష్ట్ర మిల్లులు త్వరగా ఉత్పత్తి ప్రారంభించడమే ఇందుకు కారణమని ఇండియన్ సుగర్ మిల్స్ అసోసియేషన్ (ఇస్మా) తెలిపింది. గత నెల 31నాటికి దేశవ్యాప్తంగా 501 చక్కెర మిల్లులు పనిచేస్తున్నాయని, ఇవి 110.52 లక్షల టన్నులు ఉత్పత్తి చేశాయని పేర్కొంది. 2017 డిసెంబరులో 505 మిల్లులు 103.56 లక్షల టన్నుల చక్కెర తయారు చేశాయి. ఈసారి చెరుకు క్రషింగ్ త్వరగా మొదలవడంతో చక్కెర ఉత్పత్తి పరిమాణం పెరిగింది. అయితే మహారాష్ట్రలో వర్షాభావం, చెరుకు పంటకు తెల్లపురుగు సోకడం వల్ల ఉత్పత్తి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కిరాయికి రూఫ్‌టాప్ ఏసీలు

హైదరాబాద్, వెలుగు: పెళ్లి వేడుకలు, బర్త్‌డే పార్టీలు, కార్పొరేట్ మీటింగ్స్, ఇతర ఈవెంట్లకు ఏసీలను కిరాయికి ఇచ్చేందుకు అవెన్స్ గ్రూప్ ఎయిర్‌వింగ్జ్ ఏసీ రెంటల్స్ అనే సర్వీసులను తీసుకొచ్చింది. ఇందుకుగాను ప్రత్యేకంగా టెంట్ ఏసీలను తయారుచేస్తోంది. హైదరాబాద్, వైజాగ్, భువనేశ్వర్, ముంబై, కోల్‌కతా ప్రాంతాల్లో తమ సర్వీసులను అందిస్తున్నట్టు కంపెనీ చెప్పింది. తాము అందించే ఏసీ రెంటల్స్ సర్వీసులకు టెక్నిషియన్లతో, వర్కర్లతో పెద్దగా పనిఉండదని పేర్కొంది. ఏసీలను రెంటల్‌కు ఇచ్చేందుకు ఈవెంట్ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పరుచుకున్నట్టు అవెన్స్ గ్రూప్ సీఈవో వెంకటేశ్వర్ తెలిపారు. 12.5 టన్నుల సామర్థ్యం కలిగిన ఒక ఏసి తయారీకి రూ.3.2 లక్షల ఖర్చవుతుందని, తమ సర్వీసులు ప్రస్తుతానికి పూర్తిగా రెంటల్సేనని, ఏసీలను విక్రయించమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఫ్రాంచైజీలతో ఒప్పందం కుదుర్చుకుని, దేశమంతటా ఈ సర్వీసులు అందిస్తామని అన్నారు. ఈవెంట్లు జరిపే సమయంలో ఏసీల ఇన్‌స్టాలేషన్‌లో చాలా సమస్యలు వస్తుంటాయని, వాటిని అప్పటికప్పుడు పరిష్కరించడం చాలా కష్టతరంగా మారుతుందని చెప్పారు. వాటిని దృష్టిలో ఉంచుకుని, టెంట్ ఏసిలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఎయిర్‌వింగ్జ్ ఏసీ రెంటల్స్‌లో బ్యాకప్ పెద్దగా అవసరముండదని, గ్యాస్ ఫిల్లింగ్, లీకేజీలు ఉండవని చెప్పారు. ఈ సర్వీసులకు ఒక్కో యూనిట్‌కు రూ.30వేల నుంచి రూ.35వేల వరకు ఛార్జ్ చేస్తామని, ప్రస్తుతం రూ.7 కోట్ల మేర పెట్టుబడులు పెట్టగా, మరో రెండేళ్లలో రూ.35 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు.



ఇనార్బిట్ మాల్‌లో 50 శాతం డిస్కౌంట్

హైదరాబాద్, వెలుగు: పండుగ సమయాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ప్రత్యేక సేల్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో 100కుపైగా బ్రాండ్ల దుస్తులపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తామని తెలిపింది. ఫుడ్, బేవరేజ్‌లపైనా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని తెలిపింది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు మాల్ తెరిచి ఉంటుంది.

ఇప్పుడే కాదు.. కాస్త టైమివ్వండి ప్లీజ్

- నిబంధనలను స్టడీ చేయాలి
- వ్యాపార విధానాలను మార్చాలి
- ఇందుకు 5 నెలల గడువు ఇవ్వండి
- ప్రభుత్వాన్ని కోరనున్న ఈ-కామర్స్ కంపెనీలు

న్యూఢిల్లీ: ఈ కామర్స్ సంస్థల నియంత్రణ కోసం తెచ్చిన నిబంధనల అమలును వాయిదా వేయాలని కోరుతూ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే నెల నుంచి కొత్త నిబంధనలను అమలు చేయాలని కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ ఇది వరకే ఆదేశాలు జారీ చేసింది. ఇది చాలా తక్కువ సమయం అని, కొత్త మార్పులను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి కనీసం ఐదు నెలల గడువు కావాలని ఈ కంపెనీల వర్గాలు తెలిపాయి. కొత్త నియమాల అమలుకు నిర్వహణ పద్ధతుల్లో చాలా మార్పులు తీసుకురావాలని ఒక ఈకామర్స్ దిగ్గజం ఉన్నతాధికారి చెప్పారు. ప్రస్తుత భాగస్వామ్యాలను, వ్యాపార విధానాల్లోనూ చాలా మార్పులు ఉంటాయని అన్నారు. మరో కంపెనీ అధికారి మాట్లాడుతూ గత నెల 26న ప్రభుత్వం ఈకామర్స్ కంపెనీల కోసం తెచ్చిన విధానాన్ని అధ్యయనం చేస్తున్నామని, వీటి అమలుకు కేవలం నెల రోజుల సమయం చాలదని అన్నారు. గడువు పెంచాల్సిందిగా కోరుతూ త్వరలోనే ప్రభుత్వం తలుపు తడతామని అన్నారు. 'విక్రయదారుడు' అనే పదానికి తగిన నిర్వచనం చెప్పాలని కోరుతామని అన్నారు. ఈ విషయమై అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు పంపించిన ఈమెయిల్స్‌కు స్పందన రాలేదు.

పెద్ద కంపెనీలకు ఇబ్బందే..

కొత్త నిబంధనలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. విదేశీ పెట్టుబడులతో నడిచే కంపెనీలు తమకు వాటాలు ఉన్న సంస్థల వస్తువులను అమ్మకూడదని కొత్త విధానం నిర్దేశిస్తోంది. కంపెనీ ద్వారా అమ్మకాలు జరిపే అన్ని సంస్థలకూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకే సంస్థ నుంచి అమ్మకాలు 25 శాతం దాటితే దానిని కంపెనీ అనుబంధ సంస్థగానే పరిగణిస్తారు. కంపెనీలతో, బ్యాంకులతో 'ఎక్స్‌క్లూజివ్ డీల్స్' కుదుర్చుకోవడాన్ని కూడా నిషేధించారు. ఈకామర్స్ సొంత సంస్థల వల్ల ఇతర చిన్న కంపెనీలకు నష్టం జరగకూడదనే ఈ నిబంధనలను తీసుకొచ్చారు. ఈ విషయమై ఒక ఈకామర్స్ కంపెనీ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ ''ఒక సెల్లర్ తన ఖాతాల వివరాలను మాకు ఇవ్వదల్చుకోలేదు అనుకుందాం. అటువంటి సందర్భాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నదీ లేనిదీ నిర్ధారించడం కష్టమవుతుంది. ఇటువంటి ఇబ్బందులు చాలా ఉన్నాయి'' అని అన్నారు. ఇదిలా ఉంటే, ప్రైవేటు లేబుళ్ల వస్తువులను అమ్ముకోవడానికి ఈకామర్స్ కంపెనీలకు అనుమతి కొనసాగుతుందని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. దీనికి కంపెనీలు స్పందిస్తూ ప్రైవేటు లేబుల్ కంటే పెద్ద సమస్యలు చాలా ఉన్నాయని, ముందు వాటిని పరిష్కరించాలని కోరాయి. కంపెనీలు సొంతగా సృష్టించుకునే బ్రాండ్లను ప్రైవేట్ లేబుల్స్ అంటారు. ప్రముఖ బ్రాండ్లతో పోలిస్తే వీటి అమ్మకాలతో ఎక్కువ లాభాలు వస్తాయి. అందుకే ఈకామర్స్ కంపెనీలు పాదరక్షలు, ఫర్నిచర్, కిరాణ సామగ్రి వంటి విభాగాల్లో ప్రైవేటు లేబుల్స్‌ను ప్రవేశపెడుతున్నాయి. అయితే కొత్త నిబంధనలపై మిశ్రమ స్పందనలు కనిపిస్తున్నాయి. అందరితో మాట్లాడిన తరువాతే కొత్త రూల్స్ తెస్తే బాగుండేదని ఫ్లిప్‌కార్ట్ అభిప్రాయపడింది. తాము ఎప్పుడూ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని అమెజాన్ తెలిపింది. కొత్త నిబంధనలపై స్పష్టత రావాలని పేర్కొంది.





'ఈ విధానంతో వినియోగదారులకు నష్టం'

యూఎస్‌ఇండియా స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కొత్త విధానాన్ని తీవ్రంగా విమర్శించింది. ప్రభుత్వ నిర్ణయం వినియోగదారులకు మేలు కంటే హానే ఎక్కువ చేస్తుందని ఆక్షేపించింది. ఆన్‌లైన్ రిటైల్ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ''వ్యాపారాలను సూక్ష్మస్థాయిలో నియంత్రించడం ప్రభుత్వం పనికాదు. ఎవరితోనూ సంప్రదింపులు జరపకుండానే కొత్త రూల్స్ తెచ్చారు. ఆట జరుగుతున్నప్పుడు మధ్యలో నియమాలు మార్చినట్టుగా ఉంది'' అని పేర్కొంది. షాప్‌క్లూజ్, స్నాప్‌డీల్ వంటి చిన్న ఆన్‌లైన్ రిటైలర్లు మాత్రం ప్రభుత్వాన్ని సమర్థించాయి. ఇక నుంచి పెద్ద కంపెనీల అడ్డదారులు మూసుకుపోతాయని పేర్కొన్నాయి. పెద్ద కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి కాబట్టే ప్రభుత్వం కొత్త విధానాన్ని తెచ్చిందని షాప్‌క్లూజ్ సీఈఓ సంజయ్ సేఠీ అన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల అందరికీ సమాన అవకాశాలు దక్కుతాయని స్నాప్‌డీల్ సహవ్యవస్థాపకుడు, సీఈఓ కునాల్ బెహల్ అన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈకామర్స్ రంగంలో 100 శాతం పెట్టుబడులను అనుమతిస్తారు.

హోమ్‌లోన్లలో అమరావతి ఎస్‌బీఐ టాప్

దేశంలోనే ఫస్ట్

హైదరాబాద్, వెలుగు: హోమ్ లోన్ల మంజూరులో 20 శాతం వృద్ధి తో దేశంలోనే ముందంజలో ఉందని ఎస్‌బీఐ అమరావతి వెల్లడించింది. విజయవాడ హోమ్ లోన్లలో మొదటి స్థానంలో ఉండగా, వైజాగ్ 9వ స్థానంలో ఉందని, ఆంధ్రప్రదేశ్ లో ఎస్ బీఐ హోమ్ లోన్ల మార్కెట్ వాటా 40 శాతంగా ఉందని ఎస్‌బీఐ అమరావతి ఛీఫ్ జనరల్ మేనేజర్ మణి పల్వేసన్ తెలిపారు. ఏపి లో 1379 బ్రాంచీలుండగా, 3679 ఏటిఎం లు ఉన్నాయని, ఈ యేడాది మరో 1600 ఏటిఎం లు ప్రారంభిస్తామని అన్నారు. దీన్లో వెయ్యి కొత్త ఏటిఎం లు కాగా, 600 ఏటిఎం లను రీప్లేస్ మెంట్ చేస్తామని చెప్పారు. ఒక ఏటిఎంలో రోజుకు 200 లావాదేవీలకు పైబడితే అదనంగా మరో ఏటిఎం ఏర్పాటు చేస్తామని అన్నారు. 2018 ఎప్రిల్ నుండి డిసెంబర్ 2018 నాటికి రూ.13,360 కోట్ల ఎమ్ఎస్ఎమ్ఈ రుణాలు మంజూరు కాగా, రూ.25,700 కోట్ల అగ్రి లోన్స్ ఇచ్చామని అన్నారు. ఇదే కాలంలో హోమ్ లోన్లు రూ.3,398 కోట్ల మేర మంజూరు చేసామన్నారు.





అవును..రూ.2 వేల నోట్లను ముద్రించడం లేదు

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో తగినన్ని కరెన్సీ నోట్లు అందుబాటులో ఉండటం వల్లే రూ.2 వేల నోట్ల ముద్రణను నిలిపివేశామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భవిష్యత్ అంచనాలను బట్టే నోట్లను ముద్రిస్తామని కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శి సుభాష్‌చంద్ర గర్గ్ ట్వీట్ చేశారు. ఇప్పుడున్న కరెన్సీలో 35 శాతానికిపైగా నోట్లు రూ.2 వేలవేనని తెలిపారు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేశాక, రూ.2 వేల నోటును ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే.

లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిసాయి. బ్యాంకింగ్, మెటల్, ఫార్మా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు పెరగడంతో పాటు అంతర్జాతీయంగా సానుకూల పరిణామాలు, రూపాయి పుంజుకోవడం వంటి వాటితో మార్కెట్ లాభాలను మూటగట్టుకుంది. ట్రేడింగ్ ఆద్యంతం లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు చివరకు లాభాల్లోనే ముగిసాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 181.39 పాయింట్లు లాభపడి 35,695.10 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 55.10 పాయింట్లు పుంజుకుని 10,727.35 వద్ద ముగిసింది. యస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, వేదాంత, ఎస్ బిఐ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 3.05 శాతం దాకా లాభపడ్డాయి.

'ఐదు' అంత ఈజీ కాదా?

శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థల్లో బ్రిటన్‌ను దాటేసేందుకు ఇండియా దూకుడు

ప్రపంచంలో భారత్ శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. ఈ క్రమంలో గత ఏడాది ఫ్రాన్స్‌ను దాటేసి ఆరో స్థానానికి ఎగబాకింది. ఇప్పుడు మన ముందున్న బ్రిటన్‌ను దాటేసేందుకు వేగంగా దూసుకెళుతోంది. ఐదో ప్లేస్ చేరేందుకు సిద్ధమవుతోంది. అయితే, అది అంత ఈజీ ఏం కాదంటున్నారు ఆర్థిక నిపుణులు. 2019లో ఎన్నికలు, ఆర్బీఐ వ్యవహారాలు, మరికొన్ని ఘటనలు అందుకు ఆజ్యం పోస్తాయంటున్నారు.



ప్రపంచం నత్తనడక

ఈ ఏడాది ప్రపంచ సగటు అభివృద్ధి పడిపోతుందని నోమురా హోల్డింగ్స్ ఇంక్ చెబుతోంది. 2018లో 3.2 శాతం ఉన్న వృద్ధి రేటు ఈ ఏడాది 2.8 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తోంది. చైనా వృద్ధి నత్తనడకన నడవడం, దీర్ఘకాలపు ట్రెండ్స్‌లో అమెరికా, యూరోపియన్ యూనియన్‌లో మోస్తరు ఫలితాల ప్రభావం ఇండియాపై పడుతుందని తెలిపింది. భారత మార్కెట్‌కు అంత అనుకూల పవనాలు ఉండవని చెప్పింది. ఆ ప్రభావం భారత ఎగుమతులు, ఉత్పత్తి, పెట్టుబడులపై పడుతుందని నోమురా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ద్రవ్య పరపతి విధానం

పోయినేడాది రిజర్వ్ బ్యాంక్ రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచింది. ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా రేట్లు తగ్గించే సూచనలున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. తద్వారా తన దుందుడుకు ద్రవ్య విధానాలను వదిలేసే అవకాశాలున్నాయని అంటున్నారు. డిమాండ్ తగ్గుతుండడం, చమురు ధరలు కొంత అదుపులోకి రావడం వల్ల ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఆర్బీఐ నిర్దేశించుకున్న మధ్యకాలిక లక్ష్యానికి అనుగుణంగా ద్రవ్యోల్బణం 4 శాతం ఉండొచ్చని అంచనా. ఈ ఏడాది ప్రథమార్ధంలోనే వడ్డీ రేట్లను తగ్గించాలని ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ ఆలోచిస్తున్నట్టు కొందరు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాల వల్లే ద్రవ్యోల్బణం తగ్గి ఓ వరంలా ఉంటుందని, అదే వృద్ధిని ముందుకు తీసుకెళుతుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఇటీవలే చెప్పుకొచ్చారు. నిజానికి శక్తికాంతదాస్‌కు ముందు మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్, ధరల పెరుగుదలపై ఆలోచించి అడుగులు ముందుకేశారని నిపుణులు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల రుణాల మంజూరు పెరుగుతుందని, తద్వారా అభివృద్ధికి బాటలు పడతాయని చెబుతున్నారు.

ఎన్నికలు.. మోకాలడ్డు

మరో మూడు నాలుగు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పుడు ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి దేశంలో జరుగుతున్న పెద్ద చర్చ రైతుల రుణమాఫీ.

- సవాళ్లతో కూడుకున్నదేనంటున్న నిపుణులు
- ఎన్నికలు, ఆర్బీఐ విధానాలు కీలకమవుతాయని అంచనా

ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో అధికారం పోగొట్టుకోవడానికి కారణం రైతులను పట్టించుకోలేదన్న ఆరోపణలే. అందుకే ప్రధాని రైతు సంక్షేమంపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అదేగానీ జరిగితే ఖజానాపై భారం పడి ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్నది ఆర్థిక నిపుణుల మాట. గత ఏడాది త్రైమాసికంలో (సెప్టెంబర్ నుంచి) వృద్ధి రేటు 7.1 శాతానికి పడిపోయిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అదే అంతకుముందు త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి రేటు 8 శాతంగా ఉంది.

మూడు ఆప్షన్లు

మూడు రాష్ట్రాల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న బీజేపీ.. ఇప్పుడు రైతుల మేలుకు మూడు ఆప్షన్లపై ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో ఒకటి తెలంగాణ తరహా పెట్టుబడి సాయం లాంటి పథకాన్నే దేశవ్యాప్తంగా అమలు చేయడం. ఓటర్లను ఆకర్షించేందుకు జీఎస్టీ రేట్లనూ తగ్గించింది. పింఛను విత్‌డ్రాయల్స్‌పైనా కొన్ని మినహాయింపులనిచ్చింది. మద్దతు ధర, ఆరోగ్య రంగాలపైనా కొన్ని తాయిలాలు ప్రకటించింది. వీటి ప్రభావం బడ్జెట్‌లో స్పష్టంగా తెలుస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ లోటుపై కేంద్రం పెట్టుకున్న లక్ష్యాలను కేంద్రం అక్టోబర్‌లోనే దాటిపోయింది. దీంతో ఇప్పుడు ఈ ఏడాది మార్చి నాటికి జీడీపీ వృద్ధిని 3.3 శాతం పెంచాలంటే ఖర్చులను బ్యాలెన్స్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇక, మేలో ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక వృద్ధిపై కొంత స్తబ్దుగానే ఉండే అవకాశాలున్నాయని నోమురా విశ్లేషించింది.

శ్నాక్స్ తెస్తదండి దమాకున్న బండి

మీరు చదువుకునేటప్పుడు ఆకలేసిందనుకోండి.. వెళ్లి ఏదైనా కొనుక్కుందామంటే టైమ్ వేస్ట్ అవుతుందని ఒక భయం, చదువుకు మధ్యలో బ్రేకిస్తే డిస్టర్బ్ అవుతామని మరో టెన్షన్. దీంతో చాలా మంది ఆకలిని అలానే అదిమిపెట్టుకుని, అలా చదువుకుంటూ ఉండిపోతారు. కానీ కాలేజీ స్టూడెంట్లకు చదువుకునే సమయాల్లో స్నాక్స్ డెలివరీ చేసేందుకు ప్రత్యేకంగా ఓ రోబోట్ వచ్చేసింది. పెప్సికో కంపెనీ 'స్నాక్‌బోట్'

- శ్నాక్‌బోట్‌ను లాంచ్ చేసిన పెప్సికో
- యూనివర్సిటీ విద్యార్థులకు శ్నాక్స్ డెలివరీ

అనే రోబోట్‌ను కాలిఫోర్నియాలోని స్టాక్‌టోన్‌లో యూనివర్సిటీ ఆఫ్ పసిఫిక్‌లో లాంచ్ చేసింది. ఈ రోబోట్ సన్‌చిప్స్, స్టార్‌బక్స్ కోల్డ్ బ్రూ కాఫీ వంటి శ్నాక్స్‌ను విద్యార్థులకు డెలివరీ చేస్తోంది.

ఆరు చక్రాల రోబోట్...

డెలివరీ రోబోట్‌ను ఆవిష్కరించడం ఇదే మొదటి సారని పెలప్సికో వెల్లడించింది. హలో గుడ్‌నెస్ బ్రాండ్ కింద ఈ శ్నాక్స్ రోబోట్‌ను పెప్సికో అభివృద్ధి చేసింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన బే ఏరియా స్టార్టప్ రాబీ టెక్నాలజీస్ తో కలిసి ఈ ఆరు చక్రాల రోబోట్‌ను తయారు చేసింది. అయితే ఈ శ్నాక్స్ డెలివరీ రోబోట్ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 5 గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది. యూనివర్సిటీ ఆఫ్ పసిఫిక్ విద్యార్థులకు ఈ రోబోట్ శ్నాక్స్ ను డెలివరీ చేస్తోంది. వీల్ బేస్‌తో నడిచే ఈ డెలివరీ రోబోట్.. హెడ్‌లైట్స్, బిల్ట్ ఇన్ కెమెరాలతో రూపొందింది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే.. 20 మైళ్లకు పైన ఇది నడుస్తుంది. 175 ఎకరాల్లో విస్తరించిన ఉన్న ఈ యూనివర్శిటీ క్యాంపస్‌లో స్టూడెంట్లను, స్టాఫర్లను ఇది కవర్ చేస్తుంది. 'మా క్యాంపస్‌కు శ్నాక్ బోట్‌ను ఆహ్వానించడం ఎంతో ఆనందదాయకంగా ఉంది' అని స్టాక్‌టోన్, యూనివర్సిటీ ఆఫ్ పసిఫిక్ ఈ కామర్స్ డైరెక్టర్ మ్యాట్ కామినో తెలిపారు. అయితే ఇలాంటి రోబోట్స్ విషయంలో అంతకముందు కొన్ని వివాదాలు వెల్లువెత్తాయి. కొన్ని దేశాల్లో మాత్రం గ్రోసరీ వంటి వాటికోసం డెలివరీ రోబోట్స్‌ను స్వాగతిస్తున్నారు. పిజ్జా డెలివరీకి కూడా సెల్ఫ్ డ్రైవింగ్ వెహికిల్స్‌ను అమెరికాలో ఇప్పటికీ తీసుకొచ్చారు.



ఎన్నో వారాల టెస్టింగ్ అనంతరం ఈ రోబోట్‌ను తీసుకొచ్చాం. తర్వాత తరంలో సౌకర్యవంతంగా డెలివరీ చేసేందుకు, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించేందుకు శ్నాక్‌బోట్ ఎంతో ఉపయోగపడుతోంది. కన్జ్యూమర్ డిమాండ్లకు, అవసరాలకు ఇది ఎంతో ముఖ్యమైన వారధి.

- స్కాట్ ఫిన్‌లో, గ్లోబల్ ఫుడ్ సర్వీసు ఇన్నోవేషన్స్ వైస్ ప్రెసిడెంట్, పెప్సికో

ఆస్ట్రేలియా వన్డే కెప్టెన్‌గా ఫించ్



సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో ఆడే ఆస్ట్రేలియా జట్టులో సీనియర్లకు రెస్ట్ ఇచ్చారు.ఈ వన్డే సిరీస్ కోసం ఆస్ట్రేలియా 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. త్వరలో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో.. టాప్ ఫాస్ట్ బౌలర్లు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, హేజిల్‌వుడ్‌ను తప్పించి పీటర్ సిడిల్, స్టాన్‌లేక్, స్టాయినిస్, రిచర్డ్‌సన్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ఎంపిక చేసింది. 2010లో చివరిసారిగా ఆసీస్ వన్డే జట్టుకు ఆడిన ఫాస్ట్ బౌలర్ పీటర్ సిడిల్ మళ్లీ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. స్పిన్నర్ నాథన్ లైయన్ కూడా చోటు సంపాదించాడు. అరోన్ ఫించ్ వన్డే జట్టుకు సారథ్యం చేపడతాడు. టెస్ట్ ప్లేయర్ ఉస్మాన్ ఖవాజా ఈ టీమ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఇక వికెట్ కీపర్‌గా అలెక్స్ క్యారీకి అవకాశం దక్కింది. మిచెల్ మార్ష్, షాన్ మార్ష్, మ్యాక్స్‌వెల్, హ్యాండ్స్‌కోంబ్, బెరెండ్రాఫ్ బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు.

టాటా ఓపెన్ ఫైనల్లో బోపన్న - దివిజ్ జంట

పుణె: ఇండియా టెన్నిస్ డబుల్స్ స్టార్ ప్లేయర్లు రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ మరో టైటిల్ ముంగిట నిలిచారు. వరుసగా రెండో మ్యాచ్‌లో కూడా పోరాట పటిమ చూపిన ఈ జోడీ టాటా ఓపెన్ మహారాష్ట్ర టెన్నిస్ టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్స్‌లో పేస్ జోడీపై చెమటోడ్చి నెగ్గిన బోపన్న-దివిజ్ జంట శుక్రవారం జరిగిన సెమీస్‌లో 6-3, 3-6, 15-13తో మిమోన్ బొలెలి (ఇటలీ)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) ద్వయంపై ఉత్కంఠ విజయం సాధించింది. గంటా 33 నిమిషాల పోరులో రెండు మ్యాచ్ పాయింట్లు కాచుకున్న బోపన్న జంట సూపర్ టై బ్రేక్ మెరుగ్గా ఆడి గట్టెక్కింది. శనివారం జరిగే ఫైనల్లో బ్రిటన్ ద్వయం లూక్ బాంబ్రిడ్జ్-జానీ ఒ మరాతో తలపడనుంది.

పుజారాకి ప్రమోషన్ !

న్యూఢిల్లీ : సిడ్నీ టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ మిస్సయిన పుజారా కోసం మైదానం బయట గోల్డెన్ చాన్స్ ఎదురుచూస్తోంది. అన్ని కలిసొస్తే బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టుల్లో పుజారా ఏ ప్లస్ కేటగిరికి ప్రమోటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 'ఏ' కేటగిరిలో ఉన్న పుజారా ఈ ఆస్ట్రేలియా పర్యటనలో ఇప్పటివరకు 521 రన్స్ చేసి సిరీస్‌లోనే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పుజారా ప్రతిభకు మరింత గుర్తింపు దక్కాల్సిన అవసరముందని భావించిన కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్(సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్ కేటగిరి ప్రమోషన్ అంశాన్ని లేవనెత్తారు. చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, జట్టు మేనేజ్‌మెంట్‌తో మాట్లాడాక నిబంధనల ప్రకారం ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటారు.



'హ్యాపీ బర్త్‌డే అమ్మా.... రోజూ నాతో ఉండి నన్ను నడిపించిన నువ్వంటే నాకెంతో ఇష్టం. నిన్నెంతగానో ప్రేమిస్తున్నా. ట్రైనింగ్, మ్యాచ్‌ల సమయాల్లో నాతోపాటు ప్రయాణించిన ఆ రోజులను మర్చిపోలేను. నా మీద ఒత్తిడి పడకుండా, ఆ భారం మొత్తాన్ని మీద వేసుకున్న నీకు కృతజ్ఞతలు చెప్పేందుకు మాటలు సరిపోవు. లవ్ యూ అండ్ హ్యాపీ బర్త్‌డే వన్స్ అగైన్'

- రిషబ్ పంత్, సిడ్నీ టెస్ట్‌లో సెంచరీ అనంతరం



రిషభ్ పంత్ (159 నాటౌట్)

2 టెస్టుల్లో రిషభ్ పంత్‌కు ఇది రెండో సెంచరీ

204 ఈ మ్యాచ్‌లో పంత్–జడేజా భాగస్వామ్యం. ఆసీస్‌పై ఇండియాకు ఏడో వికెట్‌కు ఇదే బెస్ట్

ఏడు దశాబ్దాల కల సాకారం కాబోతోంది..! ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకొని సగర్వంగా తలెత్తుకోవడం ఖాయమే..! కాకపోతే అది 3–1తోనా.. 2–1తోనా అన్నదే తేలాలిక..! తొలి రోజు పుజారా, మయాంక్ ఫస్ట్ క్లాస్ బ్యాటింగ్‌తో ఆసీస్‌కు సవాల్ విసిరిన కోహ్లీసేన.. రెండో రోజు క్లాస్, మాస్ కలగలిసిన ఆటతో ప్రత్యర్థికి యాక్షన్ సినిమా చూపించింది..! బ్యాటింగ్ వాల్ చటేశ్వర్ మరో రోజు ఆసీస్‌ను కంగారు పెట్టగా.. అతడికి రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ధనాధన్ బ్యాటింగ్ తోడవంతో సిడ్నీలో హోమ్ టీమ్ ఉక్కిరిబిక్కిరైంది..! ఒకరినిమించి మరొకరు అన్నట్టు ఈ ముగ్గురూ చెలరేగి ఆడడంతో ఇండియా పరుగుల మోతెక్కించింది..!

గుప్పిట్లో సిడ్నీ!

పుజారా 'డబుల్' మిస్

పంత్	జడేజా	ఇండియా తొలి ఇన్నింగ్స్	ఆసీస్
సూపర్ సెంచరీ	మెరుపు బ్యాటింగ్	622/7 డిక్లేర్డ్	తొలి ఇన్నింగ్స్ 24/0



పంత్–జడేజా ధనాధన్..

పుజారా ఔటైనా ఇండియా జోరు ఏమాత్రం తగ్గలేదు. అప్పటికే క్రీజులో కుదురుకున్న పంత్‌కు జడేజా తోడవడంతో ఇన్నింగ్స్ వేగం మరింత పెరిగింది. తొలుత కాస్త జాగ్రత్త పడ్డా తర్వాత స్వేచ్ఛగా షాట్లు కొడుతూ బౌలర్లకు సవాల్ విసిరారు. ఈ ఇద్దరి జోరుతో ఇండియా 491/6తో టీ బ్రేక్‌కు వెళ్లొచ్చింది. విరామం నుంచి రాగానే పంత్ 137 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే జడేజా కూడా టెస్టుల్లో పదో అర్ధసెంచరీ (89 బంతుల్లో)ని పూర్తి చేసుకొని తనదైన శైలిలో 'బ్యాటు సాము' చేశాడు. అనంతరం ఇద్దరూ మరింత దూకుడుగా బ్యాటింగ్ చేసి ప్రత్యర్థి బౌలర్లను చితగ్గొట్టారు. లైయన్ వేసిన 152వ ఓవర్‌లో ఫోర్‌తో పంత్ 150 పరుగుల మార్కును చేరుకున్నాడు. వేగంగా ఆడే క్రమంలో లైయన్ బౌలింగ్‌లో జడేజా బౌల్డ్ అయిన వెంటనే కోహ్లీ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. జడేజా, పంత్ ఏడో వికెట్‌కు 204రన్స్ జోడించడం విశేషం. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ పది ఓవర్లు ఎదుర్కొని వికెట్ కోల్పోకుండా రోజు ముగించింది. అయితే, ఓపెనర్ ఖవాజాకు ఆరంభంలోనే లైఫ్ లభించింది. మహ్మద్ షమీ వేసిన మూడో ఓవర్లో అతనిచ్చిన క్యాచ్‌ను పంత్ నేలపాలు చేశాడు.

సిడ్నీ: ఆడుతోంది ఆసీస్‌లోనా.. ఇండియాలోనా అన్న అనుమానం కలిగేలా..! ఎదుర్కొంటోంది కంగారూ బౌలర్లనా.. క్లబ్ ప్లేయర్లనా అనుకునేలా ఇండియా బ్యాట్స్‌మెన్ వీరవిహారం చేశారు. సిడ్నీ మైదానంలో పరుగుల చిరుతల్లా ప్రత్యర్థిని వేటాడారు. ఆస్ట్రేలియన్లను కూనలు చేసి.. నాలుగో టెస్ట్‌లో వరుసగా రెండో రోజూ పరుగుల వర్షం కురిపించారు. చటేశ్వర్ పుజారా (373 బంతుల్లో 22 ఫోర్లతో 193), రిషభ్ పంత్ (189 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్సర్‌తో 159 నాటౌట్) భారీ సెంచరీలకు తోడు రవీంద్ర జడేజా (114 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్‌తో 81) హాఫ్ సెంచరీతో చెలరేగడంతో 622/7స్కోరు వద్ద కోహ్లీసేన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆసీస్ గడ్డపై తమ రెండో టాప్ స్కోరు సాధించిన ఇండియా.. మ్యాచ్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ ఆట ముగిసేసరికి పది ఓవర్లలో 24/0తో నిలిచింది. ఓపెనర్లు హారిస్ (19 బ్యాటింగ్), ఖవాజా (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇండియాకంటే 598 పరుగుల వెనుకంజలో ఉన్న ఆసీస్ చేతిలో పది వికెట్లు ఉన్నాయి.

పుజారా–పంత్ సూపర్ ఇన్నింగ్స్...

పుజారా అద్భుత బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో ఇండియాకు మొదటి రోజే పటిష్ఠ పునాది పడింది. మరో 150-200 రన్స్ జోడిస్తే విజయం తేలికవుతుందని భావించాం. కానీ, ఎక్కడో చిన్న అనుమానం. ఒకవేళ ఆసీస్ పేసర్లు విజృంభిస్తే గెలుపు కోసం పోరాడాల్సి వస్తుందనిపించింది. కానీ, మనోళ్లు వారికి ఆ చాన్స్ ఇస్తే కదా. పుజారాతో పాటు పంత్, జడేజా పరుగుల కోసం పోటీ పడడంతో కంగారూ బౌలర్లు తెల్లముఖం వేసేశారు. ఓవర్‌నైట్ స్కోరు 303/4తో ఇండియా రెండో రోజు ఆట కొనసాగించగా.. ఉదయం పుజారా, హనుమ విహారి (96 బంతుల్లో 5 ఫోర్లతో 42) నిదానంగా బ్యాటింగ్ చేశారు. ఈక్రమంలో ఇద్దరూ ఐదో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. లైయన్ వేసిన 102వ ఓవర్లో షార్ట్ లెగ్ వద్ద లాబుషేన్ క్యాచ్ పట్టడంతో విహారి ఇన్నింగ్స్ ముగిసింది. దీనిపై డీఆర్ఎస్‌కు వెళ్లినా ప్రతికూల ఫలితమే లభించింది. అయితే, ఆ ఆనందం ఆసీస్‌కు ఎంతోసేపు నిలువలేదు. పుజారాకు పంత్ తోడయ్యాడు.

తొలి రోజుకు భిన్నంగా చటేశ్వర్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. ఇదే క్రమంలో 282 బంతుల్లో పుజారా 150వ పరుగుల మార్కును చేరుకున్నాడు. మరో ఎండ్‌లో పంత్ కూడా తనదైన శైలిలో వేగంగా ఆడడంతో లంచ్ విరామానికి ఇండియా 389/5తో నిలిచింది. బ్రేక్ తర్వాత కూడా ఇద్దరూ అదే జోరు కొనసాగించారు. అయితే, డబుల్ సెంచరీకి చేరువైన పుజారాను లైయన్ అడ్డుకున్నాడు. రిటర్న్ క్యాచ్‌తో మారథాన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దీంతో 89 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.



జడేజా (81)



పుజారా (193)

స్కోరుబోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్: మయాంక్ (సి) స్టార్క్ (బి) లైయన్ 77, రాహుల్ (సి) మార్ష్ (బి) హేజిల్‌వుడ్ 9, పుజారా (సి అండ్ బి) లైయన్193, కోహ్లీ (సి) పైన్ (బి) హేజిల్‌వుడ్ 23, రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, విహారి (సి)లాబుషేన్ (బి) లైయన్ 42, పంత్ (నాటౌట్) 159, జడేజా(బి) లైయన్81; **ఎక్స్‌ట్రాలు:** 20; **మొత్తం:** 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్ ; **వికెట్ల పతనం:** 1-10, 2-126, 3-180, 4-228, 5-329, 6-418, 7-622;

బౌలింగ్: స్టార్క్ 26-0-123-1, హేజిల్‌వుడ్ 35-11-105-2, కమిన్స్ 28-5-101-0, లైయన్ 57.2-8-178-4, లాబుషేన్ 16-0-76-0, హెడ్ 4-0-20-0, ఖవాజా 1-0-4-0;

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 24/0

1 ఆసీస్ గడ్డపై టెస్ట్ సెంచరీ చేసిన ఇండియా తొలి వికెట్ కీపర్ పంత్

159 ఈ మ్యాచ్‌లో పంత్ చేసిన పరుగులు. విదేశీ గడ్డపై ఇండియా కీపర్ చేసిన అత్యధిక స్కోరు. ధోనీ (2006లో పాకిస్తాన్‌పై 148)ని అధిగమించాడు

1258 ఈ సిరీస్‌లో పుజారా ఎదుర్కొన్న బంతులు. ఆసీస్‌తో నాలుగు టెస్టుల సిరీస్‌లో అత్యధిక బాల్స్ ఎదుర్కొన్న ఇండియన్‌గా రాహుల్ ద్రవిడ్ (2003–04లో 1203 బాల్స్) రికార్డును దాటాడు

2 ఆసీస్‌గడ్డపై ఇండియాకిది రెండో అత్యుత్తమ స్కోరు. గతంలో ఇదే వేదికపై 2004లో 705/7 స్కోరు చేసింది

1 విదేశీ గడ్డపై టెస్ట్‌ల్లో పుజారాకు ఇదే బెస్ట్ స్కోరు. 2013లో జొహన్నెస్‌బర్గ్‌లో సౌతాఫ్రికాపై, 2017లో గాలెలో శ్రీలంకపై చేసిన 153 పరుగులే ఇప్పటిదాకా అత్యధికం.

3 ఆసీస్‌గడ్డపై టెస్టు సిరీస్‌లో 500 పరుగులు చేసిన మూడో క్రికెటర్ పుజారా. గతంలో ద్రవిడ్, కోహ్లీ ఈ ఘనత సాధించారు

'సిక్సర్' కొట్టేదెవరో..!



- బెంగళూరుతో గుజరాత్ ఢీ
- ప్రొ కబడ్డీ ఆరో సీజన్ ఫైనల్ నేడే
- రా. 8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్ లో

ముంబై: రసవత్తర పోరాటలతో మూడు నెలలుగా అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ప్రొ కబడ్డీ ఆరో సీజన్ కథ క్లైమాక్స్‌కు చేరుకుంది. ఫైనల్ పంగా కోసం గతేడాది రన్నరప్ గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, బెంగళూరు బుల్స్ రెడీ అయ్యాయి. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలిసారి ట్రోఫీని ముద్దాడేందుకు ఇరు జట్లూ అస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. జోన్-బి టాపర్ అయిన రోహిత్ కుమార్ కెప్టెన్సీలోని బెంగళూరు... ఫస్ట్ క్వాలిఫయర్‌లో గుజరాత్‌నే చిత్తుగా ఓడించి ఫైనల్ బెర్త్ దక్కించుకోవడం విశేషం. అయితే, గొప్పగా పుంజుకున్న జెయింట్స్.. రెండో క్వాలిఫయర్‌లో యూపీ యోధాపై గెలిచి బుల్స్‌తో టైటిల్ ఫైట్‌కు రెడీ అయింది. ఈ సీజన్‌లో ఇరు జట్లు మూడు సార్లు తలపడగా చెరో మ్యాచ్‌లో నెగ్గాయి. ఇంకో పోరు టైగా ముగిసింది. సునీల్ కుమార్ కెప్టెన్సీలో గుజరాత్ టీమ్‌లో స్టార్ రైడర్ సచిన్ తన్వార్ నిలకడగా రాణిస్తున్నాడు. సీజన్‌లో 8.2 సగటు రైడ్ పాయింట్లతో నిలిచిన అతడు.. మొత్తం లీగ్‌లో టాప్-10 రైడర్లలో ఒకడిగా ఉన్నాడు. యూపీతో గత మ్యాచ్‌లో పది పాయింట్లతో గుజరాత్‌ను ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే, సీజన్‌లో 118 పాయింట్లు స్కోర్ చేసిన ప్రపంజన్ కూడా గుజరాత్ టీమ్‌లో కీలక ప్లేయర్. పర్వేష్ (84 పాయింట్లు), కెప్టెన్ సునీల్ (72), రోహిత్ గులియా (56) కూడా రాణిస్తే జెయింట్స్ ట్రోఫీ నెగ్గగలదు. మరోవైపు సోమవారమే గుజరాత్‌ను ఓడించడం.. వారం వ్యవధిలోనే ఆ జట్టుతో మరో మ్యాచ్ ఆడనుండడం బెంగళూరుకు ప్లస్ పాయింట్ అనొచ్చు. ఆ టీమ్‌లో పవన్ కుమార్ (260 పాయింట్లు), కెప్టెన్ రోహిత్ (170) సూపర్ ఫామ్‌లో ఉన్నారు. జెయింట్స్ డిఫెన్స్ కూడా బలంగా ఉండడంతో ఫైనల్ పంగాలో హోరాహోరీ ఆటను ఆశించొచ్చు. టైటిల్ నెగ్గిన జట్టు రూ.3 కోట్లు, రన్నరప్ రూ.1.80 కోట్లు ప్రైజ్‌మనీ దక్కించుకుంటాయి.

నేటి నుంచి ఆసియా కప్ ఫుట్‌బాల్

థాయ్‌లాండ్‌తో ఇండియా తొలిపోరు

అబుదాబి: ఆసియా కప్ ఫుట్‌బాల్ సమరం శనివారంనుంచి ప్రారంభం కానుంది. 2026లో ప్రపంచ కప్ ఆడటమే లక్ష్యంగా ఇండియా జట్టు కోటి ఆశలతో ఈ టోర్నీలో బరిలో దిగుతోంది. మొత్తం 24 జట్లు పాల్గొంటున్న మెగాఈవెంట్ తొలి మ్యాచ్‌లో యూఏఈ జట్టు బహ్రెయిన్‌తో తలపడుతుంది. ఇక ఆదివారం జరిగే గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఇండియా థాయ్‌లాండ్‌తో ఆడుతుంది. ఎనిమిదేళ్ల క్రితం ఈ టోర్నీలో ఆడిన ఇండియా ఆసియాలో బలమైన జట్లు ఆస్ట్రేలియా, దక్షిణకొరియా, బహ్రెయిన్ చేతిలో చిత్తుగా ఓడి గ్రూప్ దశ నుంచే తప్పుకుంది. ఇప్పటి వరకూ నాలుగు సార్లు ఆసియాకప్‌లో ఆడిన ఇండియా చివరి సారిగా 2011లో పోటీపడింది. 2015 ఆసియాకప్‌కు అర్హత సాధించలేకపోయింది.


అవధ్ దూకుడు

అహ్మదాబాద్‌పై ఘనవిజయం

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో అవధ్ వారియర్స్ మళ్లీ గెలుపుబాట పట్టింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ స్మాష్‌మాస్టర్స్‌పై 6-(-1)తో అవధ్ విజయం సాధించింది. టైలో వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గిన అవధ్.. మిగతా మ్యాచ్‌లతో సంబంధం లేకుండా టైను సొంతం చేసుకుంది. ముందుగా జరిగిన మహిళల సింగిల్స్‌లో బీవెన్ జాంగ్ 10-15, 15-11, 15-11తో క్రిస్టీ గిల్మోర్‌పై నెగ్గడంతో అవధ్‌కు శుభారంభం లభించింది. ఇది ట్రంప్‌మ్యాచ్ కావడంతో 2-0 అవధ్ ముందంజ వేసింది. తర్వాత జరిగిన పురుషుల డబుల్స్‌లో యాంగ్ లీ-మార్కస్ క్రిస్టియన్‌సన్ 15-12, 10-15, 15-6తో కిడాంబి నందగోపాల్-సాత్విక్‌సాయి రాజ్‌లపై గెలుపొందారు. నిర్ణయాత్మక పురుషుల సింగిల్స్‌లో సన్‌వాన్ హో 15-7, 8-15, 15-10తో విక్టర్ అక్సెల్‌సన్‌పై గెలుపొందడంతో 4-0తో అవధ్ టైను నెగ్గింది. తర్వాత పురుషుల సింగిల్స్‌లో సౌరభ్ వర్మపై లీడొంగ్ క్యున్, సాత్విక్ సాయిరాజ్-సిక్కిరెడ్డిపై క్రిస్టియన్‌సెన్-అశ్విని పొన్నప్ప గెలుపొందారు.



సన్‌వాన్ హో



చంద్రుడు, మార్స్, గురుడు..

పేర్లు పెట్టారిలా

తాము పెట్టిన పేరే ఉంచాలని తొలినాళ్లలో ఆస్ట్రోనామర్ల పట్టు | ఐఏయూ రాకతో మారిన నామకరణ సూత్రాలు | గ్రహం మీది ప్రాంతాన్ని బట్టి పేర్లు పెడుతున్న ఐఏయూ

మార్స్‌లోని 'ఆ ప్రాంతం'పై నాసా రోవర్ దిగిందట. చంద్రుడి వెనుక భాగంపై ఉన్న 'ఆ ప్రాంతం'లో రోవర్, ల్యాండర్లను చైనా దించిందట. ఇవి సాధారణంగా మనం చదవుతున్నప్పుడు వాక్యాల్లో తగిలే పదాలు. భూమ్మీద ప్రతి ప్రాంతానికి ఓ పేరు ఉన్నట్లే; అంగారకుడు, చంద్రుడు ఇలా మనిషి వెళ్లాలనుకుంటున్న ప్రతి గ్రహంలోని ప్రాంతాలకు భిన్నమైన పేర్లున్నాయి. ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్(ఐఏయూ) వీటిని సూచిస్తుంది. 1919లో ఏర్పాటైన ఐఏయూకు ఈ ఏడాదితో నూరేళ్లు నిండుతాయి. ఐఏయూ మొదలైన తర్వాత రెండు నుంచి మూడు దశాబ్దాల పాటు 'పేర్ల'పై ప్రపంచదేశాల మధ్య గొడవలు తీర్చడమే సరిపోయింది. ముఖ్యంగా చంద్రుడు, అంగారకుడిపై ప్రాంతాలకు తాము పెట్టిన పేర్లనే ఖరారు చేయాలంటూ ఆస్ట్రోనామర్లు ఐఏయూతో వాదించేవారు. దీంతో గ్రహాలపై ప్రాంతాలకు పేర్లు పెట్టేందుకు ఐఏయూ ''నామెన్‌క్లేచర్ వర్కింగ్ గ్రూప్'' ఏర్పాటైంది. పక్క ఫొటోలో ఉన్నది చంద్రుడు. దానిపై ఉన్న ప్రాంతాల పేర్లు ఐఏయూ సూత్రాల ఆధారంగానే పెట్టారు.

నిబంధనలు ఇవీ..

గ్రహం ఏదైనా అక్కడ ఉండే ప్రాంత పరిస్థితిని బట్టి మాత్రమే పేర్లు పెట్టాలని ఐఏయూ నిర్ణయించింది. చంద్రుడు, మార్స్ గ్రహాలపై అప్పటికే పెట్టిన పేర్లకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు మార్స్ గ్రహంపై ఉన్న భారీ లోయలకు మార్స్‌పై పరిశోధనలు చేసిన సైంటిస్టులు, రచయితల పేర్లను మాత్రమే పెట్టాలి. అసిమోవ్ అనే సైంటిస్టు, డావిన్సీ అనే రచయిత పేర్లను మార్స్‌పై ఉన్న రెండు భారీ లోయలకు పెట్టారు. 60 కిలోమీటర్ల కంటే తక్కువ వ్యాసార్థంలో విస్తరించి ఉన్న లోయలకు మాత్రం భూమిపై ఉన్న పట్టణాలు, గ్రామాల పేర్లు పెట్టాలనేది ఐఏయూ మరో ప్రతిపాదన. బోర్డియక్స్ అనే పట్టణం, కాడిజ్ అనే గ్రామం పేర్లను రెండు చిన్నసైజు లోయలకు పెట్టారు.

మార్స్‌పైన చాలా ప్రాంతాలకు లాటిన్, గ్రీక్, ఓల్డ్ ఇంగ్లిష్, జర్మనిక్, సుమేరియన్ భాషల్లోని పదాలనూ వాడారు. అరెస్ వ్యాలీ, టియూ వ్యాలీ, సిముడ్ వ్యాలీ అనే ప్రాంతాలు మార్స్‌పై పక్కపక్కనే ఉంటాయి. ఇవన్నీపైన చెప్పిన భాషల నుంచి తీసుకున్నవే. మార్స్‌పై ఏర్పడే బలమైన అల్పపీడనాన్ని చస్మా అని పిలుస్తారు. పీఠభూమికి 'ప్లానమ్' అని, సువిశాల మైదానాలకు 'ప్లానిటియా' అని, పర్వతాలకు 'మాన్స్' అని ఐఏయూ నామకరణం చేసింది. ఈ పేర్లు ఆ ప్రాంతం ఎలా పుట్టిందో చెబుతుంటాయి. అందుకే గ్రహంలోని మరే ఇతర ప్రాంతంతో పోలికలు కనిపించవు. మార్స్‌పై చాలా పెద్ద పర్వతాలు ఉన్నాయి. ఓ రకంగా ఇవన్నీ అగ్ని పర్వతాలే. అందుకే 'అగ్ని పర్వతం' అనే పదం వీటి పేర్లలో కనిపిస్తుంది.

ఈ విశ్వంలోనే అతి పెద్ద అగ్నిపర్వతం 'ఒలంపస్ మాన్స్' మార్స్‌పైనే ఉంది. టెలిస్కోపులతో భూమ్మీద నుంచి ఒలంపస్‌ను చూడొచ్చు కూడా. దీన్ని కనుక్కున్న తొలినాళ్లలో 'నిక్స్ ఒలంపికా' అని పిలిచేవారు. ఐఏయూ దీన్ని ఒలంపస్ మాన్స్‌గా మార్చేసింది. మాన్స్ అంటే లాటిన్‌లో మౌంటేన్(పర్వతం) అని అర్థం. చంద్రుడిపై కనిపించే నల్లని మచ్చలని ఐఏయూ 'మేర్' అని పిలిచింది.

ఆడవారి పేర్లు.. లేటుగా

చంద్రుడిపై ఉన్న లోయలకు సాంస్కృతిక, లింగ బేధం చూపకుండా పేర్లు ఎంపిక చేయాలని ఐఏయూ నిర్ణయించింది. కానీ అప్పటికే లోయలన్నింటికీ చనిపోయిన సైంటిస్టుల పేర్లను పెట్టేశారు. వాళ్లలో ఎక్కువ మంది పురుషులే ఉన్నారు. దీంతో శుక్ర గ్రహంపై కనుగొనే ప్రతి లోయకూ మహిళల పేర్లే పెట్టాలని ఐఏయూ నిర్ణయించింది. చనిపోయిన మహిళా సైంటిస్టులు లేదా పురాణ గాథల్లోని వీర నారుల పేర్లను వీనస్ మీదున్న లోయలకు పెడతారు. 'నైటింగేల్ కరోనా' ఇందుకో చక్కని ఉదాహరణ. గురు గ్రహానికి ఉన్న చందమామల్లో యూరోపా ఒకటి. ఐవో మరొకటి. యూరోపాకు యూరోపియన్ టెంపరేచర్ జోన్(యూటీజెడ్)లోని పేర్లను పెట్టాలని, భూమధ్య రేఖ వెంబడి నివసించే ప్రజలు నమ్మే దేవతల పేర్లను ఐవో మీదున్న ప్రాంతాలకు పెట్టాలని ఐఏయూ నిర్ణయం తీసుకుంది. యూటీజెడ్‌లో చాలా ప్రాంతాలకు పురాణగాథల ఆధారంగా పేర్లు పెట్టారు. వీటినే యూరోపా మీదున్న ప్రాంతాలకు ఐఏయూ పెడుతుంది. ఇది జరిగిన కొన్ని రోజులకు ఐవో మీద అగ్ని పర్వతాలు తరచూ బద్దలు కావడం మొదలెట్టాయి. దీంతో దానిపై ఉన్న కొన్ని ప్రాంతాలకు ఫైర్, సన్, థండర్ అని పేర్లను మార్చాల్సివచ్చింది.





వయసు ఐదేళ్లు.. బరువు ఐదు కిలోలు

కండలు కుంచించుకుపోయి.. బొక్కలు తేలి.. నీరసంగా అమ్మ భుజంపై వాలిన ఆ చిన్నారి పేరు అబ్దెల్ రహమాన్ మన్షష్. వయసు ఐదేళ్లు. బరువు కేవలం 5 కిలోలు. యెమన్‌లో సంక్షోభం వల్ల పిల్లలు ఎంత దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారో చెప్పేందుకు మరో నిదర్శనం ఈ ఫొటో. పోషకాహారం లేక, కడుపు నిండక చిన్నారులు విలవిల్లాడిపోతున్నారక్కడ. సంక్షోభం పోయి చిన్నారులు ఎప్పుడు కండపడతారో మరి.



అతి నిద్ర అంతు చూస్తది

- ఎంత ఎక్కువ పడుకుంటే అంత తొందరగా చనిపోతారు..
- ఇండియా సహా 21 దేశాల్లో స్టడీ

''మత్తు వదలరా.. నిద్దుర మత్తు వదలరా.. ఆ మత్తులోన పడితే గమ్మత్తుగ చిత్తవుదువురా'' అంటూ ఓ సినిమాలో భీముడిని ఉద్దేశిస్తూ మారు రూపంలో వచ్చిన శ్రీకృష్ణుడు పాడే పాట. అతి నిద్ర వల్ల ఎంతటి ప్రమాదమొస్తదో వివరించే పాటది. నిజ జీవితంలోనూ ఆ అతి నిద్రే అనర్థదాయకమని చైనా మెక్‌మాస్టర్ అండ్ పెకింగ్ యూనియన్ మెడికల్ కాలేజీ సైంటిస్టులు తేల్చారు. మామూలు మనిషికి ఆరు నుంచి 8 గంటల నిద్ర సరిపోతుందని, అంతకన్నా ఎక్కువ పడుకుంటే గుండె జబ్బులొచ్చే ప్రమాదముందని, త్వరగా చనిపోయే ముప్పు ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇండియా సహా 21 దేశాల్లోని 1,16,632 మంది నిద్ర టైంను అంచనా వేసి ఈ విషయం చెబుతున్నారు. 8 గంటల కన్నా ఎక్కువ పడుకునే వాళ్లు త్వరగా చనిపోయే ముప్పు 41 శాతం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఎంత ఎక్కువ సేపు నిద్రపోతే ముప్పు అంత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. మధ్యమధ్యలో కునికిపాట్లు తీస్తూ, రాత్రి పూట ఆరు గంటలకు కొంచెం ఎక్కువ నిద్రపోయినా సేమ్ ఎఫెక్ట్ ఉంటుందని తేల్చారు. కాబట్టి 6 నుంచి 8 గంటలు నిద్రపోతేనే బెటర్ అని సూచిస్తున్నారు. ''వివిధ దేశాల్లో వారి వారి ప్రాంతం, సామాజిక ఆర్థిక పరిస్థితులు, లైఫ్‌స్టైల్ (ధూమపానం, మందు, ఎక్సర్‌సైజ్ లేకపోవడం, తిండి, నిద్ర), జబ్బులు, కుటుంబ చరిత్ర, మందుల వాడకం తదితర విషయాలను అధ్యయనం చేశాం. నిద్ర ఎక్కువ పోతున్న వారి జీవిత కాలం తగ్గుతున్నట్టు గుర్తించాం'' అని చెప్పారు.

మరో పర్వతం ఎక్కేసింది

మౌంట్ విన్సన్‌ను ఎక్కిన తొలి దివ్యాంగురాలిగా అరుణిమా సిన్హా రికార్డు

ఎవరెస్ట్ సహా ఖండాల్లోని ఆరు పర్వతాలను ఎక్కేసిన ఇండియన్




దుండగులు ఆమెని అతి కిరాతకంగా ట్రైన్ నుంచి తోసేశారు. ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఆమె కాలును తీసేశారు వైద్యులు. 2011లో జరిగింది ఆ ఘటన. అయినా ఏం కుంగిపోలేదు. ఒకప్పుడు జాతీయ వాలీబాల్ ప్లేయర్ అయిన ఆమె, కాలు లేకపోయినా మనోధైర్యంతో పర్వతాలను అధిరోహిస్తున్నారు. తాజాగా అంటార్కిటికాలోనే ఎత్తైన మౌంట్ విన్సన్‌ను పట్టుదలతో ఎక్కేశారు. ఆ పర్వతాన్ని ఎక్కిన ప్రపంచంలోనే తొలి దివ్యాంగురాలిగా రికార్డు సృష్టించారు. ఆమె ఎవరో కాదు, పద్మశ్రీ అరుణిమా సిన్హా. ఈ విషయాన్ని ఆమె గురువారం తన ట్విట్టర్‌లో వెల్లడించారు. ''మౌంట్ విన్సన్‌ను అధిరోహించిన ప్రపంచంలోనే తొలి దివ్యాంగురాలిగా రికార్డు, మన దేశం పేరిట నమోదైంది. అందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. జైహింద్'' అంటూ ట్వీట్ చేశారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ ఆమెను అభినందించారు. ''అద్భుతం. విజయంలో కొత్త ఎత్తులు అందుకుంటున్న అరుణిమకు శుభాకాంక్షలు. మనోధైర్యంతో కష్టపడుతూ ఇలాంటి అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న ఆమె ఇండియాకే గర్వకారణం. ఆమె భవిష్యత్ మరింత వెలిగిపోవాలని కోరుకుంటున్నా'' అని ఆయన ట్వీట్ చేశారు. కాగా, ఆమె ఇలాంటి రికార్డు అందుకోవడం ఇదే తొలిసారేం కాదు. అంతకుముందు మౌంట్ ఎవరెస్ట్ సహా మరో ఐదు పర్వతాలను అధిరోహించారు. మౌంట్ ఎవరెస్ట్, మౌంట్ కిలిమంజారో, మౌంట్ ఎల్బ్రస్, మౌంట్ కోషియస్కో, మౌంట్ అకోంకాగ్వాలను ఎక్కారు. ఇప్పుడు మౌంట్ విన్సన్‌ను ఎక్కేసి ఆరు ఖండాల్లోని ఎత్తైన ఆరు పర్వతాలను అధిరోహించాలన్న తన కోరికను నెరవేర్చుకున్నారు. కాగా, కొన్ని కొన్ని సార్లు తనను కాలి నొప్పి బాగా బాధపెడుతుందని, అయినా కూడా ఆరు ఖండాల్లోని ఆరు ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తానంటూ ఇటీవలే ఆమె చెప్పుకొచ్చారు. ఆస్పత్రి బెడ్‌పై ఉన్నప్పుడు పర్వతారోహణ గురించి చదివి దానినే తన జీవితంగా చేసుకున్నానని తెలిపారు.



'చంద్రయాన్ 2' మళ్లీ వాయిదా

ఇండియా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు చంద్రయాన్ 2 మళ్లీ వాయిదా పడింది. గురువారం జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో చంద్రయాన్ 2 వాయిదా వేయడం ఇది మూడోసారి. 2016 డిసెంబర్‌లోనే ప్రయోగం జరగాల్సింది. 2018 అక్టోబర్‌కు వాయిదా వేశారు. ఆ తర్వాత 2019 జనవరి 3న ప్రయోగం చేస్తామని ఇస్రో చెప్పింది. కానీ అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఫిబ్రవరి నెల మధ్యలో ప్రయోగం చేస్తామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఇస్రో సీనియర్ ఆఫీసర్ ఒకరు తెలిపారు. చంద్రయాన్ 2లో ఓ ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉన్నాయి. ల్యాండర్ చంద్రుడిపై దిగి రోవర్‌ను వదులుతుంది. ఆరు చక్రాలతో తయారైన రోవర్ చంద్రుడిపై కలియదిరిగి, అక్కడి నేల శాంపిల్స్‌ను ఇస్రోకు పంపుతుంది. 3,290 కిలోల బరువుండే ఆర్బిటార్ చంద్రుడి చుట్టూ తిరుగుతూ రిమోట్ సెన్సింగ్ చేస్తుంది. ఖనిజాలు, నీళ్లు, మంచు తదితరాల కోసం అన్వేషిస్తుంది.



మార్స్‌పై బతుకు అంత ఈజీ కాదట

బొంగరం లాంటి గూటిలో సుమారు 400 రోజుల ప్రయాణం. ఎటు చూసినా ఒకేలా కనిపించే విశ్వం. మార్స్‌కు వెళ్లే మనుషులపై మెదడుపై చాలా ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. సుదూర ప్రయాణం తీరని అలసటకు గురి చేసే ప్రమాదం ఉందని చెబుతున్నారు. 'టెక్నికల్ చాలెంజెస్ ఆఫ్ రీచింగ్ ది రెడ్ ప్లానెట్' అనే థీమ్‌తో కొందరు నిపుణులు గత వారం లండన్‌లో సమావేశమయ్యారు. మార్స్‌పై నివాసం కోసం కృత్రిమంగా ఏర్పాటు చేసిన ఓ బేస్ లోపల రంగు పోవడాన్ని ఓ సైంటిస్టు ప్రస్తావించారు. మార్స్ యాత్రకు బయల్దేరే క్రూలో సగానికిపైగా మిషన్‌ను పూర్తి చేయలేరని వ్యాఖ్యానించారు. మరో సైంటిస్టు మాట్లాడుతూ మార్స్‌పై బతకడానికి సాంకేతిక బలం కంటే, మానసిక దృఢత్వమే ఎక్కువగా ఉండాలన్నారు. మార్స్ నుంచి భూమికి సిగ్నల్ చేరాలంటే కనీసం నాలుగు నుంచి 24 నిమిషాల టైం పడుతుంది. ఇది ఆస్ట్రోనాట్లను మరింత కుంగదీస్తుందని చెప్పారు. మిషన్ కంటే ముందు సైకలాజికల్ టెస్టులు చేస్తున్నా, మార్స్‌పై ఉన్న వాతావరణ పరిస్థితులకు ఇవి సరిపోతాయా అన్నది అనుమానమేనని అన్నారు. ''400 రోజుల ప్రయాణమంటే మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వీటిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని సాధించాలి. ఐఎస్ఎస్‌కు తొందరగా వెళ్లి, వచ్చేస్తున్నాం. అందుకే మానసిక సమస్య అనే ఇబ్బంది రావడం లేదు'' అని ఆయన అన్నారు.



ఏమెట్టి చేశారో ఈ సైకిల్

కారును ఢీకొట్టి డ్యామేజ్ చేసేసింది

అటువైపుగా ఓ సైకిల్ వెళుతోంది. దానికి ఎదురుగా ఓ కారొస్తోంది. రెండు ఎదురెదురుగా ఢీకొట్టేసుకున్నాయి! అరెరె.. సైకిల్ తొక్కుతున్న వ్యక్తికి ఏమన్న అయిందా? అని కంగారు పడాల్సిన పనిలేదు. ఫొటో చూడండి.. కారెలా పాడైందో! సైకిల్ ఎలా చెక్కుచెదరకుండా ఉందో! సైకిల్ ఢీకొట్టడం వల్లే ఆ కారు అలా డ్యామేజ్ అయిందట. ఇదెక్కడి చోద్యం అని అనుకుంటున్నారా.. ఈ చోద్యం చైనాలోని షెంజెన్‌లో జరిగిందట. ఏం కాదులే.. అదంతా ఫేక్ అయి ఉంటుందని అనుకుంటున్నారా? ఇది నిజ్జంగా నిజ్జం అని అక్కడి పోలీసోళ్లు చెబుతున్నారు. ఇది మార్ఫ్ చేసిన ఫొటో కాదని, ఫొటోషాప్‌లో అంతకన్నా చేయలేదని, నిజమని చెబుతూ యాక్సిడెంట్ వీడియోను కూడా విడుదల చేశారు మరి. ఆ ఫొటో, వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మరి, ఆ ఫొటోను చూశాక నెటిజన్లు ఊరుకుంటారా? జోకులు పేల్చేస్తున్నారు. బహుశా నోకియా ఈ సైకిల్‌ను తయారుచేసిందేమో అని ఒకరంటే.. ''ఈ బైక్ నాక్కావాల్సిందే'' అని ఇంకొకరు అంటున్నారు. ఏం పెట్టి చేశారో ఈ సైకిల్‌ను అంటూ తెగ రీట్వీట్లు చేసేస్తున్నారు చైనా జనం.





బుడ్డోడికి భూమ్మీద నూకలున్నయ్

నాలుగో అంతస్తు నుంచి పడినా చిన్నారి సురక్షితం

ఈ బుడ్డోడికి భూమ్మీద ఇంకా నూకలున్నట్టున్నాయి. అందుకే, నాలుగు అంతస్తుల బిల్డింగ్ పైనుంచి పడినా చిన్న గాయం కాకుండా బతికాడు. ఈ ఘటన ముంబైలోని గోవండిలో శుక్రవారం జరిగింది. ఏడాది వయసున్న ఆ బుడ్డోడి పేరు అథర్వ బర్కదే. ఆ బుడ్డోడి నానమ్మ కిటికీ తలుపులు తెరిచింది. అయితే, ఆమె వెనకే పాకుతూ జరజరా వచ్చేసిన ఆ చిన్నోడిని గమనించలేదు. చూసే లోపు కిటికీలో నుంచి పడిపోయాడు. అంతెత్తునుంచి పడినా ఆ చిన్నారికి ఏమీ కాలేదంటే కారణం.. ఆ బిల్డింగ్‌కు ఆనుకుని ఉన్న పెద్ద చెట్టే. అవును, అతడు కిటికీలో నుంచి బయటకు పడగానే ఆ చెట్టు కొమ్మలకు చిక్కుకున్నాడు. ఆ కొమ్మ వంగి నెమ్మదిగా నేలపైకి జారాడు. అందుకే పెద్దగా దెబ్బలు తగలకుండా సురక్షితంగా బయటపడ్డాడు. ఏమైందో ఏమో అని ఏడుస్తూ కిందకు దిగిన ఆ చిన్నారి తల్లిదండ్రులు అజిత్, మంగళ బర్కదేలు, లేచి నిలబడడానికి ప్రయత్నిస్తున్న తమ కొడుకును చూసి ఊపిరిపీల్చుకున్నారు. అక్కడక్కడా గీసుకుపోవడం తప్ప ఒంటిపై పెద్దగా దెబ్బలు లేకపోవడంతో రిలాక్స్ అయ్యారు.

ఇక ప్లాస్టిక్ బుల్లెట్లు

- తయారు చేసిన డీఆర్‌డీవో
- పెల్లెట్ల స్థానంలో వాడకం
- మృతులు పెరగడంతో మార్పు

హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీని 2016లో హతమార్చాక కాశ్మీర్‌లో చెలరేగిన ఆందోళనను అదుపు చేయడానికి పెల్లెట్ బుల్లెట్లు వాడితే దాదాపు వంద మంది చనిపోయారు. వందలాది మంది చూపు కోల్పోయారు. వేలాది మంది గాయపడ్డారు. దీంతో సర్కారుపై తీవ్ర విమర్శలొచ్చాయి. వెంటనే ప్రత్యామ్నాయం సూచించాలని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)ను కేంద్ర హోంశాఖ కోరింది. తాజాగా ఆ పెల్లెట్ బుల్లెట్ల స్థానంలో సరికొత్త ప్లాస్టిక్ బుల్లెట్లను డీఆర్‌డీవో సిద్ధం చేసింది. ఏకే 47 గన్‌లతో వీటిని వాడొచ్చని సంస్థ వెల్లడించింది. దిగుమతి చేసుకునే రబ్బర్ బుల్లెట్ల కన్నా తక్కువ హానికరమంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్లాస్టిక్ బుల్లెట్లు బాగా పని చేస్తాయని, ఇప్పటికే లక్ష బుల్లెట్లను జమ్మూ కశ్మీర్ పోలీసులకు పంపామని టర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ లేబొరేటరీ డైరెక్టర్ మంజిత్ సింగ్ చెప్పారు. ప్లాస్టిక్ బుల్లెట్లను 50 మీటర్ల దూరం నుంచి కాల్చినా దెబ్బలు తక్కువగా తగులుతాయని, వాటిని నైలాన్‌తో తయారు చేశామని డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు. తల భాగం మొండిగా ఉంటుందని, కాబట్టి శరీరంలోకి చొచ్చుకెళ్లదన్నారు. ప్లాస్టిక్ బుల్లెట్లలో లెడ్ ఉండదు కాబట్టి విషపూరితమూ కాదని వివరించారు. కాల్చినపుడు మాత్రం సాధారణ గన్‌లానే తీవ్రత ఉంటుందని చెప్పారు. స్టాండర్డ్ వెపన్‌లలో బుల్లెట్లను వాడొచ్చని, కేవలం మ్యాగజైన్‌ను మార్చితే సరిపోతుందని వివరించారు.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008.
and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.